www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సుమిత్ జిగేల్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 27వ ర్యాంకర్ బబ్లిక్‌పై సంచలన విజయం

గ్రాండ్‌స్లామ్‌లో సీడెడ్‌ను ఓడించిన రెండో భారతీయుడు

ప్రత్యర్థిని వరుస సెట్లలో మట్టికరిపించి రెండో రౌండ్‌కు

11



బుధవారం | 17-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 289

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 10.08 తదుపరి అష్టమి; నక్షత్రం: రేవతి తె. 3.35 తదుపరి అశ్విని; వర్జ్యం: సా.4.07-5.38; దుర్ముహూర్తం: మ.12.03-12.48; అమృతఘడియలు: రా.1.17-2.49; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.58

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



3

చంద్రబాబు కేసు విస్తృత ధర్మాసనానికి!

స్కిల్ కేసులో 17ఏ వర్తింపజేయడంపై ద్విసభ్య ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు

చీఫ్ జస్టిస్‌కు నివేదిస్తూ నిర్ణయం

17ఏ వర్తిస్తుంది.. కేసు అక్రమం

ముందస్తు అనుమతి తప్పనిసరి: జస్టిస్ బోస్

పాత నేరాలకు వర్తించదు: జస్టిస్ త్రివేది



ఏపీసీసీ అధ్యక్షురాలిగా

వైఎస్ షర్మిల

ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం


సీడబ్ల్యూసీ ఆహ్వానితుడిగా గిడుగు

పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తా: షర్మిల

షర్మిలకు బాధ్యతలపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

పీసీసీ చీఫ్ వారసుల్లో ఆ పదవికి ఎన్నికైన తొలి వ్యక్తి

12



వెంటిలేటర్‌పై తమ్మినేని వీరభద్రం!

ఉదయాన్నే గుండెపోటు.. ఖమ్మంలో వైద్యం

అనంతరం హైదరాబాద్ ఏఐజీకి తరలింపు

పరిస్థితి విషమం, చికిత్స అందిస్తున్నాం

వెల్లడించిన ఏఐజీ ఆసుపత్రి వర్గాలు

13

సర్పంచులకు పెండింగ్

బిల్లుల సమస్య

మా హయాంలో కరోనాతో కొంత కిందా మీదా అయింది

13

సర్పంచుల తరఫున గొంతు విప్పుతాం

ఆ బాధ్యతను మేం తీసుకుంటాం: కేటీఆర్

విచారణకు రండి.. కుదరదు!

ఒక్క రోజు గడువుతో పిలిచిన ఈడీ

కుదరదని చెప్పిన ఎమ్మెల్సీ కవిత

ఢిల్లీ మద్యం కేసులో మళ్లీ కదలిక

12



నెక్లెస్‌రోడ్డులోని జైపాల్‌రెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం సతీమణి గీత, కుటుంబసభ్యులు

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు

జైపాల్‌రెడ్డి పేరు

13

ప్రభుత్వంలో చర్చించి నిర్ణయం: కోమటిరెడ్డి

రాష్ట్ర ఏర్పాటులో జైపాల్‌ది కీలక పాత్ర: గుత్తా

నేను ఒరిజినల్.. కేటీఆర్ డూప్లికేట్!

ఇది ఇంకో ఏడాదిలో స్పష్టంగా తెలిసి వస్తుంది

మన హైదరాబాద్‌కు మరే నగరం సాటి రాదు

లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాలు సాధిస్తాం

బీజేపీకి మూడోస్థానమే.. మోదీకి కౌంట్‌డౌన్ షురూ

అయోధ్య, భద్రాద్రికి తేడా లేదు.. దేవుడితో రాజకీయాలా?

ప్రతిపక్షంలో 20 ఏళ్లు ఉన్నా.. ఆ అనుభవంతో సుపరిపాలన అందిస్తా

దావోస్‌లో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

13



వరల్డ్ ఎకనమిక్ ఫోరం అధ్యక్షుడు బోర్గ్‌తో సమావేశమైన సీఎం రేవంత్

రెండ్రోజుల్లో 60 భేటీలు

తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యం.. దావోస్‌లో సీఎం రేవంత్ బిజీబిజీ

సర్కారు అందించే సాయంపై.. పారిశ్రామికవేత్తలకు వివరిస్తున్న సీఎం

నోవార్టిస్, మెడ్‌ట్రానిక్స్ సీఈవోలతో ప్రత్యేక భేటీ

నైపుణ్యాభివృద్ధిపై నాస్కామ్ అధ్యక్షుడితో చర్చలు

హైదరాబాద్‌లో సీ4ఐఆర్‌ను స్థాపిస్తాం

కుదిరిన ఎంవోయూ.. వచ్చేనెల 28న ముహూర్తం

ప్రకటించిన డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడు బోర్గ్ బ్రెండ్

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన తొలి విదేశీ పర్యటన సందర్భంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న 54వ ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్)లో బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ సదస్సు సోమవారం ప్రారంభం కాగా.. రెండ్రోజుల్లో 60 మంది వివిధ దేశాల రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక దిగ్గజాలతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు విధానాలను వారికి వివరిస్తూ.. హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను గురించి విశదీకరిస్తున్నారు. డబ్ల్యూఈఎఫ్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో ఆయన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఈ భేటీల్లో పాల్గొన్నారు. అమెజాన్ ఉపాధ్యక్షుడు మైఖేల్ పుంకేతో జరిగిన భేటీలో రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఆ సంస్థ పెట్టుబడుల విస్తరణపై చర్చించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో అమెజాన్ డేటా సెంటర్, రెండో అతిపెద్ద కార్యాలయం ఉన్న విషయం తెలిసిందే. నోవార్టిస్ సీఈవో వాస్ నరసింహన్‌తోనూ రేవంత్‌రెడ్డి చర్చలు జరిపారు. ఆ సంస్థ ప్రధాన కేంద్రం స్విట్జర్లాండ్‌లో ఉండగా.. భారత్ కేంద్రంగా హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం కొనసాగుతోంది. ఇక్కడ పరిశోధన-అభివృద్ధి(ఆర్అండ్‌డీ), క్లినికల్ డెవలప్‌మెంట్, మెడికల్ రైటింగ్‌కు సంబంధించిన విభాగాలున్నాయి. భవిష్యత్‌లో నోవార్టిస్ విస్తరణలో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా సీఎం కోరారు. యూఎస్ అగెనెస్ట్ అల్జీమర్స్ చైర్మన్ జార్జ్ వ్రాడెన్‌బర్గ్‌తోనూ సీఎం సమావేశమై.. తెలంగాణలో ఆరోగ్య

మిగతా 13వ పేజీలో...

14

రిటైర్డుకు మంగళం?

పోస్టుల్లో కొనసాగుతున్న రిటైర్డు ఉద్యోగులను తొలగించే చాన్స్?

రంగం సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

జాబితా నేటి సాయంత్రంలోగా ఇవ్వాలి

అన్ని శాఖలకు సీఎస్ ఉత్తర్వులు

3 నెలల్లో ఆర్ఆర్ఆర్

భూసేకరణ

ఇదే వ్యవధిలో పనులకు టెండర్లు

అధికారులకు రేవంత్‌రెడ్డి ఆదేశాలు

1935.35 హెక్టార్ల భూసేకరణ లక్ష్యం

1459.28 హెక్టార్ల సేకరణ పూర్తి

గత సర్కారు ధోరణితో పనుల్లో జాప్యం

పట్టాలెక్కించాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను మూడు నెలల్లో పూర్తి చేయాలని.. నిర్మాణ పనులకు టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. తెలంగాణకు పెట్టుబడులను తీసుకొచ్చే లక్ష్యంతో దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం అక్కడి నుంచే అధికారులకు ఆదేశాలిచ్చారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) అవతల నిర్మించతలపెట్టిన ఆర్ఆర్ఆర్ భూసేకరణ

మిగతా 13వ పేజీలో...

ఎగిరే పతంగం..

తెగే ప్రాణం



మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో మాంజాతో వాహనదారుడి మెడకు అయిన గాయం

రాష్ట్రంలో వేర్వేరు ఘటనల్లో నలుగురు వ్యక్తుల దుర్మరణం

విద్యుదాఘాతంతో ఇద్దరు.. భవనంపై నుంచి పడి ఇద్దరు..!

4 రోజుల్లో ప్రాణాలు కోల్పోయినవారు 9 మంది

మాంజాతో ఘట్‌కేసర్‌లో వ్యక్తి మెడకు తీవ్ర గాయం

వికారాబాద్, మెదక్ జిల్లాల్లో ఇద్దరు యువకులకు కూడా..

నిషేధించినప్పటికీ విచ్చలవిడిగా చైనా మాంజా విక్రయాలు

కాకినాడ పందెం కోడి రూ.400కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లోని మిగతా జిల్లాల్లో రూ.100కోట్ల పైనే..

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పతంగి ఎగురవేసే ఉత్సాహంలో ఉన్నవారిని ప్రమాదం మింగేసింది. అప్పటివరకు సరదాగా గడిపినవారిని మృత్యువు అమాంతం కబళించింది. భవనాలపై నుంచి పడి, విద్యుత్తు షాక్ తగిలి చిన్నారులు, యువకులు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు రాష్ట్రంలో చోటుచేసుకున్నాయి. తెగిపడిన చైనా మాంజాలు మెడకు చుట్టుకుని పలువురు తీవ్రంగా గాయపడ్డారు. విద్యుత్తు స్తంభం వద్ద ఉన్న పతంగిని ఇనుప చువ్వతో తీయబోయి షాక్ కొట్టడంతో హైదరాబాద్ మైలార్‌దేవుపల్లి గణేశ్‌నగర్‌కు చెందిన డి.లక్ష్మీవివేక్ (10) మంగళవారం దుర్మరణం చెందాడు. ఇంటి మీద తీగలపై ఉన్న గాలిపటాన్ని తీస్తూ సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం పొట్టిపల్లిలో శివకుమార్ (22) మృత్యువాత పడ్డాడు. యాప్రాల్‌లో బాలుడు (10), రహ్మత్‌నగర్‌లో కపిల్ దేవ్ చౌహాన్ (23) గాలి పటాలు ఎగురవేస్తూ భవనాల మీద నుంచి పడి మృతి చెందారు. కపిల్‌దేవ్ మిత్రులపై అనుమానం ఉందంటూ అతడి

మిగతా 13వ పేజీలో...

అద్దంకి, బల్మూరి ఖరారు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన అధిష్ఠానం

నామినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు





హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనేది తేలిపోయింది. ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి పలువురు కాంగ్రెస్ నేతల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, ఊహాగానాలకు తెరదించుతూ బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్‌కు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పార్టీ తరఫున నామినేషన్లు వేయడానికి సిద్ధంగా ఉండాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌కు ఏఐసీసీ కార్యాలయం నుంచి మంగళవారం సమాచారం వచ్చింది. బీసీ నేత, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్‌ల పేర్లు ఖరారయ్యాయని, సోమవారం అధికారిక ప్రకటన వస్తుందని ప్రచారం జరిగింది. అయితే మంగళవారం మహేశ్ కుమార్‌గౌడ్ పేరుకు బదులు బల్మూరి వెంకట్ పేరు తెరపైకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తుంగతుర్తి సీటును వదులుకున్న అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ సీటు ఇస్తామని పార్టీ హామీ ఇచ్చినట్లు సమాచారం. అలాగే హుజూరాబాద్ సీటును వదులుకున్నందుకు బల్మూరి వెంకట్‌కూ న్యాయం చేస్తామని హామీ లభించింది. యువతకు అవకాశం ఇద్దామన్న కోణంలో ఆయనను ఎంపిక చేశారని ప్రచారం జరుగుతోంది. నామినేషన్ల దాఖలుకు గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంది.

14

గొర్రెల పంపిణీ అవినీతి కేసు..

ఏసీబీ దూకుడు

ఫైళ్ల మాయం కేసును కలిపి ఒక్కటిగా దర్యాప్తు

త్వరలో పలువురికి తాఖీదులు

కూల్‌గా కబ్జా!

అధికారుల సహకారంతో ప్రభుత్వ భూమికి ఎసరు

కొండలు తొలిచి, చెరువును పూడ్చి ప్రైవేటు రోడ్డు

బయో డైవర్సిటీ పార్కుకు కూతవేటు దూరంలోనే

రోడ్డేసిన మూడెకరాల భూమి విలువ 450 కోట్లు

మిగిలిన నాలుగెకరాలకు రెక్కలు వచ్చే అవకాశం

ఎన్నికల కోడ్ సమయంలో మొదలైన పనులు

ప్రభుత్వం మారినా కొనసాగుతున్న సహకారం

లక్షల మంది చూస్తుండగా కొండలు తొలుస్తున్నా


మాకేం తెలియదంటూ అధికారులంతా మౌనం

అన్ని శాఖల్లోనూ అక్రమ రోడ్డుపై దాటవేత వైఖరి

గత సర్కారులో మంత్రి బామ్మర్దికి ప్రాజెక్టుతో లింకు

ఆయన నివాసం కూడా అందులోని విల్లాల్లోనే

ఖాజాగూడ పెద్దచెరువు పక్కన ప్రభుత్వ కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు వేస్తున్న దృశ్యం



హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నడిబొడ్డున ప్రభుత్వ భూమిలోంచి అడ్డగోలుగా ప్రముఖ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు రోడ్డు వేస్తున్నారు. రోజూ లక్షల మంది చూస్తుండగా కొండలను తొలిచి అడ్డగోలుగా రోడ్డు నిర్మిస్తున్నా అక్కడేం జరగనట్లు రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖ అధికారులు వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత మొదలైన ఈ కబ్జాపర్వం కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా నెల రోజులుగా కొనసాగుతోంది. ప్రభుత్వ భూమిలో వంద అడుగుల మేర 400 మీటర్ల పొడవున కొండలు తొలుస్తూ శరవేగంగా రోడ్డు పనులు జరుగుతున్నాయి. అధికారులను ఎవర్ని అడిగినా మేమెలాంటి అనుమతులు ఇవ్వలేదు అంటున్నారు. రోడ్డు పనులు మాత్రం జరుగుతూనే ఉన్నాయి. రూ.450 కోట్ల విలువైన మూడెకరాల ప్రభుత్వ భూమి

మిగతా 12వ పేజీలో...

అధర్మంగా వస్తే.. రాముడు

తీసుకోవద్దన్నారు

కొందరు అధికారులు దీనిని గుర్తుంచుకోవాలి

సుపరిపాలనకు రామరాజ్యమే మనకు ప్రేరణ

సుపరిపాలనకు 'నాసిన్' సరికొత్త కేంద్రం

ఏపీలోని సత్యసాయి జిల్లాలో అతిపెద్ద నాసిన్

క్యాంపస్ ప్రారంభోత్సవంలో ప్రధాని వ్యాఖ్యలు

లేపాక్షిలో వీరభద్రుడికి స్వయంగా హారతి

అల్లూరి జిల్లా గిరిజనులతో ముఖాముఖి

3





జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో మంచులో పర్యాటకులు

గడ్డకట్టిన ఉత్తరాది!

» పలు చోట్ల -1.6 డిగ్రీల ఉష్ణోగ్రత.. మరో 5రోజులు ఇంతే

న్యూఢిల్లీ/శంషాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది గడ్డకట్టింది..! ముఖ్యంగా హిమాలయాల శివాలిక్ శ్రేణులు, గంగానది పరీవాహకాల్లో మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భారత వాతావరణశాఖ ఈ ప్రాంతాలకు రానున్న ఐదు రోజులు దట్టమైన పొగమంచు, అతి శీతల పవనాల హెచ్చరికలను జారీచేసింది. పంజాబ్, తూర్పు మధ్యప్రదేశ్, వాయవ్య రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మైనస్ 1.6 నుంచి 3డిగ్రీలుగా నమోదయ్యాయి. వీటితోపాటు.. ఢిల్లీ, హరియాణా, చండీగఢ్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు నుంచి అతిదట్టమైన పొగమంచు ప్రభావం ఉందని, రానున్న ఐదు రోజులు ఈ ప్రాంతాల్లో శీతల, అతిశీతల పవనాలు వీస్తాయని హెచ్చరించింది. కర్ణాటక, ఏపీల్లోనూ ఉదయం వేళ పొగమంచు ప్రభావం ఉన్నట్లు వివరించింది. దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో రైలు, విమాన ప్రయాణాలకు ఆటంకం ఏర్పడింది. శీతల గాలుల వల్ల పలు రాష్ట్రాల్లో స్కూళ్లకు సెలవులను ప్రకటించారు. పొగమంచు కారణంగా శంషాబాద్ విమానాశ్రయంలోనూ పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి.

ఆరు మెట్రో విమానాశ్రయాల్లో వార్ రూమ్స్

వాతావరణ సమస్యలతో విమానాల రాకపోకల ఆలస్యం నేపథ్యంలో పౌర విమానయాన శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా ఆరు విమానాశ్రయాల్లో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి వార్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మంగళవారం తెలిపారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై విమానాశ్రయాల్లో వార్ రూమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఎక్స్‌లో పేర్కొన్నారు. ఢిల్లీ విమానాశ్రయంలోని కేటగిరీ 3లో ఉన్న 29ఎల్ రన్‌వేను మంగళవారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. తద్వారా లో విజిబిలిటీ పరిస్థితిలోనూ విమాన రాకపోకలు సాగించే వీలుంటుందన్నారు.

శబరిమలలో వైభవోపేతంగా మకరవిళక్కు

తిరువనంతపురం/న్యూఢిల్లీ, జనవరి 16: "స్వామియే శరణం అయ్యప్పా".. అంటూ వేల మంది భక్తుల శరణుఘోషల మధ్య శబరిమల అయ్యప్ప సన్నిధిలో వైభవోపేతంగా మకరవిళక్కు వేడుకలు జరిగాయి. సోమవారం సాయంత్రం 6.45 సమయంలో సన్నిధానానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొన్నంబలమేడు(కాంతిమల)పై అయ్యప్పస్వామి జ్యోతి రూపంలో దర్శనమిచ్చారు. ఇదిలా ఉండగా, సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే సమయంలో గంగానదిలో పుణ్యస్నానాలు ఆచరించడం ఆనవాయితీ. ముఖ్యంగా గంగానది బంగాళాఖాతంలో కలిసే ప్రదేశమైన పశ్చిమ బెంగాల్‌లోని 'గంగాసాగర్' ప్రాంతానికి భక్తులు పోటెత్తుతారు. సోమవారం రికార్డు స్థాయిలో కోటి మందికి పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, సమీపంలోని కపిల మహర్షి ఆలయాన్ని సందర్శించారని అధికారులు తెలిపారు. అటు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద త్రివేణి సంగమంలోనూ 21 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలాచరించారు.

20న నా ఆఫీసుకు వచ్చి విచారించండి: సొరేన్

రాంచీ, జనవరి 16: భూమి అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తన కార్యాలయానికి వచ్చి విచారణ జరుపుకోవాలని ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి సూచించారు. ఈ నెల 20న వచ్చి తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారి ఒకరు ఈడీకి లేఖ రాశారు. తమ కార్యాలయానికి విచారణకు రావాలంటూ ఏడు సార్లు ఈడీ సమన్లు ఇచ్చినా..అందతా రాజకీయ కుట్ర అని పేర్కొంటూ సొరేన్ వాటిని పక్కనపెట్టారు. దాంతో ఈ నెల 13న ఈడీ మరోసారి సమన్లు పంపించింది. ఈ నెల 16-20 తేదీల మధ్య హాజరు కావాలని సూచించింది. దానికి స్పందనగా ఈడీకి సొరేన్ లేఖ రాస్తూ ఈ నెల 20న తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.

'మోదీ డిగ్రీ'.. ఆప్ నేతలపై విచారణ నిలుపుదల

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రధాని మోదీ డిగ్రీ వివాదానికి సంబంధించి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుల మీద గుజరాత్ కోర్టులో జరుగుతున్న విచారణపై మంగళవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. మోదీ విద్యార్హతలపై తప్పుడు వ్యాఖ్యలు చేశారంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌లపై గుజరాత్ వర్సిటీ అహ్మదాబాద్ కోర్టులో పరువునష్టం దావా వేసింది. ఆ కోర్టు ఇచ్చిన సమన్లను కొట్టివేయాలని, ఈ కేసును వేరే రాష్ట్రానికి వీలైతే కోల్‌కతాకు బదిలీ చేయాలని కోరుతూ సంజయ్ సింగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ జరిపింది. గుజరాత్ ట్రయల్ కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే విధించిన ధర్మాసనం..కేసు బదిలీపై 4 వారాల్లో సమాధానం ఇవ్వాలని గుజరాత్ హైకోర్టును ఆదేశించింది.

ఒక వాహనానికి ఒకే ఫాస్ట్ ట్యాగ్

కేవైసీ లేకపోతే ఈ నెల 31 తరువాత పనిచేయవు: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 16: ఒక ఫాస్ట్‌ట్యాగ్‌ను పలు వాహనాలకు ఉపయోగించినా, ఒక వాహనానికి పలు ఫాస్ట్‌ట్యాగులు వినియోగించినా ఇకపై చెల్లదు. ఏ వాహనానికి ఆ ఫాస్ట్ ట్యాగునే వాడాలి. అందుకోసం ఫాస్ట్‌ట్యాగ్‌ను కొనుగోలు చేసినప్పుడు నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రక్రియను వినియోగదారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కేవైసీ చేయించని ఫాస్టాగ్‌లు ఈ నెల 31వ తేదీ తర్వాత పనిచేయవు. ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తాజాగా తీసుకున్న ఫాస్ట్‌ట్యాగ్‌కు కేవైసీని పూర్తి చేయాలని, అంతకు ముందు తీసుకున్న ఫాస్ట్‌ట్యాగ్‌లు అన్నింటినీ రద్దు చేసుకోవాలని ఎన్‌హెచ్ఏఐ వాహనదారులకు సూచించింది. తాజాగా తీసుకున్న ఫాస్ట్‌ట్యాగ్ మాత్రమే యాక్టివ్‌గా ఉంటుందని, ఈ నెల 31 తరువాత మిగిలినవన్నీ డీయాక్టివేట్/బ్లాక్ లిస్టులోకి వెళ్లిపోతాయని స్పష్టం చేసింది.

ఆర్థిక నేరగాళ్ల కోసం బ్రిటన్‌కు 3 ఏజెన్సీల బృందం

» మాల్యా, నీరవ్, భండారీలపై దృష్టి

న్యూఢిల్లీ, జనవరి 16: బ్రిటన్‌కు పరారైన ఆర్థిక నేరగాళ్లను దేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఎన్ఐఏలు కలిసికట్టుగా ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ మూడు ఏజెన్సీలు ఉమ్మడిగా అధికార్ల బృందాన్ని నియమించి ఆ దేశానికి పంపించనున్నాయి. పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్లయిన కింగ్ ఫిషర్ యజమాని విజయ్ మాల్యా, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీతో పాటు, ఆయుధాల డీలరైన సంజయ్ భండారీని భారత్‌ను తీసుకురావడానికి చర్యలు తీసుకోనున్నాయి. బ్రిటన్-భారత్‌ల మధ్య పరస్పర న్యాయ సహాయ ఒప్పందం కుదరడంతో ఆ ముగ్గుర్ని అప్పగించేందుకు ఆ దేశం కూడా సాయపడాల్సి ఉంటుంది.

పాక్ ఉగ్ర స్థావరాలపై ఇరాన్ దాడి

టెహ్రాన్, జనవరి 16: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ జైష్-అల్-ఆదిల్‌కు చెందిన రెండు కీలక స్థావరాలపై ఇరాన్ ముప్పేట దాడులు జరిపింది. మంగళవారం సాయంత్రం క్షిపణులు, సూసైడ్ డ్రోన్‌లతో ఈ దాడులు జరిపినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని గ్రీన్‌మౌంటెన్ ప్రాంతంలో.. పంజ్‌గురు సరిహద్దులో జైష్-అల్‌ను లక్ష్యంగా చేసుకున్న దాడుల్లో ఆ సంస్థకు చెందిన రెండు హెడ్‌క్వార్టర్లు నేలమట్టమైనట్లు వెల్లడించింది. ఈ ఘటనల్లో మరణాలు కూడా భారీగా ఉండి ఉంటాయని తెలుస్తోంది. ఇప్పటికే ఐఆర్‌జీసీ ఇరాక్‌లోని కుర్దిస్థాన్‌లోని అమెరికా కాన్సులేట్ సమీపంలో, సిరియాలోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేసిన విషయం తెలిసిందే. జైష్-అల్-ఆదిల్ ఉగ్ర సంస్థ తరచూ కవ్వింపు చర్యలకు పాల్పడుతుండడంతో.. పకడ్బందీ వ్యూహంతో మంగళవారం దాడులు చేసినట్లు తెలుస్తోంది.

అయోధ్యలో సుందరకాండ


మైసూరు బాల రాముడికే పట్టాభిషేకం.. అయోధ్య గర్భగుడి కోసం ఎంపిక చేసిన ట్రస్ట్

ఆలయంలో ప్రతిష్ఠాపన క్రతువులు ప్రారంభం

బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామమందిరంలో ప్రతిష్ఠించనున్న బాల రాముడి విగ్రహంపై సస్పెన్స్ వీడింది. మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన విగ్రహాన్ని గర్భగుడిలో ప్రతిష్ఠించడానికి ఎంపిక చేసినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రకటించింది. గత 70ఏళ్లుగా అయోధ్య రామమందిరంలో పూజలందుకుంటున్న రామ్‌లల్లా విగ్రహంతో పాటు ఈ నూతన విగ్రహం కూడా కొలువుదీరనుంది. ఐదేళ్ల బాలుడిగా, నిలబడిన భంగిమలో 150కిలోలకు పైగా బరువున్న కొత్త విగ్రహాన్ని గర్భగుడిలోని ఆసనంపై ఉంచుతామని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. ఈ విషయం తెలియగానే యోగిరాజ్ ఉద్వేగానికి లోనయ్యారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ క్రతువులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 22న రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సంబంధించిన పూజా కార్యక్రమాలను మంగళవారం నుంచే ఆలయ ప్రాంగణంలో మొదలుపెట్టినట్లు ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ తెలిపారు. ఈ క్రతువులు 21వ తేదీ వరకూ కొనసాగుతాయన్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం తొలిరోజు 16న ప్రాయశ్చిత్త పూజ, సరయూ నది ఒడ్డున దశవిధ స్నానం, గోపూజ, విష్ణుపూజ నిర్వహించారు. 22న మధ్యాహ్నం 12.20గంటలకు రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం మొదలవుతుందన్నారు. రామమందిరం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో భారతదేశ శాస్త్రీయ మంగళ వాయిద్యాలను వాయించనున్నట్లు ఆలయ ట్రస్ట్ తెలిపింది. 22న ఆలయంలో వాయిద్య ప్రదర్శన కోసం దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంగీత విద్వాంసులను ఎంపిక చేసినట్లు ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. వీరు భారతీయ సంప్రదాయానికి చెందిన వివిధ రకాల వాయిద్యాలను వాయిస్తారని వివరించారు. వాటిలో ఘటం (ఏపీ), మృదంగం, నాదస్వరం(తమిళనాడు), వీణ(కర్ణాటక), తంబురా (ఛత్తీస్‌గఢ్), షెహనాయ్(ఢిల్లీ) ఉంటాయన్నారు.



అయోధ్య గర్భగుడి తలుపులు



అరుణ్ యోగిరాజ్

అయోధ్యలో వెలిగిన 108 అడుగుల అగరుబత్తి



అయోధ్య రాముడికి గుజరాత్ నుంచి భక్తులు వడోదర నుంచి కానుకగా పంపిన 108 అడుగుల అగరుబత్తీని మంగళవారం వెలిగించారు. భారీ జనసందోహం 'జై శ్రీరామ్' నినాదాలు చేస్తుండగా శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మహంత్ నృత్యగోపాల్ దాస్ దీన్ని వెలిగించారు. 108 అడుగుల పొడవు.. మూడున్నర అడుగుల వెడల్పుతో 3,610 కేజీల బరువున్న ఈ బాహుబలి అగరుబత్తీ ధూపం నుంచి వచ్చే సువాసన సుమారు 50కిలోమీటర్ల వరకూ వ్యాపిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

అంతా శాస్త్రం ప్రకారమే

అయోధ్యలో ఆలయ నిర్మాణం పూర్తి కాకుండానే ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించడం సరికాదంటూ పలువురు పీఠాధిపతులు ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ఈ కార్యక్రమం శాస్త్రాలకు అనుగుణంగానే ఉందని కొందరు మఠాధిపతులు మద్దతు పలుకుతున్నారు. గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ జరిగే సమయానికి దాని నిర్మాణం కూడా పూర్తికాలేదని గుర్తుచేస్తున్నారు. దూధేశ్వర్ మందిరానికి చెందిన మహంత్ నారాయణ్ గిరి మాట్లాడుతూ.. సోమనాథ్ ఆలయంలో పవిత్ర కలశం, ధ్వజస్తంభాన్ని ప్రాణ ప్రతిష్ఠ పూర్తయిన 14 ఏళ్ల తర్వాత ఏర్పాటు చేశారని తెలిపారు.

ఢిల్లీలో సుందరకాండ పారాయణం: ఆప్

అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠతో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీకి కౌంటర్ ఇచ్చేందుకు ఆప్ ప్రయత్నిస్తోంది. ఢిల్లీలో మంగళవారాల్లో 'సుందరకాండ' పారాయణాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. "అందరి శాంతి, సంతోషం కోసం ఆప్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో 'సుందరకాండ' పారాయణాన్ని ఏర్పాటు చేస్తున్నాం. మీ సౌకర్యాన్ని బట్టి మీకు సమీపంలో నిర్వహించే పారాయణ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాను' అని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ 'ఎక్స్' వేదికగా ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన సుందరకాండ పారాయణ కార్యక్రమాల్లో కేజ్రీవాల్‌తో పాటు పలువురు ఆప్ నాయకులు పాల్గొన్నారు. దీనిపై మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆప్ కూడా బీజేపీ, ఆరెస్సెస్‌ల ఎజెండాను అనుసరిస్తోందని వ్యాఖ్యానించారు.

రామాలయ ప్రతిష్ఠను రాజకీయం చేశారు

అందుకే మేం వెళ్లడం లేదు: రాహుల్

నాగాలాండ్ చేరిన 'జోడో న్యాయ్ యాత్ర'



కోహిమా, జనవరి 16: అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపనను ఎన్నికల వేళ బీజేపీ రాజకీయ కార్యక్రమంగా మార్చేసిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ కార్యక్రమం ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ చుట్టూనే తిరుగుతోందన్నారు. "అందువల్లే దీనికి హాజరు కానని మా అధ్యక్షుడు ఖర్గే స్పష్టం చేశారు. హిందూమతానికి చెందిన పెద్ద పెద్ద పీఠాధిపతులు కూడా ఇది రాజకీయ కార్యక్రమమని బహిరంగంగానే చెప్పారు. అందుచేత దీనికి మేం హాజరవడం కష్టం. అయితే రామాలయాన్ని సందర్శించదలచుకుంటే నిరభ్యంతరంగా వెళ్లవచ్చని మా భాగస్వామ్య పక్షాలకు, మా పార్టీలోని వారికి కూడా స్పష్టం చేశాం" అని రాహుల్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ నెల 14న మణిపూర్‌లోని తౌబల్‌లో ఆయన ప్రారంభించిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' సోమవారం నాగాలాండ్‌కు చేరుకుంది. ఈ నేపథ్యంలో రాహుల్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. తమ 'ఇండియా' కూటమి పటిష్ఠంగా ఉందని.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. టీఎంసీతో విభేదాలను ప్రస్తావించగా.. భాగస్వామ్య పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. సీట్ల సర్దుబాటు చర్చలు కూడా బాగానే జరుగుతున్నాయని తెలిపారు. రాహుల్ న్యాయ్ యాత్ర 15 రాష్ట్రాల్లో వంద నియోజకవర్గాల గుండా సాగుతుంది. నిరుడు రాహుల్ నిర్వహించిన 'భారత్ జోడో యాత్ర' పూర్తిగా పాదయాత్ర కాగా.. ఈ దఫా ఎక్కువగా బస్సు ద్వారా జరుగుతుంది. అక్కడక్కడా పాదయాత్ర కూడా చేపడతారు. 6,713 కిలోమీటర్ల మేర సాగి.. మార్చి 20 లేదా 21న ముంబైలో ముగియనుంది.

లోకం తీరు



భద్రాద్రి నుంచి అయోధ్యకు

శ్రీరామ రథయాత్ర



శ్రీరామ రథయాత్రను ప్రారంభిస్తున్న బీఎల్ వర్మ

భద్రాచలం/నేలకొండపల్లి, జనవరి 16: అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠకు భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం నుంచి ముత్యాల తలంబ్రాలను కానుకగా తీసుకొని శ్రీరామ రథయాత్ర ప్రారంభమైంది. ఈ రథయాత్రను కేంద్ర మంత్రి బీఎల్ వర్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు రంగాకిరణ్, యాత్ర రూపకర్త, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావులు భద్రాద్రి రామయ్య మూలవరుల సన్నిధిలో రామానుజులువారి విగ్రహాన్ని, ముత్యాల తలంబ్రాలను ఉంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తరువాత లక్ష్మీతాయారు ఆలయంలో సైతం పూజలు నిర్వహించారు. అనంతరం కేంద్ర మంత్రి బీఎల్ వర్మ శ్రీరామ రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అయోధ్యలో ఐదు శతాబ్దాల తర్వాత శ్రీరామ మందిరం ప్రతిష్ఠ జరుగుతోందని, ఈ క్రమంలో దక్షిణ నియోజకవర్గంగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకోవడం పుణ్యప్రదంగా భావిస్తున్నానని తెలిపారు. భద్రాద్రి రామయ్య సన్నిధి నుంచి ముత్యాల తలంబ్రాలు అయోధ్యకు తీసుకెళ్లే కార్యక్రమాన్ని ప్రారంభించడం అదృష్టమని అన్నారు.

భార్య ఐదో పెళ్లి చేసుకుందని..

నాలుగో భర్త ఆత్మహత్య!

ఇండోర్, జనవరి 16: తన భార్య ఐదో పెళ్లి చేసుకుందన్న మనస్తాపంతో.. ఆమె నాలుగో భర్త తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకుని చనిపోయాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిందీ విషాదం. ఇండోర్‌కు చెందిన సునీల్ లోహానీ 2018లో రీనా అలియాస్ సోనీ మహిళను పెళ్లి చేసుకున్నాడు. పాకిస్థాన్ నుంచి వలస వచ్చి భారత్‌లో స్థిరపడ్డ ఆమెకు అప్పటికే మూడు పెళ్లిళ్లు అయ్యి, విడాకులు తీసుకుంది. సునీల్ లోహాన్‌తో కూడా ఆమె కాపురం సజావుగా సాగలేదు. దీంతో గత ఏడాది ఆమె అతణ్ని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. అతడిపై వరకట్న వేధింపుల కేసు కూడా పెట్టింది. అప్పట్నుంచీ ఆ కేసు కూడా నడుస్తోంది. ఇదిలా ఉండగా.. 2023 డిసెంబరు 30న ఆమె అతడితో కొన్ని స్టాంప్ పేపర్ల మీద సంతకాలు పెట్టించుకుని సునీల్ సచ్‌దేవ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. ఆమె వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోవడానికి తొలుత ఒప్పుకొన్న అతడు.. ఆ తర్వాత ఆమె పెళ్లి ఫొటోలు, వీడియోలు చూసి తట్టుకోలేకపోయాడు. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నానంటూ సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అనంతరం.. జనవరి 4న ఆమె పుట్టింటికి వెళ్లి ఆమెతో మాట్లాడ్డానికి ప్రయత్నించాడు. తలుపులను ఎంత తట్టినా తెరవకపోయేసరికి ఆమె ఇంటి గుమ్మం ముందే.. ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తొమ్మిది రోజుల తర్వాత అతడు చనిపోయాడు.

పుతిన్‌తో మోదీ ఫోన్ చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 16: రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ సోమవారం ఫోన్లో చర్చలు జరిపారు. వివిధ ప్రాంతీయ, ప్రపంచ సంబంధ అంశాలపై మాట్లాడుకున్నారు. రెండు దేశాల నడుమ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై ఓ రోడ్‌మ్యాప్ రూపొందించడానికి ఉభయులూ ఈ సందర్భంగా అంగీకరించారు. జనవరి 1న బ్రిక్స్ కూటమి సారథ్య బాధ్యతలను రష్యా చేపట్టింది. భారత్ దానికి సంపూర్ణంగా సహకరిస్తుందని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ గెలవాలని మోదీ.. పార్లమెంటరీ ఎన్నికల్లో మోదీ గెలవాలని పుతిన్ పరస్పరం ఆకాంక్షించుకున్నారని రష్యా అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' ఓ ప్రకటనలో తెలిపింది.

బ్రైటెస్ట్ స్టూడెంట్స్‌లో భారత సంతతి బాలిక



వాషింగ్టన్, జనవరి 16: భారత సంతతికి చెందిన తొమిదేళ్ల బాలిక ప్రపంచ గుర్తింపు సాధించింది. వరల్డ్ బ్రైటెస్ట్ స్టూడెంట్స్ జాబితాలో స్థానం సంపాదించింది. ఇండో- అమెరికన్ ప్రీషా చక్రవర్తి(9) ఈ ఘనత సాధించింది. ప్రపంచంలో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించేందుకు అమెరికాలోని ప్రతిష్ఠాత్మక జాన్స్ హాప్‌కిన్స్ సెంటర్ ఫర్ టాలెంటెడ్ యూత్(జేహెచ్-సీటీవై) ప్రతి సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తోంది. గతేడాది నిర్వహించిన ఈ పరీక్షల్లో ప్రపంచవ్యాప్తంగా 90 దేశాల నుంచి 16,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కాలిఫోర్నియాలో గ్రేడ్ 3 చదువుతున్న ప్రీషా చక్రవర్తి ఈ పరీక్షల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి వరల్డ్ స్టూడెంట్స్ జాబితాలో చోటు సంపాదించింది. కాగా, వరుసగా గత రెండుసార్లు ఇండో-అమెరికన్ బాలిక నటాషా పెరియనాయగమ్.. వరల్డ్ బ్రైటెస్ట్ జాబితాలో తొలిస్థానంలో నిలిచింది.

శ్రీకృష్ణ జన్మభూమి సర్వేపై సుప్రీం స్టే

అలహాబాద్ హైకోర్టు ఆదేశాల నిలుపుదల

కోర్టు కమిషనర్ నియామకం వద్దని ఆదేశం

అభ్యంతరాలపై 23లోగా సమాధానం ఇవ్వాలని హిందూ పక్షాలకు సూచన



న్యూఢిల్లీ, జనవరి 16: మథురలో శ్రీకృష్ణ జన్మభూమిని ఆనుకొని ఉన్న షాహీ ఈద్గా మసీదు కాంప్లెక్స్‌లో శాస్త్రీయ సర్వే జరపాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు మంగళవారం స్టే విధించింది. కోర్టు కమిషనర్ పర్యవేక్షణలో సర్వే జరిపించేందుకు అంగీకారం తెలుపుతూ గత నెల 14న అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మందిరాన్ని కూలగొట్టి మసీదు నిర్మించారంటూ హిందూ పక్షం చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఆ విషయాన్ని తేల్చేందుకు న్యాయస్థానం పర్యవేక్షణలో కోర్టు కమిషనర్ ద్వారా సర్వే జరిపించేందుకు ఆమోదం తెలిపింది. ఆ సర్వేను మరో ముగ్గురు న్యాయవాదుల బృందం పరిశీలిస్తుందని కూడా తెలిపింది. కట్టడానికి ఎలాంటి హాని జరగకుండా సర్వే జరపాలని స్పష్టం చేసింది. దీనిని సవాలు చేస్తూ ముస్లిం పక్షం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం..సర్వే నిర్వహించకుండా స్టే విధించింది. అయితే ఇదే అంశంపై హైకోర్టులో దాఖలైన ఇతర కేసులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. హిందూ పక్షం దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హతను సవాలు చేస్తూ ముస్లిం పక్షం వేసిన కేసుపైనా ముందుకు వెళ్లవచ్చని తెలిపింది. కోర్టు కమిషనర్‌ను నియమించాలంటూ హిందూ పక్షం దాఖలు చేసిన పిటిషన్‌లో అస్పష్టత ఉందని, ఆ కారణంగానే స్టే విధిస్తున్నట్టు తెలిపింది. తొలుత మసీదు నిర్వహణ కమిటీ తరఫున తస్నీం అహ్మది వాదనలు వినిపిస్తూ ప్రార్థనా స్థలాల చట్టం-1991కి వ్యతిరేకంగా దాఖలైన హిందూ పిటిషన్ మీద అలహాబాద్ హైకోర్టు అలాంటి ఆదేశాలు ఇచ్చి ఉండాల్సింది కాదన్నారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని ఆర్డర్ 7 రూల్ 11 ప్రకారం ఆ వ్యాజ్యానికి విచారణార్హత లేదంటూ దాఖలైన మరో పిటిషన్ హైకోర్టులోనే పెండింగ్‌లో ఉందని, అలాంటప్పుడు కూడా సర్వే జరపాలంటూ ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు. కృష్ణుడు జన్మించిన కారాగారాన్ని కూలగొట్టి మసీదు నిర్మించారన్నది ఊహాగానమేనని, అందుకు ఎలాంటి కనీస ఆధారాలు చూపలేదని ముస్లిం పక్షం తన పిటిషన్‌లో తెలిపింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ అంశంలో లీగల్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపింది. వాటిని పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. అందువల్ల కమిషనర్ నియామకంపై స్టే విధిస్తున్నట్టు తెలిపింది. ఇందుకు హిందూ పక్షం న్యాయవాది దివాన్ అభ్యంతరం చెప్పారు. సర్వేపై విధివిధానాలు రూపొందించేందుకు హైకోర్టుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దాంతో దీనిపై అభిప్రాయాలు చెప్పాలంటూ హిందూ పక్షానికి నోటీసులు పంపిస్తామని ధర్మాసనం తెలిపింది. ఈనెల 23లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఈ వివాదానికి సంబంధించి అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన మరో ఆదేశాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యం కూడా సుప్రీంకోర్టు వద్ద పెండింగ్‌లో ఉంది. మందిర్-మసీదు సమస్యపై మథుర హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలు కాగా వాటన్నింటినీ తనకు బదిలీ చేసుకుంటూ గతేడాది మే 26న అలహాబాద్ హైకోర్టు ఆదేశాలిచ్చింది. దాన్ని సవాలు చేస్తూ మసీదు నిర్వహణ కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

జ్ఞాన్‌వాపీ నీటి కొలను శుభ్రతకు సుప్రీంకోర్టు అనుమతి

వారాణసిలోని జ్ఞాన్‌వాపీ మసీదు ఆవరణలో ఉన్న వజూఖానా (నీళ్ల తొట్టి) పరిశుభ్రతకు మంగళవారం సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోనే ఈ కార్యక్రమం జరగాలని స్పష్టం చేసింది. యూపీ ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ మాధవీ దివాన్ వాదనలు వినిపిస్తూ కొలనులో చనిపోయిన చేపలు ఉన్నాయని, అందువల్ల దాన్ని శుభ్రం చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఇలాంటి విజ్ఞప్తి చేస్తూ మసీదును నిర్వహిస్తున్న కమిటీ కూడా వారణాసి కోర్టులో పిటిషన్ వేసిందని గుర్తు చేసింది. మందిరాన్ని కూలగొట్టి మసీదును నిర్మించారా, లేదా అని తెలుసుకోవడానికి జ్ఞాన్‌వాపీలో శాస్త్రీయ సర్వే జరపాలని గతేడాది జులై 21న వారణాసి జిల్లా కోర్టు ఆదేశించింది. వజూఖానాలో 'శివలింగం'లాంటి వస్తువు దొరకడంతో ఆ నీటితొట్టెను మినహాయించి మిగిలిన ప్రాంతంలో సర్వే జరపాలంది. అప్పటి నుంచి దాన్ని శుభ్రపరచకపోవడంతో కోర్టు అనుమతి తీసుకోవాల్సి వచ్చింది.

అమెరికా అధ్యక్ష రేసు నుంచి..

వివేక్ రామస్వామి అవుట్

» అయోవా కాకస్‌లో గెలిచిన డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు



వాషింగ్టన్, జనవరి 16: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీపడిన భారత సంతతి ప్రముఖుడు, పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామి ఆ రేసు నుంచి వైదొలిగారు. సోమవారం అయోవా రాష్ట్ర కాకస్ ప్రైమరీ ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గెలిచారు. ఆయన . 56,160 ఓట్లు (51%), 20మంది ప్రతినిధులను గెలుచుకున్నారు. వివేక్ 7.7% ఓట్లు, ముగ్గురు ప్రతినిధులను మాత్రమే సాధించారు. మరో అభ్యర్థి రాయ్ డిశాంటిస్ 21.2% ఓట్లతో 8 మంది ప్రతినిధులను, భారత సంతతికే చెందిన నికీ హేలీ 19.1 శాతం ఓట్లతో ఏడుగురు ప్రతినిధులను గెలుచుకున్నారు. తన అభ్యర్థిత్వాన్ని మెజారిటీ రిపబ్లికన్లు అంగీకరించకపోవడంతో.. రేసు నుంచి వైదొలగిన వివేక్.. ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు. ఒహాయో రాష్ట్రానికి చెందిన వివేక్.. తల్లిదండ్రులు కేరళ నుంచి అమెరికాకు వలసవచ్చారు. పారిశ్రామికవేత్త అయిన ఆయన రాజకీయ వర్గాల్లో ఎవరికీ పెద్దగా తెలియదు. 2023 ఫిబ్రవరిలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వానికి బరిలో నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించారు.

మయన్మార్‌లో తిరుగుబాటు ఉధృతం

» భారత్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని పట్టణాన్ని స్వాధీనం చేసుకున్న అరాకన్ ఆర్మీ

నెయ్‌పిడా, జనవరి 16: మయన్మార్‌లోని సైనిక (జుంటా) ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు ఉధృతమవుతోంది. భారత్, బంగ్లాదేశ్‌ల సరిహద్దుల్లో ఉన్న రేవు పట్టణం పలేత్వాను తాము స్వాధీనం చేసుకున్నామని తిరుగుబాటు దళాల్లో ఒకటైన అరాకన్ ఆర్మీ (ఏఏ) ప్రకటించింది. ఈ పట్టణం రాఖినే రాష్ట్రంలో కాలాదన్ నది పక్కన ఉంది. సరిహద్దు భద్రతకు సంబంధించిన అంశాలపై పొరుగుదేశాలతో స్నేహపూర్వకంగా ఉంటామని ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. అయితే, ఏఏ ప్రకటనపై స్పందించటానికి జుంటా ప్రభుత్వ ప్రతినిధి నిరాకరించారు. మయన్మార్‌లో త్రీ బ్రదర్‌హుడ్ అలయెన్స్ పేరిట మూడు సాయుధ సంస్థలు తిరుగుబాటుకు నేతృత్వం వహిస్తున్నాయి. ఇప్పటికే పలు సైనిక పోస్టులను, పట్టణాలను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ సాయుధ గ్రూపులకు ప్రజాస్వామ్య అనుకూల ప్రత్యామ్నాయ ప్రభుత్వం మద్దతు పలుకుతోంది. సాయుధ సంస్థల్లో ఒకటైన ఎమ్ఎన్‌డీఏఏ.. ఇటీవల చైనా సరిహద్దులో ఉన్న ఉత్తర షాన్ రాష్ట్రంలోని లావుక్కయ్ పట్టణాన్ని స్వాధీనం చేసుకుంది. చైనా సరిహద్దు ప్రాంతంలో అలయెన్స్‌తో కాల్పుల విరమణకు జుంటా ప్రభుత్వం గత వారం అంగీకరించింది. అయితే, ఈ ఒప్పందానికి ప్రభుత్వం కట్టుబడి ఉండటం లేదని, కాల్పుల విరమణను ఉల్లంఘించి పలు చోట్ల తమపై దాడులకు పాల్పడుతోందని అలయెన్స్ ఆరోపించింది.

రోడ్డు లేక గండాల గుండాల


గుట్ట దాటుతూ వెళ్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

» కొండలు ఎక్కుతూ, వాగులు దాటుతూ ఏడు గూడేల వాసుల ఇక్కట్లు

ఆసిఫాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి)/తిర్యాణి: చుట్టూ కొండలు, వాగులు, అడవులు. రేషన్, చదువు, అనారోగ్యం.. దేనికైనా కొండలు ఎక్కుతూ, వాగులు దాటుతూ 8 కిలోమీటర్ల దూరం అడుగడుగునా గండాలను దాటుకుంటూ వెళ్లాలి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీలోని మారుముల గుండాల దాని పరిధి ఏడు గూడేల వాసుల ఇబ్బంది ఇది. ఇక్కడి 200 కుటుంబాల్లో 900 మందిపైగా నివసిస్తున్నారు. మండల కేంద్రం తిర్యాణికి గుండాల 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. రేషన్ కోసం ఏ కాలంలోనైనా రొంపల్లికి రావాల్సిందే. నాలుగు వాగులు, కొండలను దాటాల్సిందే. గుండాల నుంచి దండేపల్లి సమీపంలోని ఊట్ల వరకు ఏడు కిలోమీటర్ల మేర ఎటు వెళ్లాలన్నా కాలినడక తప్పదు. 2016లో ఊట్ల నుంచి గుండాలకు మట్టి రోడ్డు నిర్మించినా వరద కోతతో ఆనవాళ్లు కోల్పోయి ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి నెలకొంది. అంబులెన్స్ కూడా రాకపోవడంతో.. ఎవరైనా అనారోగ్యానికి గురైతే మంచంలో మోసుకెళ్లాల్సి వస్తోంది. సెలవుల్లో ఇళ్లకు వచ్చేందుకు విద్యార్థుల కష్టాలు చెప్పనలవి కాదు. అధికారులు స్పందించి రొంపల్లి-గుండాల మధ్య రోడ్డు నిర్మాణానికి నిధులివ్వాలని, అటవీ శాఖ అనుమతితో పూర్తిచేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.


రొంపల్లి నుంచి వాగు దాటుతూ రేషన్ బియ్యం తెచ్చుకుంటున్న మహిళలు

సిరిసిల్లలో మూగబోయిన మర మగ్గం

సిరిసిల్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మరమగ్గం మూగబోయింది. సోమవారం నుంచి మరమగ్గాలపై వస్త్ర ఉత్పత్తిని యజమానులు బంద్ చేశారు. దీంతో కార్మికులు పని కోల్పోయారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరమగ్గాల పరిశ్రమపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మందికి పైగా కార్మికులు ఉపాధి పొందుతున్నారు. బతుకమ్మ చీరలు, ప్రభుత్వ ఆర్డర్లు లేకపోవడం.. పాలిస్టర్ బట్ట ఉత్పత్తిని ప్రారంభించినా మార్కెట్‌లో గిరాకీ లేక పోవడంతో నష్టానికి బట్టను అమ్ముకోలేక ఉత్పత్తిని నిలిపివేశారు. సిరిసిల్ల మరమగ్గాలపై ఉత్పత్తి చేసిన పాలిస్టర్ బట్ట విలువ రూ.35 కోట్ల వరకు ఉంది. కార్ఖానాల్లోనే బట్ట ఉండిపోవడంతో కొత్త ఉత్పత్తుల వైపు వెళ్లొద్దని సిరిసిల్ల క్లాత్ మాన్యుఫ్యాక్చరర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయం తీసుకోవడంతో పరిశ్రమ మూతపడింది. కాగా, విషయాన్ని అధికారులు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ప్రభుత్వం ద్వారా ఆర్వీఎం బట్ట ఉత్పత్తి ఆర్డర్లను మ్యాక్స్, ఎస్ఎస్ఐ యూనిట్లకు అందించాలని అధికారులకు సూచించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలవాలని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ ద్వారా కోరారు.

వేతనాలు రాక జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య!


శ్రీకాంత్ (ఫైల్)

బీబీపేట, జనవరి 16: నెలల తరబడి జీతాలు రాకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఓ జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లాలో మంగళవారం జరిగింది. భిక్కనూర్ మండలం బస్వాపూర్‌కు చెందిన మర్కంటి శ్రీకాంత్(27).. బీబీపేట తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గతంలో వీఆర్ఏగా పని చేసిన శ్రీకాంత్‌కు.. గత ప్రభుత్వం వీఆర్ఏలకు పేస్కేల్, ప్రమోషన్లు అమలు చేసిన క్రమంలో జూనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ వచ్చింది. అయితే విధుల్లో చేరినప్పటి నుంచి నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో ఆయనను ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. అదే సమయంలో రెండు నెలల క్రితం అనారోగ్యంతో తన సోదరుడు మరణించడంతో శ్రీకాంత్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ క్రమంలోనే మంగళవారం బీబీపేట పెద్దచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

'నిజమైన రామభక్తులం మేమే': మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్, జనవరి 16: అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తి కాక ముందే ప్రాణ ప్రతిష్ఠ చేయడం బీజేపీ రాజకీయ లబ్ధి కోసమేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని తన నివాసంలో పలువురు బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసలైన రామభక్తులం తామేనని, హిందూ మతాన్ని బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటని, బీజేపీ మత రాజకీయాలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. దేశంలో అణచివేతకు గురైన వర్గాలకు చేయూతనందించేలా అగ్ర నేత రాహుల్‌గాంధీ చేపట్టిన 'న్యాయ్ యాత్ర'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలోని 14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం ఖాయమని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ కనుమరుగవుతుందన్నారు.

ఆర్ఎస్ఎస్ కా చోటా రీచార్జ్ కేజ్రీవాల్

» ఢిల్లీ సర్కార్‌వి హిందుత్వ రాజకీయాలు: ఒవైసీ

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పోటీ పడి హిందుత్వ రాజకీయాలను అనుసరిస్తున్నారని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. కేజ్రీవాల్‌ను 'ఆర్ఎస్ఎస్ కా చోటా రీచార్జ్'గా అభివర్ణించారు. ఢిల్లీలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నెల మొదటి మంగళవారం సుందరకాండ, హన్మాన్‌చాలీసా పఠించాలని నిర్ణయించడంపై ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆప్‌ను బీజేపీకి భిన్నమైన విధానం గల పార్టీగా ఎలా భావిస్తామని ప్రశ్నించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్, ఆప్‌కు తేడా లేకుండా పోయిందన్నారు. బీజేపీ నడుస్తున్న బాటలోనే ఆప్ పయనిస్తోందని ఆరోపించారు.

ఏపీ విభజన హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

» తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర విభజన అనేది అనివార్యం. ఆనాడే ఏపీకి అవసరమైన ప్రత్యేక హోదా, ఇతర అభివృద్ధి అంశాలతో కూడిన హామీలను ఇచ్చాం. ఆ దిశగానే కార్యాచరణ మొదలైనా ఆనాడు కొందరు ఒప్పుకోలేదు. కేంద్రంలో, ఏపీలో మా పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి రావాల్సిన విభజన హామీలు అమలు చేస్తాం" అని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏపీలో కాంగ్రెస్ మీద ప్రజలకు ఉన్న వ్యతిరేకత తొలగిపోయిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి దిశగా పనిచేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని టీటీడీని కోరుతున్నామన్నారు.

ఇద్దరు సీనియర్లకు ఐఏఎస్‌లుగా పదోన్నతి

» ఐఎఫ్ఎస్ అధికారులిద్దరికి ప్రమోషన్

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో ఇద్దరు సీనియర్ అధికారులకు ఐఏఎస్‌లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ(డీవోపీటీ) అండర్ సెక్రటరీ సంజయ్‌కుమార్ చౌరాసియా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్లుగా పని చేస్తున్న కె.సీతాలక్ష్మి, జి.ఫణీంద్రరెడ్డిలకు 'సెలెక్ట్ లిస్ట్-2022' కింద ఐఏఎస్‌లుగా పదోన్నతి(కన్ఫర్) కల్పించారు. 'నాన్ స్టేట్ సివిల్ సర్వీస్' కోటా కింద వీరిని తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు డీవోపీటీ తెలిపింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వీరిద్దరూ ప్రొబేషనరీ అధికారులుగా కొనసాగుతారు. మరోవైపు రాష్ట్రంలోని ఇద్దరు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్) అధికారులకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2010 బ్యాచ్‌కు చెందిన అధికారి ఎస్.శాంతారామ్, 2015 బ్యాచ్‌కు చెందిన అధికారి ప్రదీప్‌కుమార్‌లకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్(లెవెల్-12)గా పదోన్నతి కల్పించారు.

రాష్ట్రానికి స్వేచ్ఛను తెచ్చాం

» బీఆర్ఎస్ ప్రజలను అప్పుల్లోకి నెట్టింది : భట్టి

బోనకల్, జనవరి 16: బందీగా ఉన్న రాష్ట్రానికి ప్రజల ఆశీస్సులతో స్వేచ్ఛను తీసుకొచ్చామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గత పాలకులు పదేళ్లలో ఆర్థిక అరాచకం సృష్టించారని తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్‌లో మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరసన్మాన కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలకులు ప్రజలను రూ.7లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని చెప్పారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేలా ఇందిరమ్మ రాజ్యం ముందుకు సాగుతుందని తెలిపారు.

మద్యం మత్తులో జయశంకర్ విగ్రహం ధ్వంసం

» నిందితుడిపై చర్యలు తీసుకోవాలి: కేటీఆర్


విగ్రహం ధ్వంసం చేస్తున్న దృశ్యం

హైదర్‌నగర్/హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన హైదరాబాద్ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీలో చోటుచేసుకుంది. నియోజకవర్గం పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో మంగళవారం ఉదయం మద్యం సేవించి ఓ వ్యక్తి జయశంకర్ విగ్రహాన్ని గద్దెపై నుంచి పెకిలించి బండరాయితో ధ్వంసం చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు సంఘటన స్థలానికి చేరుకుని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విగ్రహం ధ్వంసమైన చోట నుంచి ఎల్లమ్మబండ ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరగలేదని, రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేయాలని, లేనట్లయితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాగా విగ్రహం ధ్వంసం చేసిన అతడిని మహావీర్‌నగర్ కాలనీకి చెందిన వ్యక్తిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మరోవైపు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ఎమ్మెల్యే కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. తెలంగాణ సమాజం ఎంతగానో గౌరవించే జయశంకర్ సార్ విగ్రహం ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబు స్కిల్ కేసు విస్తృత ధర్మాసనానికి!

ఈ కేసులో 17ఏ వర్తింపచేయడంపై ద్విసభ్య ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు

» చీఫ్ జస్టిస్‌కు నివేదిస్తూ నిర్ణయం

» 17ఏ వర్తిస్తుంది.. కేసు అక్రమం



న్యూఢిల్లీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) టీడీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ దాఖలు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ వర్తిస్తుందా? లేదా?... ఆయనపై కేసు చెల్లుతుందా? లేదా? ఈ అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఇద్దరు న్యాయమూర్తులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీంతో... తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ సుప్రీం ప్రధాన న్యాయమూర్తికి నివేదించారు. వెరసి... దీనిపై విస్తృత ధర్మాసనం తదుపరి విచారణ జరిగే అవకాశముంది. సవరించిన అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం తనపై కేసు నమోదుకు సంబంధిత అథారిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని.. సీఐడీ దీనిని పట్టించుకోలేదని... కేసును కొట్టివేయాలని చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను అంతకుముందు హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో... ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. గత ఏడాది అక్టోబరు 17వ తేదీన రిజర్వు చేసిన తీర్పును... మంగళవారం వెలువరించింది. అయితే... దీనిపై ఇరువురు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. చంద్రబాబుపై దాఖలైన కేసుకు సెక్షన్ 17(ఏ)ను అన్వయించడంపై వేర్వేరుగా తీర్పులు వెలువరించారు.

17ఏ వర్తిస్తుంది, కేసు చెల్లదు: జస్టిస్ బోస్

1988 అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(సి), 13(1)డి, 13(2) కింద చంద్రబాబుపై చర్యలు తీసుకోవడం సరైంది కాదని జస్టిస్ అనిరుద్ధ బోస్ స్పష్టం చేశారు. సవరించిన చట్టంలోని 17ఏ సెక్షన్ ప్రకారం 'పబ్లిక్ సర్వెంట్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించేందుకు సంబంధిత 'అథారిటీ' అనుమతి అవసరం' అని తెలిపారు. అలా అనుమతి లేకుండా విచారణ చేపడితే... అది అక్రమమే అవుతుందన్నారు. అదే సమయంలో... ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు.

17ఏ వర్తించదు: జస్టిస్ బేలా త్రివేది

స్కిల్ డెవలప్‌మెంట్ అంశంలో చంద్రబాబుపై కేసు నమోదుకు 17ఏ సెక్షన్ వర్తించదని జస్టిస్ బేలా త్రివేది తన తీర్పులో పేర్కొన్నారు. 17ఏ సెక్షన్ అమలులోకి వచ్చిన తర్వాత చోటు చేసుకున్న నేరాలకు మాత్రమే ఇది వర్తిస్తుందని, అంతకుముందు జరిగిన వాటికి (రెట్రాస్పెక్టివ్) కాదని, చట్టం ఉద్దేశం అదేనని అభిప్రాయపడ్డారు. అవినీతి నిరోధక చట్టానికి 2019లో సవరణలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. 17ఏ సెక్షన్‌ను పాత కేసులకు కూడా వర్తింపచేస్తే పెండింగ్‌లో ఉన్న ఎన్నో దర్యాప్తులకు నష్టం జరుగుతుందని ఆమె చెప్పారు. అలాగే..ఐపీసీలోని ఇతర సెక్షన్ల కింద కూడా కేసు నమోదైనట్లయితే, కేవలం 17ఏ కింద అనుమతి తీసుకోనంత మాత్రాన కేసు కొట్టివేయడం కుదరదని తెలిపారు. ఈ కేసులో చంద్రబాబు తరఫున హరీష్ సాల్వే, సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం పోలీసులు సం బంధిత అథారిటీ అనుమతి లేకుండా చంద్రబాబును నిందితుడిగా చేర్చడం సరైంది కాదని తెలిపారు. అయితే... అవినీతి నిరోధక చట్టానికి 2018లో జరిగిన సవరణలో సెక్షన్ 17ఏ చేర్చారని... స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ అంతకుముందే చోటు చేసుకుందని ఏపీ ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గీ వాదించారు. అందువల్ల ఈ కేసుకు 17ఏ వర్తించదని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇద్దరిలో ఒకరు చంద్రబాబు తరఫు న్యాయవాది వాదనను సమర్థించగా, మరొకరు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనను అంగీకరించడం గమనార్హం.

విషయం సీజే ముందుకు...

"ఈ సెక్షన్‌కు అన్వయం, పిటిషనర్ (చంద్రబాబు)కు దీనిని వర్తింపచేయడంపై మా మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనందున... దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఈ అంశాన్ని ప్రధాన న్యాయమూర్తికి నివేదిస్తున్నాం" అని జస్టిస్ అనిరుద్ధ బోస్ తెలిపారు. ఈ కేసులో చంద్రబాబుకు 52 రోజుల రిమాండ్ అనంతరం బెయిల్ లభించిన సంగతి తెలిసిందే. రిమాండ్ ఆర్డర్ జోలికి పోకూడదని న్యాయమూర్తులు నిర్ణయించారు. అవినీతి నిరోధక చట్టంతో పాటు ఐపీసీలోని సెక్షన్ల కింద కూడా కేసు నమోదు చేసినందున... రిమాండ్ ఆర్డర్‌లో లోపాలు లేవని వారు భావించారు. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ సెక్షన్‌కు భాష్యం చెప్పడంలో ఇరువురు న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయం వ్యక్తం కావడంతో... ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించే అవకాశముంది. దీంతో కేసు విచారణ మళ్లీ మొదటి నుంచి జరగవచ్చని, అది తేలేందుకు సమయం పట్టవచ్చునని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. బుధవారం జరగాల్సిన ఫైబర్ నెట్ కేసు విచారణపైనా ఈ తీర్పు ప్రభావం చూపించవచ్చునని అభిప్రాయపడుతున్నారు.

పండుగ వేళ విషాదం

» అదుపు తప్పి పల్టీలు కొట్టిన కారు.. ఇద్దరి మృతి

నల్లగొండ జిల్లా చింతపల్లిలో ఘటన

చింతపల్లి, జనవరి 16: సంక్రాంతి పండుగ రోజున విషాదం జరిగింది. నల్లగొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు అదుపుతప్పి పల్టీలు కొట్టిన ఘటనలో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మపల్లికి చెందిన దార్ల ప్రభాకర్, పోలోజు రాఘవేందర్(29), దార్ల అరవింద్(22) ఇత్తడి వస్తువులపై నక్ష వేసే వృత్తి చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈ ముగ్గురు కలిసి ఆదివారం సాయంత్రం కారులో హైదరాబాద్ వెళ్లి అదే రోజు రాత్రి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, చింతపల్లి మండలం పోలేపల్లి రాంనగర్ సమీపంలోని ఓ మలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి నాలుగు పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి ఓ స్తంభానికి తగిలి ఆగింది. రాఘవేందర్, అరవింద్ అక్కడికక్కడే మరణించారు. తీవ్ర గాయాలపాలైన ప్రభాకర్‌ను పోలీసులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

పోలీస్ క్యాంపులపై మావోయిస్టుల కాల్పులు

» ఛత్తీస్‌గఢ్‌లో 4 గంటల పాటు సాగిన భీకర దాడి

చర్ల, జనవరి 16: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పోలీసులపై మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. బీజాపూర్ జిల్లా పామేడు గ్రామంలో ఉన్న పోలీస్ క్యాంపులపై మంగళవారం సుమారు సాయంత్రం 5 గంటల నుంచి 9 వరకు కాల్పులు జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో మావోయిస్టులు, పోలీసులకు ఎవరికైనా ప్రాణహాని జరిగిందా, లేదా అన్న విషయం తెలియరాలేదు. పామేడులో సివిల్ పోలీస్‌స్టేషన్‌తో పాటు, సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డీఆర్‌జీలకు సంబంధించి మూడు బెటాలియన్ క్యాంపులు ఉన్నాయి. గ్రామం చివరిలో ఉన్న సీఆర్‌పీఎఫ్-151 బెటాలియన్ క్యాంపుపై మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులతో విరుచుకుపడడంతో పోలీసులు కూడా వారిని దీటుగా ఎదుర్కొన్నారు. కాగా బీజాపూర్ జిల్లాలోనే మరోచోట జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు.

అధర్మంగా వస్తే.. రాముడు తీసుకోవద్దన్నారు

కొందరు అధికారులు దీనిని గుర్తుంచుకోవాలి.. సుపరిపాలనకు రామరాజ్యమే మనకు ప్రేరణ

» ప్రజలు చెల్లించే ప్రతి పైసా వారి సంక్షేమానికే
» పన్ను సంస్కరణల ఫలితాలు కళ్లముందున్నాయి
» 25 కోట్లమంది పేదరికాన్ని జయించారు
» సుపరిపాలనకు 'నాసిన్' సరికొత్త కేంద్రం
» ఏపీలోని సత్యసాయి జిల్లాలో అతిపెద్ద నాసిన్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ
» లేపాక్షిలో వీరభద్రుడికి స్వయంగా హారతి
» అల్లూరి జిల్లా గిరిజనులతో ముఖాముఖి


లేపాక్షి వీరభద్రునికి హారతి ఇస్తున్న ప్రధాని మోదీ

పుట్టపర్తి, అరకు లోయ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీరాముడు తలచుకుంటే సాగరం అడుగునున్న నేలను కూడా సొంతం చేసుకోగలడని.. కానీ, అధర్మ మార్గంలో ఇంద్రప్రస్థం లభించినా స్వీకరించబోనని లక్ష్మణుడికి చెప్పాడని, విధి నిర్వహణలో చిన్నచిన్న ప్రలోభాలతో కర్తవ్యాన్ని మరచిపోతున్న అధికారులు ఈ మాటలను తప్పక గుర్తుంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. సుపరిపాలనకు రామరాజ్యమే అసలైన నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామంలో దేశంలోనే అతిపెద్ద కస్టమ్స్, పరోక్ష పన్నులు, మాదక ద్రవ్యాల నియంత్రణ జాతీయ అకాడమీ (నాసిన్) క్యాంపస్‌ను మంగళవారం ప్రధాని ప్రారంభించారు. ఆధునిక పన్ను వ్యవస్థను అందించడమే నాసిన్ లక్ష్యమన్నారు. అధికారాలను వివేకంతో వినియోగించాలని.. తప్పుడు మార్గాన్ని అనుసరించేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ విషయంలో శ్రీరాముడి జీవితం నుంచే ప్రేరణ లభిస్తుందన్నారు. "నాసిన్ కేంద్రం సుపరిపాలనకు సరికొత్త కేంద్రంగా మారనుంది. దేశంలోని వ్యాపార, పరిశ్రమలకు నూతన దిశ కల్పించనుంది" అని తెలిపారు. నాసిన్‌లో శిక్షణ పొందుతున్న ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్) అధికారులను అమృత కాలానికి నేతృత్వం వహించే 'కర్మయోగుల అమృత బృందం'గా మోదీ అభివర్ణించారు. వ్యాపార కార్యకలాపాలను సులభం చేసే ఆధునిక ఎకో సిస్టంను ఇవ్వడమే నాసిన్ విధి అని చెప్పారు. భారత్‌ను ప్రపంచ వాణిజ్యంలో కీలక భాగస్వామిని చేయగలిగే స్నేహపూర్వక వాతావరణం సృష్టించాలన్నారు.

రామరాజ్యంలో లాగానే పన్నుల వ్యవస్థ

రామరాజ్యంలో పన్నులు ఎలా ఉండేవో తులసీదాస్ వివరించారని, మన పన్నుల వ్యవస్థ కూడా అలా ఉండాలని మోదీ పేర్కొన్నారు. పన్నుల రూపంలో వచ్చే ప్రతి పైసా ప్రజా సంక్షేమానికి వినియోగించాలని స్పష్టం చేశారు. ఇదే ప్రేరణతో జీఎస్టీ రూపంలో దేశానికి ఆధునిక వ్యవస్థను అందించామని, ఆదాయపు పన్ను వ్యవస్థను సులభం చేశామని చెప్పారు. అంతకుముందటి పన్నుల వ్యవస్థ సామాన్య ప్రజలకు అంత సులువుగా అర్థమయ్యేది కాదన్నారు. పన్ను వసూళ్లు పెరగడం వల్ల, ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఆ డబ్బును ప్రజలకే వినియోగిస్తోందని తెలిపారు. తమ డబ్బు సద్వినియోగమం అవుతుండడం పన్ను చెల్లింపుదారులంతా చూస్తున్నారన్నారు. అందుకే పన్ను చెల్లించేందుకు సంతోషంగా ముందుకువస్తున్నారని తెలిపారు. ఇదే సుపరిపాలన అని, ఇదే రామరాజ్య సందేశం అని మోదీ చెప్పారు. గతంలో ప్రాజెక్టులను తొక్కిపెట్టడం, ముందుకు సాగనీయని వ్యవస్థ ఉండేదని, దాని వల్ల చాలా నష్టం జరిగిందని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభం వచ్చే పనుల్లో ఆలస్యం చేయకూడదని భరతుడికి శ్రీరాముడు నిర్దేశించారని మోదీ చెప్పారు. తమ ప్రభుత్వం కూడా ఇదే సూత్రాన్ని పాటించిందన్నారు.. ఢిల్లీ నుంచి వచ్చే ప్రతి పైసా నిజమైన హక్కుదారుల బ్యాంకు ఖాతాల్లోకే చేరుతోందని తెలిపారు. 10 లక్షల అనర్హుల పేర్లను రికార్డుల నుంచి తొలగించామని చెప్పారు. నీతి ఆయోగ్ నివేదిక తొమ్మిదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించిందని మోదీ తెలిపారు. పేదరిక నిర్మూలన నినాదాలు ఇచ్చే దేశంలో ఇది చరిత్రాత్మకమని పేర్కొన్నారు. అత్యంత వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రపంచస్థాయి సంస్థను నెలకొల్పడం గర్వకారణమని ఏపీ సీఎం జగన్ అన్నారు. రాష్ట్రం పేరు, ప్రతిష్ఠలను నాసిన్ అంతర్జాతీయంగా నిలబెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, చారిత్రక, పురాతన వైభవానికి శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి నిదర్శనమని, విజయనగర సామ్రాజ్య సంస్కృతీ వైభవాన్ని చాటే ఇక్కడి శిల్పసంపద మహా అద్భుతమని మోదీ అభివర్ణించారు. లేపాక్షిని ఆయన సందర్శించారు. ఆలయంలో వీరభద్రస్వామికి హారతి ఇచ్చారు. ధర్మవరం మండలం నిమ్మలకుంట కళాకారులు ప్రధాని కోసం తోలుబొమ్మలాటను ప్రదర్శించారు. రామాయణంలోని జటాయువు ఘట్టాన్ని తోలుబొమ్మలాట ద్వారా వీక్షించిన మోదీ పరవశించిపోయారు.

అల్లూరి జిల్లా గిరిజనులతో మోదీ ముఖాముఖి

ఆదివాసీల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రధాని మోదీ అన్నారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధి అరకులోయ మండలం కొత్తభల్లుగుడ గిరిజనులతో వర్చువల్ సమావేశంలో ముచ్చటించారు. గిరిజనాభివృద్ధి పథకాలను వివరించిన అనంతరం కొత్తభల్లుగుడ పంచాయతీ గద్యాగుడ గ్రామానికి చెందిన స్వాబి గంగతో ప్రధాని ముఖాముఖి సంభాషించారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది కదా.. మీరెలా ఫీలవుతున్నారు? అని అడిగారు. సంతోషంగా ఉందని.. గతంలో తాము కాఫీ పంట దళారులకు విక్రయించి నష్టపోయేవాళ్లమని ఇప్పుడు గ్రేడింగ్ చేసి ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ చేస్తూ మంచి ధర పొందుతున్నామని స్వాబి చెప్పారు.

పీఎం జన్‌మన్ కింద ఆదివాసీలకు పక్కా ఇళ్లు: మోదీ

» తొలి విడతగా రూ.540 కోట్లు విడుదల

అచ్చంపేట/మన్ననూరు, జనవరి 16 : దేశంలోని గిరిజనులు, ఆదివాసీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. పీఎం-జన్‌మన్(ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) ద్వారా ఆదివాసీలకు పక్కా ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఈ మేరకు దేశ వ్యాప్తంగా లక్ష మంది పీఎంఏవై-జీ(ప్రధానమంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ్) లబ్ధిదారులకు ఎం జన్‌మన్ కింద తొలి విడతగా రూ.540 కోట్లను ప్రధాని మోదీ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన వర్చువల్ సమావేశంలో దేశ వ్యాప్తంగా ఉన్న జన్‌మన్ లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ఇందులో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూర్ ఆదివాసీ గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన వేదిక నుంచి జిల్లాకు చెందిన ఆదివాసీ చెంచులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ పీఎం జన్‌మన్ ద్వారా ఆదివాసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు రూ.24వేల కోట్లు కేటాయించామని చెప్పారు. జన్‌మన్ కింద తొలి విడతగా రూ.540 కోట్లు విడుదల చేశామని తెలిపారు. వచ్చే దీపావళిలోగా సొంతిల్లు లేని ఆదివాసీలు ఇల్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారుని ఖాతాలో రూ.2.50 లక్షలు జమ చేస్తామని వివరించారు. కాగా, జన్‌మన్ పథకం కింద ఎంపిక చేసిన పలువురు ఆదివాసీలకు కొత్త ఆధార్ కార్డులు, కిసాన్ క్రెడిట్ కార్డులు, కులధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వాలు సుప్రీంలో అఫిడవిట్ ఇవ్వాలి: కడియం

హనుమకొండ టౌన్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలో విలేకరులతో మాట్లాడారు. దళితబంధు పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విస్తరిస్తున్న యుద్ధం

ఇరాక్‌లోని ఇజ్రాయెల్ నిఘా కేంద్రాన్ని ఇరాన్ సోమవారం ధ్వంసం చేసింది. గాజా యుద్ధం ఆరంభమైన తరువాత ఇజ్రాయెల్ ప్రయోజనాలను ఇరాన్ నేరుగా దెబ్బతీయడం ఇదే తొలిసారి. కుర్దిస్తాన్ రాజధాని ఎర్బిల్‌లో అమెరికా రాయబార కార్యాలయానికి అతిసమీపంలో ఉన్న ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయాన్ని నేలమట్టం చేయడమే కాక, ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల కారణంగా కొందరు ఇరాకీ పౌరులు కూడా హతమయ్యారు. అమెరికా అధికారులకు ఏ నష్టమూ వాటిల్లకున్నా వారి రాయబార కార్యాలయం కూడా కొంతమేరకు దెబ్బతిన్నదని వార్తలు వస్తున్నాయి. ఇది ఇరాక్ సార్వభౌమత్వంమీద దాడి అంటూ ఇరాక్ తీవ్రంగా ప్రతిస్పందించింది. యెమెన్‌లోని హౌతీ స్థావరాలమీద అమెరికా, బ్రిటన్ యుద్ధవిమానాలు దాడులు జరిపిన తరువాత, ఇరాన్ చర్యతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత హెచ్చాయి.

గాజాలో ఇజ్రాయెల్ యుద్ధానికి ఆదివారం నాటికి వందరోజులు పూర్తయ్యాయి. గాజా ఘోరాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా, హమాస్ పక్షాన హౌతీలు ఎర్రసముద్రంలో వాణిజ్యనౌకలపై దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. హౌతీలను అణచివేసేందుకు అమెరికా బ్రిటన్‌లు జరుపుతున్న వైమానిక దాడుల్లో హౌతీలు ఎంత దెబ్బతిన్నారో తెలియదు కానీ, ముడిచమురు ధర మరింత పెరిగింది. ప్రపంచ నౌకారవాణాలో 15శాతం ఈ మార్గం ద్వారా జరుగుతుంది. రెండునెలల్లో హౌతీల దాడులు ఐదురెట్లు హెచ్చి, పెద్ద పెద్ద షిప్పింగ్ కంపెనీలు ఇటుగా పోవడమే మానుకున్నాయి. భారతదేశానికి వస్తున్న రెండు నౌకలమీద కూడా గతంలో వీరు దాడులు చేశారు. రాజధాని సహా యెమెన్‌లోని అత్యధికప్రాంతాలు హౌతీల ఏలుబడిలోనే ఉన్నాయి. ఎర్రసముద్రం తీరంమీద వారికున్న ఆధిపత్యం కారణంగా వాణిజ్యనౌకలు క్షేమంగా నడవాలంటే హౌతీలను దెబ్బకొట్టాల్సిందే. కానీ, హౌతీలకు ఆర్థిక, ఆయుధ సహకారం ఇరాన్‌నుంచే అందుతున్నదని, ఇరాన్ ఆశీస్సులున్న హిజ్బుల్లా దీనికి సైనికశిక్షణనిస్తున్నదని పాశ్చాత్యదేశాలు నమ్ముతున్నప్పుడు ఇలా ఓ నాలుగురోజులపాటు వైమానికదాడులు చేస్తే హౌతీలను నాశనం చేయడం సాధ్యమేనా? ఇరాన్ అందించే ఇంటలిజెన్స్ సమాచారం ఆధారంగానే హౌతీలు వాణిజ్యానౌకలను నాశనం చేయగలుగుతున్నారని అంటున్నప్పుడు కేవలం హౌతీలమీద వైమానికదాడులతో లక్ష్యం పూర్తిగా సిద్ధిస్తుందా?

హమాస్ పక్షాన నిలిచిన హౌతీలను నాశనం చేసేందుకు ఇజ్రాయెల్ తరఫున అమెరికా, దాని మిత్రదేశాలు ఈ యుద్ధానికి దిగాయి. అమెరికా ఆర్థిక, ఆయుధ అండదండలతో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండ వాటి పరిభాషలో ఆత్మరక్షణ. హమాస్ దాడిలో చనిపోయినవారికంటే, ఇప్పుడు ఇజ్రాయెల్ దాడిలో వందలరెట్లు మరణించినా ఆ యుద్ధం వాటిదృష్టిలో న్యాయమైనదే. గాజాలో కాల్పుల విరమణ జరగక, మానవసాయం అందక వేలాదిమంది చనిపోతున్న స్థితిలో ఆ హననాన్ని ఆపడానికే తాను ఎర్రసముద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నానని, పాశ్చాత్యదేశాలమీద ఒత్తిడితేవడమే తమ లక్ష్యమని హౌతీలు చెబుతున్నారు. ఇజ్రాయెల్ తరఫున కాల్పుల విరమణ ప్రతిపాదనలన్నింటినీ వీటో చేస్తున్న దేశాలు వీరిమీద ఇప్పుడు యుద్ధం చేస్తున్నాయి. హౌతీలమీద అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న దాడులు ఉపరితలంలో ప్రపంచవాణిజ్యాన్ని పరిరక్షించడంగా కనిపించవచ్చు. కానీ, ఇజ్రాయెల్ మీద అంతర్జాతీయంగా ఒత్తిడిపెంచే మరో ప్రయత్నాన్ని ఆదిలోనే తుంచివేసి, గాజాలో అది యథేచ్ఛగా తన ఊచకోత కొనసాగించుకోడానికి వీలుకల్పించే వ్యూహంగా చాలామందికి అనిపిస్తోంది.

అంతర్జాతీయ న్యాయస్థానంలో దక్షిణాఫ్రికా వేసిన కేసు ఇజ్రాయెల్ పరువు ప్రతిష్ఠలను పూర్తిగా దిగజార్చింది. గాజాలో జరుగుతున్నది 'జీనోసైడ్' అంటూ, మధ్యంతర ఉత్తర్వులతో ఇజ్రాయెల్‌ను నిలువరించాలన్న అభ్యర్థనతో దక్షిణాఫ్రికా కేసు అత్యధిక దేశాల మనోభిప్రాయానికి ప్రతీక. భద్రతామండలిలో ఇజ్రాయెల్‌ను అమెరికా రక్షించుకువస్తున్నది కానీ, ఇటీవలి ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల సభలో ఓ నలభైదేశాలు మినహా 153దేశాలు గాజాలో తక్షణకాల్పుల విరమణకు అనుకూలంగా ఓటువేశాయి. హౌతీలకు ఇప్పుడు సౌదీ అరేబియాతో ఏ పేచీ లేదు కనుక, వారు పూర్తిగా తమ శక్తిసామర్థ్యాలను అమెరికా దాడులను తిప్పికొట్టడానికి వెచ్చిస్తున్నారు. ఆ దాడుల్లో ఒక యుద్ధనౌక దెబ్బతిన్నా అమెరికా పరువుపోతుంది. అధ్యక్ష ఎన్నికల ముందు జోబైడెన్ వీరంగం వేయడం, ఆ బీభత్స ప్రతీకారదాడులతో ఘర్షణ మరింత విస్తరించడం పశ్చిమాసియాను మరింత ప్రమాదంలోకి నెట్టేస్తుంది.

'సుప్రీం' లక్ష్మణరేఖ!

రాజ్యాధినేతలే పక్షపాత ధోరణితో అన్యాయంగా నేరస్థుల కొమ్ము కాస్తే కంచే చేను మేసినట్లవుతుంది. గుజరాత్‌లో 2002లో ఘోరమైన గ్యాంగ్ రేపు సంఘటనలో (బిల్కిస్ బానో కేసు) ముంబై సెషన్ కోర్టు పదకొండు మందికి 2008లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ముంబై సెషన్స్ కోర్టులో ఈ కేసు రావటానికి కారణం నిష్పక్షపాత విచారణ కోసం సుప్రీంకోర్టు 2004లో ఈ కేసును గుజరాత్ రాష్ట్రం నుంచి సీబీఐకి బదిలీ చేయటం. ముంబై న్యాయస్థానంలో న్యాయ విచారణ జరిగిన తర్వాత నిందితులకు శిక్ష విధించారు. అసలు కథ అప్పుడు మొదలైంది. గుజరాత్ బీజేపీ ప్రభుత్వం కాలం చెల్లిన 1992 లోని పాలసీని పరిగణనలోకి తీసుకొని శిక్షపడిన నేరస్థులకు క్షమాభిక్ష ప్రసాదించింది. సుప్రీంకోర్టు ఈ సంవత్సరం జనవరి 8న తీవ్రమైన పదజాలంతో ఈ చర్యను తప్పుపట్టింది. నేరస్థులను రెండు వారాలలోపు జైలుకు వెళ్ళాలని ఆదేశించింది. ఈ సంఘటన మన న్యాయ వ్యవస్థ ఎంతగా న్యాయానికి కట్టుబడి వున్నదో అద్భుతంగా తెలియజేస్తున్నది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ యుజ్జల్ భయాన్‌లతో కూడిన బెంచి స్పష్టంగా గుజరాత్ ప్రభుత్వానికి శిక్ష కాల పరిమితిని తగ్గించి క్షమాభిక్ష యిచ్చే అధికారం కానీ, పరిధి కానీ లేదని తేల్చి చెప్పటం విశేషం.

నిజానికి పదకొండు మంది నేరస్థులలో ఒకడైన రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా హైకోర్టును తప్పుదోవ పట్టించేందుకు నిజాలను కప్పిపుచ్చి 2022లో క్షమాభిక్ష ఆర్డరు సంపాదించుకున్నాడు. గుజరాత్ హైకోర్టు అప్పటికే రెండుసార్లు అప్పీలు చేసినప్పుడు ఈ కేసు మహారాష్ట్ర న్యాయ పరిధిలోకి వస్తుందని, గుజరాత్ జ్యూరిస్‌డిక్షన్‌లోకి ఇలాంటి విన్నపాలు తీసుకోవటం చట్ట సమ్మతం కాదు అని సుప్రీంకోర్టు తేల్చి



చెప్పింది. ఆ తర్వాత కూడా గుజరాత్ ప్రభుత్వం నేరస్థులకు ఇలా క్షమాభిక్ష ఇవ్వటం పక్షపాత వైఖరికి పరాకాష్ఠ. సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకోకపోయినట్లయితే చట్టాన్ని, న్యాయాన్ని సమాధిచేసినట్లయ్యేది. సరైన సమయంలో ఈ తీర్పు రావటం ముదావహం. ఒకవిధంగా ఈ తీర్పుతో మన దేశంలోని న్యాయస్థానాల వన్నె పెరిగినట్టయింది. చట్టానికి కట్టుబడి తీర్పులు ఉండవేమోనన్న అనుమానపు పొరలను ఈ తీర్పు తొలిగించినట్లయింది.

అంతేగాదు ప్రభుత్వాలు క్షమాభిక్ష ప్రసాదించటం లాంటి విచక్షణాధికారాన్ని ఏ విధంగా వినియోగించుకోవాలో కూడా మరోసారి సుప్రీంకోర్టు కుండబద్దలు కొట్టి పాలకులకు చెప్పినట్లయింది. గుజరాత్ ప్రభుత్వం తనకు లేని అధికారాన్ని దుర్వినియోగం చేసి ప్రజాస్వామ్యానికి తలవొంపులు తెచ్చింది. నిందితులనూ, నేరస్థులనూ సంస్కరించటంలో తప్పు లేదు. కానీ ఈ నేరస్థులు సమాజాన్ని, విలువలను లెక్కచేయని రీతిలో ఘోరాతి ఘోరమైన మానభంగానికి తలపెట్టటమే కాకుండా, ఆ కుటుంబ సభ్యులను కిరాతకంగా చంపారు. ఇలాంటివారు ఉరిశిక్షకు అర్హులు. కానీ సంస్కరించే ధోరణిలో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించటమే ఒక విధంగా వారిని మంచి మార్గంలో పెట్టటానికి చేసిన ఆలోచనగా భావించవచ్చు. కానీ 'దయగల' ప్రభుత్వం ఈ రీతిలో మరిన్ని నేరాలు చేసేవిధంగా వారికి క్షమాభిక్షను అందించటం వల్ల భవిష్యత్తులో వారు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉంది. అదీగాక క్షమాభిక్ష ఇవ్వటానికి కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి. అవ్వన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. క్షమాభిక్ష దొరక్కపోతే ఇలాంటి శిక్షబడ్డ వారు సుమారు 14ఏళ్ళు జైలులో ఉండాలి. అందుకనే నేరస్థుడికీ నేరస్థుడికీ ఈ విచక్షణాధికారాన్ని ఉపయోగించటంలో తేడాలు ఉంటాయి. క్షణికావేశంలో తలపెట్టిన నేరం, అసంకల్పిత ప్రతీకార చర్య లాంటి వాటిల్లో కొంతలో కొంత విచక్షణను ఉపయోగించవచ్చు. క్షమకు ఎవరు అర్హులనేది ప్రభుత్వాలు అనేక కొలతబద్దల ఆధారంగా మానవీయ కోణంలో, సంస్కరణను దృష్టిలో ఉంచుకొని నిర్వహించాలి. చట్ట ప్రయోజనాలకు, సమాజానికి జరిగే హానిని దృష్టిలో పెట్టుకోకుండా అధికారం ఉంది కదా అని బరితెగించి నచ్చినవారికి మేలు చేయటానికి చట్టాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తే ప్రజలూ, కోర్టులూ చూస్తూ ఊరుకోవు. విచక్షణాధికారానికి సుప్రీంకోర్టు లక్ష్మణరేఖ గీయటమే కాకుండా ప్రభుత్వాలకు హద్దులు ఏర్పరచటం న్యాయచరిత్రలో ఒక చెరిగిపోని పేజీ.

మోదీ బ్రహ్మాస్త్రం–విపక్షాల పాశుపతాస్త్రాలు

దేశంలో ఇప్పుడు అంతటా అయోధ్య సంరంభం కనిపిస్తోంది. ఇంటింటికీ అక్షింతలు, రామమందిరం ఫోటోలు పంచిపెడుతున్నారు. ఉత్తర భారతంలో అనేక దేవాలయాల్లో పూజలు ఉధృతంగా జరుగుతున్నాయి. ఉదయం లేవగానే ఎక్కడి నుంచో భజనలు వినిపిస్తున్నాయి. ఢిల్లీలోని పలు కాలనీల అపార్ట్‌మెంట్ సొసైటీల్లో రామభక్తులు జనవరి 22న సంబరాలు నిర్వహించనున్నారు. దేశ రాజధాని అంతటా ఒక వైపు మోదీ, మరో వైపు శ్రీరాముడి చిత్రంతో పోస్టర్లు వెలిసాయి. మీడియాలో అయోధ్యపై ప్రత్యేక కథనాలు పుంఖానుపుంఖాలుగా వస్తున్నాయి. రానున్న కొద్ది రోజుల్లో బీజేపీ, సంఘ్ పరివార్ సంస్థలు రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమంపై మరింత ఉధృతంగా జనంలోకి వెళతాయనడంలో సందేహం లేదు. భారతదేశం బానిసత్వం నుంచి విముక్తి పొందిందని, మందిర ప్రారంభం రోజు దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చిన నరేంద్రమోదీ ఈ మొత్తం ప్రచార ఘట్టానికి సారథ్యం వహిస్తున్నారనడంలో సందేహం లేదు. ఈ దిశలో ఆయన ప్రతి కదలికా, ప్రతి ప్రసంగం, ప్రతి చర్యా రికార్డు చేసేందుకు సమాచార దళం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. ప్రాణప్రతిష్ఠకు ముందుమూడు రోజులు మోదీ నేలపై కంబళి కప్పుకుని పడుకుంటారని, కేవలం ఫలాలు మాత్రమే తింటారని వార్తలు వ్యాపిస్తున్నాయి.

నిజానికి మందిర ప్రారంభం సాధారణ కార్యక్రమం కాదు. 2024 ఎన్నికలకు ముందు మోదీ పూరించిన శంఖారావంగానే దీన్ని భావించవచ్చు. కొద్ది రోజుల ముందు వికసిత్ సంకల్ప్ యాత్రను ప్రకటించి లబ్ధిదారుల వద్దకు వెళ్లమని పార్టీ నేతలను ప్రేరేపించిన మోదీ, మరోవైపు మందిర ప్రారంభాన్ని కూడా ప్రజలను బీజేపీ వైపు పూర్తిగా తిప్పుకునేందుకు ఒక అస్త్రంగా ప్రయోగిస్తున్నారనడంలో సందేహం లేదు.

మోదీ విసురుతున్న అస్త్రాలు సామాన్యమైనవి కావని ప్రతిపక్షాలకు తెలుసు. హిందువులను ద్వేషిస్తున్నందువల్లే రామమందిర ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ రావడం లేదని బీజేపీ నేతలు ఇప్పటికే విస్తృత ప్రచారం మొదలుపెట్టారు. ఈ రీత్యా రామమందిర భావోద్వేగాలను ఎదుర్కోవడంకోసం ప్రతిపక్షాలు సైద్ధాంతికంగా సమాయత్తం కావల్సివున్నది. ప్రతిపక్షాల ఆరు దశాబ్దాల పాలనలో దేశం పూర్తిగా వెనుకబడి ఉన్నదని, తన పదేళ్ల కాలంలోనే కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగిందని, ప్రజలకు సంక్షేమం పూర్తిగా అందుతోందని కూడా మోదీ టీమ్ విస్తృత ప్రచారం చేస్తోంది. ఈ ప్రచారాన్ని తుత్తునియలు చేసేందుకు కూడా ప్రతిపక్షాలు గణాంక వివరాలతో సిద్ధం కావల్సివున్నది. మూడవది ప్రతిపక్షాలన్నీ అవినీతి భూయిష్ఠమైనవని, వారసత్వ పాలన తప్ప వాటికి మరో లక్ష్యం లేదని మోదీ చేస్తున్న ప్రచారాన్ని ఎలా ఎదుర్కోవాలో తెల్సుకోవాలి. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే దేశంలో అభివృద్ధి వెనుకబడుతుందని, అధికారంలో వాటా కోసం కుమ్ములాటలు జరుగుతాయని కూడా మోదీ ప్రజల్లోకి వెళతారనడంలో సందేహం లేదు.

వీటన్నింటినీ ఎదుర్కోగల అస్త్రాలు ప్రతిపక్షాలకు లేవని చెప్పలేము. మందిర నిర్మాణం ప్రారంభం కాకముందే ప్రాణ ప్రతిష్ఠ చేయడం, అందునా ఆ పవిత్ర కృత్యాన్ని మోదీయే నిర్వహించడం వెనుక రాజకీయం ఉన్నదని శంకరాచార్యులు విమర్శించడం వంటివి ప్రస్తావించడం మాత్రమే సరిపోదు. శ్రీరాముడి గురించి మాట్లాడుతూనే మరో వైపు చేతుల్లో కత్తులు ఝుళిపిస్తున్నారని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే మణిపూర్‌లో విమర్శించారు. 'ప్రతి ఒక్కరికీ మత విశ్వాసాలు ఉంటాయికాని ఓట్ల కోసం ఆ విశ్వాసాలను ఎవరూ ఉపయోగించుకోరు. బీజేపీ ఓట్లకోసం మతాన్ని ఉపయోగించుకుంటోంది' అని ఆయన విమర్శించారు. ఈ ప్రచారం ప్రజల్లోకి ఉధృతంగా వెళ్లనంతవరకూ రామమందిర నిర్మాణం బీజేపీకే అనుకూలంగా ఉంటుంది.



దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చిత్తశుద్ధితో కృషిచేస్తాయని నమ్మకం కలిగించనంతవరకూ అణగారిన వర్గాలు మతం వెల్లువలో కొట్టుకుపోకుండా విపక్షాల వైపు మొగ్గు చూపే అవకాశం లేదు. ఇందుకు ఇండియా కూటమి కనీస ఉమ్మడి ఎజెండాను ఏర్పర్చుకోవాలి. జయప్రకాశ్ నారాయణ్ లాగా వివిధ వర్గాలను, కులాలను సమీకరించగలిగిన శక్తి ప్రతిపక్ష నేతల్లో ఎవరికైనా ఉన్నదా? 2024 ఎన్నికలను మండల్, కమండల్ పోరాటంగా మార్చే సైద్ధాంతిక శక్తి ప్రతిపక్షాలకు ఉన్నదా?

నిజానికి మతాన్ని రాజకీయాలను కలగలపడంపై ఉన్నతన్యాయస్థానం పలు సందర్భాల్లో పలు రకాలుగా వ్యాఖ్యానించింది. హిందుత్వ అనేది ఒక జీవన విధానమని, దానిపై ఎన్నికల్లో ఓట్లు అడిగినంత మాత్రాన చట్టాన్ని ఉల్లంఘించినట్లు కాదని 1995లో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వర్మ నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ స్పష్టం చేసింది. హిందూ రాష్ట్రం పేరుతో ఓట్లు అడిగినందుకు శివసేన నేత మనోహర్ జోషితో పాటు 9 మందిని అనర్హులుగా ప్రకటిస్తూ బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కొట్టివేసింది. శివసేన అధినేత బాల్ థాకరే ఉద్రేకపూరిత ప్రసంగాలను కూడా సుప్రీం కోర్టు విస్మరించింది. మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోకూడదని ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(3) విధించిన నిబంధనను అది బుట్టదాఖలు చేసింది. ఈ నిబంధన ప్రకారం మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడం కూడా అన్ని విధాలా అవినీతే. సుప్రీంకోర్టు రూలింగ్‌పై పార్లమెంట్ కానీ, ఎన్నికల కమిషన్ కానీ పెద్దగా ప్రతిస్పందించలేదు. సుప్రీంకోర్టు కూడా రెండు దశాబ్దాలు మౌనం పాటించింది. ఒక రకంగా ఈ తీర్పు బీజేపీ ఎదుగుదలకు కారణమైందన్న వ్యాఖ్యలు కూడా ఉన్నాయి.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

కాని మతాన్ని రాజకీయాలతో కలగాపులగం చేయడాన్ని రాజ్యాంగమే నిషేధించిందని దాదాపు 20 ఏళ్ల తర్వాత 2017లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టిఎస్ ఠాకూర్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ బెంచ్ స్పష్టంచేసింది. జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ ఎసఏ బాబ్డే, జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు ఈ విషయంలో ఏకీభావం వ్యక్తం చేయగా, ఈ అంశాన్ని పార్లమెంట్‌కు వదిలి వేయాలని న్యాయమూర్తులు ఆదర్శ్ గోయెల్, యుయులలిత్, డివై చంద్రచూడ్ ప్రకటించారు. ఈ తీర్పుపై నాడు అసమ్మతి ప్రకటించిన జస్టిస్ డివై చంద్రచూడ్ ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి. రామమందిరాన్ని రాజకీయాలకు బీజేపీ ఉపయోగించుకోవడంపై ఎవరైనా మళ్లీ కోర్టుకు వెళితే ప్రస్తుత న్యాయస్థానం ఏమి చెబుతుందో చెప్పలేము. అంతకు ముందు ఎన్నికల కమిషన్ ఆ విషయంలో కలుగచేసుకునే ధైర్యం చూపాలి కదా! మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడం రాజకీయ నాయకులు ఆపనంతవరకూ విద్వేష ప్రసంగాలు ఆగబోవని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జోసెఫ్, జస్టిస్ నాగరత్నమ్మ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల ఏమి ఒరుగుతుంది? నిజానికి రాజకీయ నాయకులు ఉపయోగించుకుంటే ఉపయోగపడే ప్రజలు ఉన్నంతకాలం వారు భావోద్వేగాలకు గురవుతూనే ఉంటారు. మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకోవడం ద్వారా తమను మభ్యపెడుతున్నారని ప్రజలు గ్రహించాలి. ఆ గ్రహింపు వచ్చేందుకు వారిని చైతన్యపరచాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీలదే. రామమందిరం విషయంలో ఒక స్పష్టమైన సైద్ధాంతిక దృక్పథం ముందుగా రాజకీయ పార్టీలకు ఏర్పడాలి. ఈ పార్టీలే అధికార పార్టీ ఉధృత ప్రచారానికి లోనై ఆత్మరక్షణలో పడితే ఎవరూ ఏమీ చేయలేరు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మాటేమిటి? అని ఖర్గే అన్నమాటలు జనం మనసుల్లో కూడా ప్రతిధ్వనింపచేయాలి.

ఈశాన్యం నుంచి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యాత్ర ప్రారంభించడం ఒక వ్యూహాత్మక నిర్ణయమే. ఈశాన్య రాష్ట్రాల్లో 25 లోక్‌సభ సీట్లున్నాయి. ఇందులో కేవలం అస్సాంలోనే 14 సీట్లు ఉన్నాయి. ఈ పాతిక సీట్లను రాహుల్ గాంధీ యాత్ర ఎంతో కొంత ప్రభావితం చేయగలదని కాంగ్రెస్ భావిస్తోంది. మణిపూర్‌లో కుకీలు, మైతీలు ఒకర్నొకరు నరుక్కున్న ప్రాంతాల్లోనే రాహుల్ పర్యటించి వారిమధ్య సయోధ్యకు కాంగ్రెస్ కృషి చేస్తుందనే సందేశం పంపారు. సముద్ర స్నానాలు చేసేందుకు సమయం ఉంటుంది కాని మణిపూర్‌లో అడుగు పెట్టేందుకు, జాతుల మధ్య సామరస్యం కుదిర్చేందుకు మోదీకి సమయం లేదని ఆయన విమర్శించారు. మణిపూర్‌లో జాతుల సమస్యను ప్రస్తావిస్తే ఇతర రాష్ట్రాల్లో బీజేపీ మతప్రచారానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ కులం గురించి ప్రస్తావిస్తున్నారు. కుల జనగణన జరిపిస్తామని హామీలు ఇస్తున్నారు. నిజానికి కుల జనగణన గురించి ఇటీవల మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో ఎన్నికల సభల్లో ఎంత మాట్లాడినా కాంగ్రెస్‌కు అంత ప్రయోజనం కలుగలేదు. అంత మాత్రాన భారత రాజకీయాల్లో కులానికి అంత ప్రాధాన్యం లేదని కొట్టి పారేయలేము. ప్రజలు మత ప్రాతిపదికన ఏకం అవుతారని కూడా తీర్మానించలేము. మతం గురించి మాట్లాడుతూనే కులాలను ఉపకులాలుగా చీల్చి ప్రయోజనం పొందేందుకు బీజేపీ తీవ్ర యత్నాలు చేస్తున్న విషయాన్ని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు విస్మరించరాదు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయయాత్రలో ప్రధానమైనది సామాజిక న్యాయం అందించడం. దేశంలో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చిత్తశుద్ధితో కృషిచేస్తాయని నమ్మకం కలిగించనంతవరకూ అణగారిన వర్గాలు మతం వెల్లువలో కొట్టుకుపోకుండా ప్రతిపక్షాల వైపు మొగ్గు చూపే అవకాశం లేదు. ఇందుకు ఇండియా కూటమి కనీస ఉమ్మడి ఎజెండాను ఏర్పర్చుకోవాలి. జయప్రకాశ్ నారాయణ్ లాగా వివిధ వర్గాలను, కులాలను సమీకరించగలిగిన శక్తి ప్రతిపక్ష నేతల్లో ఎవరికైనా ఉన్నదా? 2024 ఎన్నికలను మండల్, కమండల్ పోరాటంగా మార్చే సైద్ధాంతిక శక్తి ప్రతిపక్షాలకు ఉన్నదా? అన్నది చర్చించాల్సి ఉన్నది.

వారసత్వం, అవినీతిని బీజేపీ కూడా ప్రోత్సహిస్తున్నందువల్ల ఆ విషయంలో ప్రతిపక్షాలను విమర్శించడంలో పసలేదనే చెప్పాలి. వివిధ రాష్ట్రాల్లో వందలాది వారసులను బీజేపీ అందలం ఎక్కించింది. బీజేపీతో చేతులు కలిపిన అనేకమంది అవినీతిని విస్మరించారు. సంకీర్ణ ప్రభుత్వాల వల్ల దేశం విచ్ఛిన్నమవుతుందని చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడం కూడా అంత కష్టమేమీకాదు. ఐదేళ్ల పాటు నరసింహారావు మైనారిటీ ప్రభుత్వంలోనూ, ఆ తర్వాత వాజపేయి నిర్వహించిన సంకీర్ణ ప్రభుత్వంలోనూ దేశం విచ్ఛిన్నమైందా లేక అభివృద్ధి పథంలో నడిచిందా అన్న ప్రశ్నలు వేసుకుంటే సరైన జవాబులు లభిస్తాయి. పదేళ్ల పాటు యూపీఏ ప్రభుత్వం విజయవంతంగా పాలించిన సమయంలో జరిగిన అభివృద్ధికీ, పదేళ్ల పాటు మోదీ హయాంలో జరిగిన అభివృద్ధికీ మధ్య తేడాపై గణాంక వివరాలతోసహా చర్చించేందుకు వెనుకాడనక్కర్లేదు. పదేళ్ల మన్మోహన్ సింగ్ పాలనలో సగటు అభివృద్ధి రేటు 8.4 శాతం కాగా మోదీ హయాంలో సగటు అభివృద్ధి రేటు 5.4 శాతం మాత్రమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలు కొట్టిపారేయదగినవి కావు. రామమందిరం మోదీకి బ్రహ్మాస్త్రమే కావచ్చు కాని ప్రతిపక్షాల వద్ద కూడా పాశుపతాస్త్రాలు తక్కువేమీ లేవు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రజాస్వామ్యం అపహాస్యం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టసభలను నిర్వీర్యం చేస్తోంది. పార్లమెంట్‌లో చర్చలు జరగనీయకుండా చేస్తూ ఏకపక్షంగా చట్టాలు చేస్తోంది. ప్రతిపక్ష సభ్యులను పలు సందర్భాల్లో సస్పెండ్ చేసి తమకు ఎదురులేకుండా చేసుకుంటున్నారు. చివరకు పార్లమెంట్ కొత్త భవనంలోకి చొరబడి ఆగంతకులు దాడి చేసిన సంఘటనపై కూడా చర్చకు ప్రభుత్వం సిద్ధపడకపోవడం, కనీసం ఒక ప్రకటన చేయకపోవడం, 146 మంది విపక్ష సభ్యులను బహిష్కరించడం ఈ దుర్నీతికి పరాకాష్ఠ. స్వతంత్ర భారతావనిలో మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఈ రకంగా ఎన్నడూ అపహాస్యానికి గురికాలేదు. మణిపూర్ మండిపోతున్నా, అదానీ వ్యవహారం పార్లమెంట్‌ను కుదిపేసినా ప్రధానమంత్రి స్పందించరు. పండిట్ నెహ్రూ, హీరేన్ ముఖర్జీ, పుచ్చలపల్లి సుందరయ్య, మధులిమాయే, రామ్ మనోహర్ లోహియా వంటి అనేకమంది రాజకీయ ఉద్దండులు ప్రజాసమస్యలకు పార్లమెంట్‌ను వేదికగా చేసుకున్నారు. రాజకీయ విలువలను పాటిస్తూ పార్లమెంట్ హుందాగా నడిచేలా చేశారు. అందుకు భిన్నంగా, బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. అది తెచ్చిన వ్యవసాయ చట్టాల మీద రైతులు సుదీర్ఘకాలం పాటు చారిత్రాత్మక పోరాటం చేశారు. వ్యవసాయ చట్టాల కోసం ఆర్డినెన్స్ తీసుకురావడమే అప్రజాస్వామిక చర్య. చివరకు రైతుల ఆందోళనతో ప్రధానమంత్రి దిగిరాక తప్పలేదు.

సమాఖ్య వ్యవస్థపై దాడి జరుగుతోంది. విద్య, ఆరోగ్యం, సహకారం వంటి రంగాలపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోంది. ప్రణాళికా సంఘాన్ని ఏకపక్షంగా రద్దు చేసి దాని స్థానంలో 'నీతి ఆయోగ్'ను ఏర్పాటు చేశారు. ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ఏర్పడ్డ ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించి, అనేక దశాబ్దాలుగా దేశ ప్రజలకు సేవలందిస్తున్న బ్యాంకింగ్, రైల్వే, రక్షణ, బీమా వంటి కీలక రంగాలను స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం తలెత్తినపుడు అమెరికాతో సహా పలు అగ్రదేశాల్లో బ్యాంకింగ్, బీమా, పెన్షన్ వంటి మార్కెట్లు, పలు వ్యవస్థలు దివాళా తీసాయి. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో మన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడింది దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలే. నేటికీ సామాజిక రంగాల అభివృద్ధికి ఎల్ఐసీ, ప్రభుత్వరంగ బ్యాంకులు సహాయపడుతున్నాయి.

మరోపక్క మానవాభివృద్ధి నివేదిక, ఆక్స్‌ఫామ్ నివేదిక, ఆకలి సూచి, సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ, ఎన్ఎస్ఎస్ఓ, ప్రజాస్వామ్య సూచి తదితర నివేదికలను విశ్లేషిస్తే ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలి, పౌరహక్కుల హననం వంటివి గత దశాబ్ద కాలంలో మరింత తీవ్రమయ్యాయని స్పష్టమవుతోంది. 80శాతానికి పైగా కుటుంబాల ఆదాయపు విలువ పడిపోతే, బడా సంపన్నుల ఆదాయాలు రెట్టింపయ్యాయి. అధిక ధరలతో కోట్లాది మంది ప్రజల జీవనోపాధి, భద్రత ప్రమాదంలో పడుతున్నాయి. ఏడీఆర్ నివేదిక ప్రకారం బీజేపీ ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా కోట్లాది రూపాయల విరాళాలు సేకరించింది. ఈ నిధులకు సంబంధించిన వివరాలు ప్రజలకు తెలియవు. ఆ విధానం ఎంత అప్రదిష్ఠపాలైనా బీజేపీ లెక్కచేయడం లేదు. ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సైతం తీసేశారు. ఎన్నికల ఖర్చును తగ్గించేందుకేనంటూ జమిలి ఎన్నికల పల్లవి నెత్తుకుని అందుకు ఒక కమిటీని నియమించారు. ఒకే జాతి– ఒకే సంస్కృతి– ఒకే ఎన్నిక– ఒకే భాష అంటూ మోసపూరిత ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతూ విభిన్నమైన, బహుళమైన మన సమాజపు మూలాలను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజల్లో మత భావాలను ప్రేరేపిస్తూ మన రాజ్యాంగ లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్నారు. ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టులు గళమెత్తినపుడు వారిని అణచివేతలకు గురిచేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, దాని ద్వారా సంక్రమించిన హక్కులను పరిరక్షించుకోవడం దేశ ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యం.

– వి.వి.కె. సురేష్

వ్యవసాయం వెన్ను విరిచిన విత్తన కుంభకోణం!

వ్యవసాయ అభివృద్ధిలో నాణ్యమైన విత్తనాలు ఎంతో కీలకం. అందుకే హరిత విప్లవం తొలి దశలోనే ఆనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విత్తన ప్రాముఖ్యతను గుర్తించి, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలనే ఉద్దేశంతో, జాతీయ విత్తన సంస్థతో పాటు ప్రతి రాష్ట్రంలో విత్తనాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేశాయి. ప్రపంచీకరణ అనంతరం అనేక దేశీయ, బహుళ జాతీయ విత్తన కంపెనీలు విస్తరించాయి. భారతదేశ విత్తన రంగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలకమైన భాగస్వామిగా ఉండేది. దాదాపు 600కు పైగా విత్తన కంపెనీలు ఉమ్మడి రాష్ట్రంలో ఉండేవి. దేశీయ విత్తన రంగంలో రాష్ట్ర విత్తన రంగ వాటా దాదాపు 60 శాతంగా ఉండేది. ముఖ్యంగా దేశ హైబ్రిడ్ (వరి, సజ్జ, జొన్న) విత్తన ఉత్పత్తిలో అనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతం దాదాపు 80శాతం వాటా కలిగి ఉండేది. అందుకే తెలంగాణ ప్రాంతాన్ని దేశ విత్తన భాండాగారంగా పేర్కొనేవారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2015లో రాష్ట్ర అసెంబ్లీలో ప్రసంగిస్తూ రాష్ట్ర విత్తన రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తానని, ప్రతి తెలంగాణ రైతును విత్తన రైతుగా మారుస్తానని అన్నారు. అంతేగాక ప్రతి మండలాన్ని ఒక్కో విత్తన కంపెనీ దత్తత తీసుకునేలా చేసి, రాష్ట్ర రైతాంగాన్ని విత్తన ఉత్పత్తిదారులుగా మార్చి, విత్తనాలను విదేశాలకు ఎగుమతి చేస్తామని చెప్పారు. బీఆరఎస్ ప్రభుత్వం చెప్పిన ఎన్నో అబద్ధాలలో ఇది ఒక మధురమైన అబద్ధం. గత తొమ్మిదేళ్లల్లో ఏ ఒక్క విత్తన కంపెనీ రాష్ట్రంలోని ఏ గ్రామాన్ని గాని, ఏ మండలాన్ని గాని దత్తత తీసుకొని విత్తనాభివృద్ధి చేసిన దాఖలాలు లేవు.

రాష్ట్రం ఏర్పాటు నాటికి 2014లో దాదాపు 400 పైగా విత్తన కంపెనీలు తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయి. అదేవిధంగా దేశ విత్తన వ్యాపారంలో తెలంగాణ వాటా దాదాపు 30శాతం ఉండేది. అది ప్రస్తుతం 19 శాతానికి పడిపోయింది. 2014తో పోలిస్తే హైబ్రిడ్ వరి విత్తన ఉత్పత్తిలో తెలంగాణ వాటా దాదాపు 30శాతానికి పడిపోయింది. హైబ్రిడ్ వరి విత్తన ఉత్పత్తిలో పాల్గొనే బహుళ జాతీయ విత్తన కంపెనీల సంఖ్య గణనీయంగా తగ్గింది. అలాగే 2014లో దాదాపు 18 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న హైబ్రిడ్ మొక్కజొన్న విత్తన ఉత్పత్తి దాదాపు 27 శాతానికి తగ్గి నేడు 13 వేల ఎకరాలకు పరిమితమైంది. హైబ్రిడ్ బీటీ కాటన్ విత్తన విస్తీర్ణం కూడా గత తొమ్మిదేళ్లలో 30 శాతానికి పైగా పడిపోయింది. అదేవిధంగా హైబ్రిడ్ వరి, బీటీ పత్తి విత్తన రైతుల సంఖ్య 2014లో 1,24,000 ఉంటే అది ఇప్పుడు 92,000 లకు పడిపోయింది. అంటే దాదాపు 25శాతం హైబ్రిడ్ వరి, పత్తి విత్తన రైతులు గత తొమ్మిదేళ్లలో విత్తనోత్పత్తి రంగం నుండి తప్పుకున్నారు.

మరోవైపు హైబ్రిడేతర విత్తన రంగంలోనికి కొందరు బీఆరఎస్ నాయకుల అండదండలతో ప్రవేశించి నూతన విత్తన కంపెనీలను స్థాపించి హైబ్రిడేతర నకిలీ వరి విత్తనాలను పెద్ద ఎత్తున వివిధ నకిలీ వరి రకాల పేరుతో అమ్మి భారీగా సొమ్ము చేసుకున్నారు. దీనికి ప్రధాన కారణం గత ప్రభుత్వం 2019–22 మధ్య కాలంలో ఒకసారి సన్న వరి రకాలు వేయాలని, మరొకసారి దొడ్డు వరి రకాలు పండించాలని చెప్పి రైతులను తప్పుదోవ పట్టించడం. ఇదే అదనుగా కొందరు వ్యాపారస్థులు బీఆరఎస్ నాయకుల అండదండలతో మార్కెట్లోకి ప్రవేశించి వివిధ నూతన వరి రకాల పేరుతో అధిక ధరలకు విత్తనాలు అమ్మి రైతులను దగా చేశారు. ఇంత జరుగుతున్నా గత ప్రభుత్వంలోని వ్యవసాయ శాఖలోని ఉన్నతాధికారులు గాని, వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఉన్నత యాజమాన్యం గాని ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదంతా పరిశీలించి విశ్లేషణ చేస్తే ఎన్నో ఇతర కుంభకోణాల లాగానే గత బీఆరఎస్ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున విత్తన కుంభకోణం జరిగినట్లు అర్థమవుతుంది.

ఒక వైపు కొందరు బీఆరఎస్ నాయకులు, మరోవైపు కొన్ని నకిలీ ప్రైవేటు కంపెనీలు విత్తన రైతులను దోపిడీ చేస్తుంటే, కొద్దిమంది ఉన్నతాధికారులు దీనిని ఆసరా చేసుకొని పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. గత ప్రభుత్వం విత్తన రంగాన్ని పూర్తిగా తుంగలోకి తొక్కింది.

ఈ విధంగా తెలంగాణలో నిర్లక్ష్యానికి గురైన విత్తన రంగం పొరుగు రాష్ట్రాలకు తరలిపోయింది. ఉదాహరణకు తెలంగాణ నుంచి దాదాపు 27 శాతం హైబ్రిడ్ మొక్కజొన్న విత్తన విస్తీర్ణం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు ప్రాంతానికి, 30 శాతం హైబ్రిడ్ వరి విత్తన విస్తీర్ణం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి, 30శాతం హైబ్రిడ్ పత్తి విత్తన విస్తీర్ణం కర్ణాటక రాష్ట్రానికి గత తొమ్మిది సంవత్సరాల కాలంలో తరలిపోయింది.

విత్తన రంగం ఈ స్థాయిలో నిర్లక్ష్యానికి గురికావడానికి గల పలు కారణాలను పరిశీలిస్తే– గత తొమ్మిదేళ్లలో బీఆరఎస్ ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించే విధానానికి దాదాపుగా స్వస్తి పలికింది. తద్వారా విత్తన రంగానికి ఇవ్వవలసిన ప్రోత్సాహకాలు పూర్తిగా నిలిపివేయబడ్డాయి. కేంద్ర ప్రభుత్వం విత్తన ఉత్పత్తి రైతులకు ఇచ్చే ప్రోత్సాహకాలను తెలంగాణ రాష్ట్రంలో పూర్తిగా అమలు చేయటం మానేశారు. ఈ విధానాన్ని అమలు చేస్తే విత్తన రైతులకు ఎకరానికి దాదాపుగా రూ.10వేల నుంచి 15 వేల అదనపు లాభం చేకూరి ఉండేది. అలాగే కొంతమంది బీఆరఎస్ నాయకులు దేశీయ, బహుళ జాతీయ విత్తన కంపెనీల నుంచి నాణ్యతను పూచీగా చూపిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. విత్తన ఉత్పత్తి రంగంలో ఆర్గనైజర్స్ రూపంలో ఉన్న కొంతమంది దళారులు విత్తన రైతులను దోపిడీ చేయడం కూడా ఒక



కారణం. అలాగే విత్తన రైతుకు, విత్తన కంపెనీలకు మధ్య ఉన్న ఒప్పందాలకు చట్టబద్ధత లేకపోవడం వలన దళారులు, విత్తన కంపెనీలు కలిసి విత్తన రైతులకు సరైన ధరను చెల్లించటం లేదు. విత్తన రైతులకు పంటల బీమా లేకపోవడం కూడా విత్తనోత్పత్తిరంగం గత ప్రభుత్వం చేత ఏ విధంగా నిర్లక్ష్యానికి గురికాబడిందో తెలియజేసే సాక్ష్యం.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల కుప్పగా మార్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం చివరికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలను కూడా వదలలేదు. ఈ సంవత్సరం వివిధ గిడ్డంగులను, ఆస్తులను తనఖా పెట్టి గత బీఆరఎస్ ప్రభుత్వం దాదాపుగా 500 కోట్ల రూపాయల అప్పులు తెచ్చింది. ఈ విధంగా తెచ్చిన అప్పు సొమ్మును ఎలాంటి విత్తన సంస్థ వృద్ధికి గాని, కొత్త ఆస్తులను సృష్టించడానికి గానీ వాడిన దాఖలాలు లేవు. తెచ్చిన ఈ అప్పును పశుగ్రాస విత్తన సబ్సిడీ రూపంలో వాడినట్టు తెలుస్తుంది. ఇందులో సింహభాగం దారి మళ్లినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ విధంగా ఒక వైపు కొందరు బీఆరఎస్ నాయకులు, మరోవైపు కొన్ని నకిలీ ప్రైవేటు కంపెనీలు విత్తన రైతులను దోపిడీ చేస్తుంటే, మరోవైపు కొద్దిమంది ఉన్నత అధికారులు దీనిని ఆసరా చేసుకొని పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. అలా గత ప్రభుత్వం విత్తన రంగాన్ని పూర్తిగా తుంగలోకి తొక్కింది.

ఇప్పుడు ఈ రంగాన్ని పునరుద్ధరించడం కొత్త ప్రభుత్వానికి ఒక పెద్ద సవాలు. గత తొమ్మిదేళ్లలో తెలంగాణ రాష్ట్రం నుండి తరలిపోయిన విత్తన సంస్థలను తిరిగి రాష్ట్రానికి రప్పించడం అనేది చాలా కీలకం. అంతేగాక రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన పరిశోధనలు దాదాపుగా నిలిచిపోయాయి. ఉమ్మడి రాష్ట్రంలో మొదలైన కొన్ని పరిశోధనల ఫలితంగా 2014 తర్వాత కొన్ని నూతన పంట రకాలను విడుదల చేసి అది మేమే చేసినట్టుగా గొప్పలు చెప్పుకుంటున్నారు. ఈ పంట రకాలు కూడా అనుకున్నంత స్థాయిలో రైతులకు అందుబాటులోకి రాలేదు. అంతేకాకుండా ఎన్నో ఏళ్లుగా చేసిన పరిశోధన ఫలితాలు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి కొందరు బీఆర్ఎస్ నాయకుల అండదండలతో ప్రైవేట్ విత్తన కంపెనీలకు తరలిపోయినట్టు ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చింది. దీనికి నిదర్శనం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నుంచి పదవీ విరమణ పొందిన కీలక అధికారులు ఆయా ప్రైవేట్ కంపెనీలలో కీలక పదవులలో చేరడమో, లేక భాగస్వాములుగా చేరటమో! ఈ వ్యవహారంపై విచారణ జరిపి విశ్వవిద్యాలయ పరిశోధన వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావడం నూతన ప్రభుత్వం పైన ఉన్న మరొక బాధ్యత. అంతేగాక గత ప్రభుత్వంలో ఈ విత్తన వ్యవస్థ విధ్వంసానికి కారణమైన కొంతమంది ఉన్నతాధికారులను గుర్తించి వాళ్లను ఆ పదవుల నుంచి తప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దేశీయ విత్తన రంగంలో తెలంగాణకు ఉన్న గొప్ప అవకాశాన్ని వినియోగించుకున్నట్లయితే రాష్ట్ర రైతులకే కాకుండా, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించి ఎంతో మేలు చేసినట్టు అవుతుంది. దీనికి అనుగుణంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థతో పాటు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.

• ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 17 జనవరి 2024

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 16: గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎస్.విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11వ తేదీన



ఐనవోలు జాతరలో శివసత్తుల పూనకాలు (ఇన్‌సెట్‌లో.. మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే నాగరాజు)

మమ్మేలు మల్లన్న..

- సంక్రాంతి వేళ పోటెత్తిన ఐనవోలు క్షేత్రం
- మల్లన్నను దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు
- గుబాళించిన సంస్కృతీ సంప్రదాయాలు
- పూనకంతో ఊగిపోయిన భక్తులు, శివసత్తులు
- కిక్కిరిసిన ఆలయ పరిసరాలు
- మహా నివేదనతో దేవుడి రథం ఊరేగింపు

7



కొత్తకొండ వీరన్న జాతరకు తరలివస్తున్న ఎడ్లబండ్ల రథాలు (ఇన్‌సెట్‌లో.. ఆలయంలో మంత్రి పొన్నం)

కరుణించు వీరన్న..

- లక్షలాది భక్త జనంతో హోరెత్తిన కొత్తకొండ
- మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ప్రముఖులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎడ్లబండ్ల రథాలు, మేకల బండ్లు
- గుమ్మడికాయలు, కోర మీసాలు సమర్పించిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయం



ప్రక్షాళన, షురూ

- ఎన్‌పీడీసీఎల్‌లో పాతుకుపోయిన డైరెక్టర్లపై త్వరలో వేటు
- కొత్తవారి నియామకానికి కసరత్తు
- ఎనిమిదేళ్లుగా పాత డైరెక్టర్లే
- పూర్తికాలం డైరెక్టర్ లేని ఫైనాన్స్ విభాగం
- సంస్థను గాడిలో పెట్టేదిశగా కొత్త సీఎండీ ప్రయత్నాలు

హనుమకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్తు పంపిణీ మండలి (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) ప్రక్షాళన మొదలైంది. ఎన్‌పీడీసీఎల్‌లో చాలాకాలంగా పాతుకుపోయిన ప్రస్తుత డైరెక్టర్ల స్థానంలో కొత్తవారిని నియమించేందుకు కసరత్తు జరుగుతోంది. గత సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు స్థానంలో కొత్త సీఎండీగా ఐఏఎస్ అధికారి కర్నాటి వరుణ్‌రెడ్డి నియామకం జరిగాక ఈ ప్రక్షాళన ప్రక్రియ వేగం పుంజుకుంది. పాత డైరెక్టర్ల స్థానంలో కొత్త డైరెక్టర్ల నియామకానికి అర్హులైనవారిని ఎంపిక చేసేందుకు కొద్దిరోజులుగా కొత్త సీఎండీ శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పరిధిలో విద్యుత్తు పంపిణీ బాధ్యతలను నిర్వహిస్తున్న ఎన్‌పీడీసీఎల్ పరిధిలో 5,612 గ్రామాలున్నాయి. హనుమకొండలోని నక్కలగుట్టలోని ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీతో పాటు ప్రస్తుతం నలుగురు డైరెక్టర్లు ఉన్నారు. వారు- బి.వెంకటేశ్వర్ రావు (హెచ్‌ఆర్‌డీ), మోహన్‌రెడ్డి (ప్రాజెక్టులు, ఆపరేషన్), సంధ్యారాణి (కమర్షియల్) గణపతి (ఇన్‌వెస్ట్ ప్రమోషన్ సెల్, రెగ్యులేటరీ ఆఫైర్స్ సెల్-ఐపీసీ, ఆర్‌సీ). డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టు చాలాకాలంగా ఖాళీగా ఉంది. చీఫ్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) తిరుపతిరెడ్డి ఫైనాన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డిస్కమ్ నిబంధనల ప్రకారం ఎన్‌పీడీసీఎల్‌లో డైరెక్టర్ కాలపరిమితి ఐదేళ్లు ఉంటుంది. ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యాక కొనసాగింపునకు అవకాశం ఉంటుంది. 70 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితి మించనివారినే టీఎస్ఎండీసీఎల్ డైరెక్టర్‌గా నియమించాల్సి ఉంటుంది. ఐదేళ్ల కాలపరిమితి ప్రస్తుత డైరెక్టర్లకు వరంగా మారింది. ఇప్పుడున్న డైరెక్టర్లు ఎనిమిది నుంచి తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్నారు.

మానవ వనరుల విభాగం (హెచ్‌ఆర్‌డీ) డైరెక్టర్ పోస్టు 2015 ఆగస్టు 1న ఖాళీ అయింది. ఆ తర్వాత నియమితులైన వెంకటేశ్వర్‌రావు అప్పటినుంచి అదే పదవిలో కొనసాగుతున్నారు. చీఫ్‌ఇంజనీర్‌గా రిటైర్ అయిన సంధ్యారాణి కూడా ఎనిమిదేళ్లుగా డైరెక్టర్ కమర్షియల్‌గా కొనసాగుతున్నారు. సూపరింటెండెంట్‌గా రిటైర్ అయిన మోహన్‌రెడ్డి చాలాకాలంగా ప్రాజెక్టు ఆపరేషన్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. చాలాకాలం కిందటే రిటైరైన గణపతి కూడా ఎనిమిదేళ్లుగా ఐపీసీ రాక్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఫైనాన్స్ డైరెక్టర్ సుదర్శన్ పదవీకాలం 2015 ఆగస్టు 6తో ముగియడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. అప్పటి నుంచి శాశ్వత డైరెక్టర్‌ను నియమించలేదు. గత సీఎండీ అన్నమనేని గోపాల్ రావు కొంతకాలం ఈ బాధ్యతలను చూశారు. ఆ తర్వాత ఎన్‌పీడీసీఎల్‌లో సీజీఎంగా పనిచేస్తున్న తిరుపతిరెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించారు. అప్పటినుంచి ఫైనాన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఆయన ఈ పోస్టులో కొనసాగుతున్నారు.

తెలంగాణ ఏర్పాటైన కొన్ని నెలల వరకు టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత కార్తికేయ మిశ్రా బదిలీకావడంతో ఆయన స్థానంలో దక్షిణ మండల విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎస్‌పీడీసీఎల్)లో డైరెక్టర్‌గా పనిచేసిన కెవెంకటనారాయణను 2014లో గత ప్రభుత్వం నియమించింది. ఆ తర్వాత సీఎండీగా గోపాలరావు నియమితులయ్యారు. సీఎండీలు మారారు కానీ.. డైరెక్టర్లు మాత్రం మారలేదు. రిటైర్డ్ అయిన అధికారులంతా డైరెక్టర్ పోస్టులో తిష్టవేసి సుదీర్ఘకాలం కొనసాగుతుండంతో విద్యుత్తు సంస్థలో సుదీర్ఘకాలం పని చేసిన రిటైర్ అయిన మిగతా అధికారులకుగానీ, ఇన్‌సర్వీస్‌లో ఉన్న ఉన్నవారికిగానీ డైరెక్టర్లు అయ్యే అవకాశం లేకుండా పోతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇన్ సర్వీస్‌వారిని నియమించాలి

డైరెక్టర్లుగా ఇన్‌సర్వీస్‌లో ఉండి మరో ఏడాది రెండేళ్లలో రిటైర్ కాబోయే అధికారులను కూడా నియమించాలని విద్యుత్తు ఉద్యోగుల సంఘాల నాయకులు కోరుతున్నారు. ఇన్‌సర్వీస్‌లో ఉన్నవారిని డైరెక్టర్లుగా నియమించినట్లయితే వారు బాధ్యతతో, నిబద్ధతతో పనిచేస్తారని అభిప్రాయపడుతున్నారు. ఎప్పుడో రిటైర్ అయినవారికి డైరెక్టర్ పోస్టులను పునరావాస కేంద్రాలుగా మార్చవద్దని కోరుతున్నారు. డైరెక్టర్ పదవీకాలాన్ని ఐదేళ్లపాటు కాకుండా రెండేళ్ల కాలపరిమితికి కుదించాలని, ఒకసారి పనిచేసిన వారికి పొడిగింపు ఇవ్వకుండా కొత్త వారిని నియమించాలని కోరుతున్నారు. దీని వల్ల సంస్థలో కార్యకలాపాలు మెరుగుపడడమే కాకుండా అవతవకలు జరిగే అవకాశం ఉండదంటున్నారు.

కాగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ సంస్థల ప్రక్షాళనను చేపట్టింది. ఇందులో భాగంగా ఎన్‌పీడీసీఎల్‌లో సీఎండీగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న గోపాల్‌రావును తొలగించింది. ఆయన స్థానంలో ఐఏఎస్ అధికారి వరుణ్‌రెడ్డిని నియమించింది. తాజాగా ఎన్‌పీడీసీఎల్‌లో పాతుకుపోయిన డైరెక్టర్లపై వేటువేసేందుకు రంగం సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో నియమితులై ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న వీరి స్థానంలో కొత్తవారిని నియమించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు కసరత్తు జరుగుతోంది.



మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీవో అంకిత్

మహాజాతర అభివృద్ధి పనులపై ఆరా

- మేడారంలో వేర్వేరుగా పర్యటించిన కలెక్టర్, పీవో, అదనపు కలెక్టర్
- త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశం

మేడారం, జనవరి 16 : మేడారాన్ని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ మంగళవారం వేర్వేరుగా పర్యటించారు. మహాజాతర జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రమాణాలను పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. యంత్రాలు, నిర్మాణ సామగ్రి, కూలీల లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జంపన్నవాగు నుంచి ఊరట్టం స్తూపం వరకు ప్రతిపాదిత పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సీ1, సీ2 పార్కింగ్ కోసం సుమారు 95 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. గ్రౌండ్ లెవలింగ్‌ను సక్రమంగా చేపట్టి వారంలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, పైప్‌లైన్ల ఏర్పాటు, మహిళలు బట్టలు మార్చుకునే గదుల నిర్మాణం, ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత, వాగులో ఇసుక చదును పనులను కలెక్టర్, పీవో పరిశీలించారు. మేడారం పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు అధిక సంఖ్యలో కార్మికులను వినియోగించాలన్నారు. అనంతరం ఐటీడీఏ అతిథిగృహంలో శాఖల వారీగా అధికారులతో చర్చించారు. ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చొరవ తీసుకోవాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలి
- దళితబంధు లబ్ధిదారుల ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలి
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

హనుమకొండ టౌన్, జనవరి 16: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. హనుమకొండలోని హరితహోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ కోసం మాదిగ దండోరా ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలుగా ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. 1994-95లో నాటి ప్రభుత్వం శాసనసభలో వర్గీకరణకు అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని, రాష్ట్రపతి ఆమోదం మేరకు 2000-2004 వరకు వర్గీకరణ అమలు జరిగిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొంతమంది సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో పార్లమెంటులో ఆమోదం ద్వారానే వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు సూచించిందని ఆయన తెలిపారు. 2021లో పంజాబ్ రాష్ట్రంలో వర్గీకరణ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసిందని, ఏడుగురు జడ్జిలతో కూడిన ధర్మాసనం ఈనెల 17న ఎస్సీ వర్గీకరణపై విచారణ జరపాల్సి ఉండగా వాయిదా పడినట్లు తెలిసిందన్నారు.

సుప్రీంకోర్టులో విచారణకు వచ్చిన దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అఫిడవిట్‌లు దాఖలు చేసి మంచి లాయర్లను పెట్టి వాదనలు వినిపించాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశాలుంటాయని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనుకూలంగా నిర్ణయం తీసుకుని తాను, కేసీఆర్ ప్రధాని మోదీని కలిశామని కడియం గుర్తు చేశారు.

కాగా, రాష్ట్రంలోని దళితులకు ఆర్థిక చేయూతను ఇచ్చి ఆదుకునేందుకు తమ ప్రభుత్వం దళితబంధును ప్రవేశపెట్టిందన్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు లబ్ధిదారుల ఖాతాల్లో రూ.9లక్షల 90వేల చొప్పున జమ అయ్యాయన్నారు. లబ్ధిదారులు వారి అవసరాలకు వాడుకునే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో ఖాతాలపై ఫ్రీజింగ్ పెట్టారన్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఫ్రీజింగ్ ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రెండో విడత ఎంపిక చేసిన 1లక్ష 31వేల మంది లబ్ధిదారులకు దళితబంధు కొనసాగించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసమే మోదీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ప్రకటన చేసిందని ఆయన ఆరోపించారు. వర్గీకరణకు అనుకూలంగా బీజేపీ ఉందని తాము నమ్మడం లేదని కడియం స్పష్టం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో ఆర్థిక విధ్వంసం

- తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కూరపాటి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ

కాళోజీ జంక్షన్ (హనుమకొండ), జనవరి 16: కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని అందుకే ప్రజలు నిరంకుశ పాలనను అంతమొందించారని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కూరపాటి వెంకటనారాయణ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయహోటల్‌లో 'తెలంగాణలో గత దశాబ్దపాలనలో ఆర్థిక స్థితిగతులు, ప్రజల ఆకాంక్షలు ప్రస్తుత ప్రభుత్వం ముందున్న సవాళ్లు' అనే అంశంపై రాష్ట్ర సాధనకు కృషి చేసిన ఉద్యమకారులు, మేధావులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చి, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన పార్టీని ఓడించారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై 40 రోజులకే భారత రాష్ట్ర సమితి నాయకులు అవాకులు చెవాకులు పేలుతూ రచ్చకెక్కి గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వపాలనలో విద్య, వైద్య రంగాలను భ్రష్టు పట్టించిందని, ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కుప్పకూల్చిందన్నారు. వేలకోట్ల రూపాయలు అక్రమ సంపాదనతో వందల ఎకరాల భూముల ఎస్టేట్ సంపాదనతో తులతూగుతున్న నాయకులు ఇప్పుడిప్పుడే మాట్లాడడం సబబు కాదన్నారు. ఈ సమావేశంలో తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన అనేక మంది ఉద్యమకారులు, మేధావులు, రైతు సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు ప్రస్తుత ప్రభుత్వ పనితీరును, ప్రతిపక్ష పార్టీల వైఖరిని సమీక్షించారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా దోపిడీ, అవినీతి, నిరంకుశ పాలనను అమలుచేసిన బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడే ప్రశ్నించే హక్కులేదని పలువురు పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయాలని, అస్థిరపర్చాలని ఎవరు ప్రయత్నించినా ప్రజలు క్షమించరని సమావేశంలో మాట్లాడిన వక్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసం అధికారాన్ని అడ్డంగా పెట్టుకొని పాల్పడిన అవినీతి, దోపిడీపై న్యాయ విచారణ జరిపించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో జిల్లాల నిర్మాణం శాస్త్రీయంగా జరుగలేదని, జిల్లాలు, మండలాలు శాస్త్రీయ పద్ధతిలో ఏర్పాటు చేయడానికి కమీషన్ వేసి పునఃనిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని ఉద్యమకారులు తీర్మానించారు. ఈ సమావేశంలో జనార్దన్, రామ్మూర్తి, పుల్లూరు సుధాకర్, అనిసిద్ధిఖి, కుమారస్వామి, సంగూలాల్, దాసరి కృష్ణారెడ్డి, గుడిమళ్ల రవికుమార్, బాబు రావు, సోమిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంల ధ్వంసం

- నర్సంపేటలో ఐదు చోట్ల చోరీకి విఫలయత్నం
- డబ్బులు రాలేదన్న అక్కసుతో మిషన్లపై రాళ్లతో దాడి
- రూ.4.5 లక్షల ఆస్తి నష్టం.. నిందితుడి అరెస్టు



ధ్వంసమైన ఎస్‌బీఐ ఏటీఎం

నర్సంపేట టౌన్, జనవరి 16: జల్సాలకు అలవాటుపడిన ఓ కొరియర్ బాయ్.. ఏకంగా ఐదు ఏటీఎంలలో చోరీకి విఫలయత్నం చేయగా, డబ్బులు రాలేదన్న అక్కసుతో ఏటీఎం మిషన్లను రాళ్లతో ధ్వంసం చేసిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో సోమవారం రాత్రి జరిగింది. ఘటన జరిగిన నాలుగు గంటల్లోనే సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్ అరెస్టు వివరాలను వెల్లడించారు. నర్సంపేట పట్టణంలోని మాధన్నపేటరోడ్‌కు చెందిన 19ఏళ్ల మేడిద వంశీ కొన్ని రోజులుగా ఓ కంపెనీలో కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. జల్సాలకు, మద్యానికి అలవాటుపడి కొరియర్‌గా పని చేస్తే వచ్చే డబ్బులు, ఇంట్లో తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు సరిపోకపోవడంతో ఏటీఎంలో దొంగతనం చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి మద్యం సేవించి ఏటీఎంలో దొంగతనానికి వెళ్లాడు. ద్వారకపేటరోడ్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం, వరంగల్‌రోడ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం, నెక్కొండ రోడ్‌లోని కెనరా బ్యాంక్ ఏటీఎం, మల్లంపల్లి రోడ్‌లోని ఎస్‌బీఐ, పాకాల్‌రోడ్‌లోని కొటాక్ మహీంద్రా బ్యాంక్ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశాడు. ప్రతీ ఏటీఎంలో డబ్బులు తీయడం సాధ్యం కాకపోవడంతో రాళ్లతో అన్ని మిషన్లను ధ్వంసం చేశాడు. సమాచారం తెలుసుకున్న నర్సంపేట సీఐ సుంకరి రవికుమార్, ఎస్సై రవి, హెడ్‌కానిస్టేబుల్ అక్బర్‌పాష, కానిస్టేబుల్స్ శ్రీధర్, రమేష్‌లు సీసీ పుటేజీల ఆధారంగా సంఘటన జరిగిన నాలుగు గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారని డీసీపీ తెలిపారు. వంశీపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ సంఘటనల్లో సుమారు. రూ. 4.05లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులను డీసీపీ అభినందించారు.



హముతండాలో ట్రాక్టర్‌లో మృతదేహాలు

హముతండాలో విషాదం

నలుగురి దుర్మరణం ఘటనతో గ్రామస్థుల కన్నీరుమున్నీరు



కంబాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్లావత్ శ్రీను కుటుంబం (ఫైల్)

గూడూరు, జనవరి 16: విధి వైపరీత్యం అంటే ఇదేనేమో..! జిల్లాలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడిన విషయం విదితమే. దేవుడిని దర్శించుకుని వస్తూ అనంతలోకాలకు వెళ్లిపోవడంతో హము తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ గిరిజన కుటుంబాన్ని బలితీసుకుంది. ఆటోను కారు ఢీకొని జరిగిన ప్రమాదంలో తల్లి, కుమారుడు, ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు మండలం హముతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను, అతని తల్లి పాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికతో పాటు బావమరిది సంతోష్ (సర్థార్), అత్త శాంతిలతో కలిసి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ దగ్గర బుడియబాపు ఆలయానికి ఆటోలో వెళ్లారు. అక్కడ రిత్విక్ పుట్టువెంట్రుకలు సమర్పించి తిరిగి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి బయలు దేరారు. మహబూబాబాద్‌కు చెందిన కారు గుంజేడు నుంచి మహబూబాబాద్‌కు వైపువస్తూ ఎదురు వస్తున్న ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇస్లావత్ శ్రీనుతోపాటు తల్లిపాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అత్త శాంతి, బావమరిది సర్దార్ తీవ్రంగా గాయపడ్డారు. వారికి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. కాగా, మూడు సంవత్స రాల క్రితం శ్రీను భార్య సంధ్య (శిరీష) కొవిడ్‌తో మృతి చెందింది. సంక్రాంతి పండుగ వేళకుమారుడి పుట్టువెంట్రుకలు ఇచ్చి వస్తూ రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో హముతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, సోమవారం నలుగురి మృతదేహాలకు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాలను మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్ నివాళ్లర్పించారు. జిల్లా జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

అత్తారింటికి వచ్చిన వ్యక్తిపై దాడి

తీవ్ర గాయాలపాలైన యువకుడు



తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సత పొందుతున్న తుమ్మ దీపక్‌రెడ్డి

పెద్దవంగర, జనవరి 16: మండలంలోని కొరిపెల్లిలో ఓవ్యక్తిపై దాడి చేయగా, తీవ్ర గాయాలపాలయ్యాడు. మంగళవారం ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలరానికి చెందిన తుమ్మ దీపక్‌రెడ్డి- మహేశ్వరి దంపతులు కుమార్తె రిషితతో కలిసి సంక్రాతి పండుగ సందర్భంగా సోమవారం కొరిపెల్లిలోని అత్తగారైన నీరటి నాగమ్మ ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేసిన తర్వాత మిత్రులతో కలిసి బయటకు వెళ్లగా, పెద్దచెరువు సమీపంలో దీపక్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన సాకి యాకయ్య, అతని కుమారులు సాయికుమార్, మహేష్, రాములు అనే నలుగురు వ్యక్తులు కత్తులు, కర్రలతో దాడి చేయడంతో ఆయన స్పృహతప్పి పడిపోయాడు. దీంతో దీపక్‌రెడ్డిని బంధువులు, గ్రామస్థులు చిక్సిత నిమి త్తం తొర్రూరులోని ఓ ప్రైవేయిట్ తరలించారు. అనంతరం మెరుగైన చిక్సిత కోసం హన్మకొండకు తరలించారు. అయితే పాత కక్షలతోనే ఈ దాడికి పాల్పడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. కాగా, దీపక్‌రెడ్డి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐలోని మల్లన్న.. సల్లంగ సూడు..

● మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు ● మహానివేదనతో మార్నేనియుల దేవుడి రథం ఊరేగింపు

ఐనవోలు, జనవరి 16: పూసల లాగులు.. గజ్జెల మోత.. డోలు శబ్దాలు.. చేతుల్లో వీరకోలు.. త్రిశూలాలు.. ఖడ్గాలు.. నొదుటిపై బండారి పసుపు.. నెత్తిపై బోనాలు.. అందులో వెలుగుతున్న దీపాల మధ్య గుంపులు గుంపులుగా జానపద గేయాలతో శివసత్తులు నృత్యాలు చేస్తున్న దృశ్యాలు.. ఐలోని మల్లన్న ఆలయంలో భక్తిపారవశ్యాన్ని ప్రతిబింబించాయి. ఇక ఒగ్గు పూజారుల అందమైన పిండి పట్నాలు ఢమురక శబ్దాలతో భక్తులకు స్వామి వారి కృప కలగాలని స్తుతించారు. సకం భాగ్యాలు కలిగి సంతోషాన్ని కలిగించి.. ముట్టింది ముచ్చమై.. పట్టింది బంగారమై.. పాలి వాడు దగ్గరై.. పగవాడు దూరం కావాలంటూ.. పర్వతాల మల్లయ్య మా పాలిట కలిగి ఉంటూ.. సల్లంగా సూడు మళ్లీ వస్తాం..' అంటూ స్వామి వారిని వేడుకున్నారు.

పోటెత్తిన భక్తజనం

ఐనవోలు మల్లికార్జునస్వామి మహాజాతరలో భక్తులు పోటెత్తారు. సంస్కృతి, సంప్రదాయాలు, జానపదులకు ప్రతీక అయిన బండారితో మల్లన్న క్షేత్రం పసుపుమయమైంది. సోమవారం సంక్రాంతి పర్వదినం రోజున రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి మొదలైన భక్తుల రాక.. అర్ధరాత్రి వరకు రద్దీగా కొనసాగింది. ఐలోని మల్లన్న.. అంటూ స్వామివారిని కీర్తిస్తూ పరవశించిపోయారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, బిల్వార్చన మహానివేదన నీరాజన పుణ్యాహవాచనము పూజలు జరిపారు. మల్లికార్జునస్వామికి వెండి కిరీటం, కవచం సుగంధాలు వెదజల్లే పుష్పమాలతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి తెల్లవారువరకు అభిషేకాలు దర్శనాలు జరిగాయి.

మహానివేదనతో దేవుడి రథం

మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న మహానివేదన దేవుడి రథంను డీసీసీబీ చైర్మన్ దంపతులు మార్నేని మధుమతి - రవీందర్‌రావు స్వగృహంలో సుందరంగా తీర్చిదిద్దారు. మార్నేని వంశీయులు ఆధ్వర్యంలో మహానివేదనతో బయలుదేరిన రథం గ్రామ పురవీదుల గుండా ఆలయానికి చేరుకొని మూడుసార్లు ప్రదక్షణ చేసింది. మంగళహారతులతో రథానికి మహిళలు స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రభ బండ్లు రథాన్ని అనుసరించాయి. దేవుడి రథం ప్రదర్శన సాయంత్రం 7నుంచి తెల్లవారువరకు కొనసాగింది. రథంతో వచ్చిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు దంపతులను ఈవో నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీసభ్యులు సంప్రదాయపద్ధతిలో సన్మానించారు.



ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు



మహానివేదనతో ఆలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్న మార్నేనియుల పెద్దరథం

7లక్షల మంది భక్తుల దర్శనం

ధ్వజారోహణం రోజు నుంచి సోమవారం వరకు సుమారు 7లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారుల అంచనా వేశారు. 17న సంప్రోక్షణ క్రతువు తర్వాత ఉగాది వరకు జరిగే వారాంతపు జాతరలు ప్రతీ ఆది, బుధవారాల్లో లక్షల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి దర్శనం చేసుకుంటారు.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కుటుంబ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ మేయర్ దంపతులు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు నేతృత్వంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలు బహూకరించి తీర్థ ప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు.

అధికారుల సేవలు

జాతరలో పోలీసుసేవలు భేష్‌గా నిలిచాయి. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు నేతృత్వంలో పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసు కమాడ్ కంట్రోల్ రూమ్, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ద్వారా సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా నీడన జాతర బందోబస్తును డీసీపీ, ఏసీపీలు పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు చెందిన సీఐలు, ఎస్సైలు సుమారు 500మంది విధులు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లాలు జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వసతులు కల్పించారు. జీడబ్ల్యూఎంసీ పారిశుద్ధ్య సిబ్బందితోపాటు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్(గ్రామ పంచాయతీ) సిబ్బంది నాలుగు రోజులపాటు నిర్విరామంగా విధులు నిర్వహించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈ సునీత ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ ఏర్పాటు చేసిన ట్యాంకర్లు, నల్లాలు ద్వారా మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేశారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్‌లైన్ శాఖల ఆధ్వర్యంలో 1098 ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీస్‌ల ఆధ్వర్యంలో తప్పిపోయిన పిల్లలు, వృద్ధుల కోసం సహాయ శిబిరాన్ని నిర్వహించారు. వరంగల్ - ఐనవోలు - కొమురవెల్లి- ఆర్టీసీ బస్సులు ద్వారా భక్తులను చేరవేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు వైద్యసేవలు అందించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు జాతరలో ప్రత్యేక నిఘా పెట్టారు. రెండు రోజులు ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచారు.



గజ్జెల లాగు పూసల అంగీలో మల్లన్న భక్తుడు



ఐనవోలు మల్లికార్జున ఆలయం ఆవరణలో బోనంతో నృత్యం చేస్తున్న శివసత్తి



స్వామిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీ దయాకర్, కుటుంబసభ్యులు



స్వామి వారి సన్నిధిలో మాజీ మేయర్ దంపతులు స్వర్ణవరదరాజేశ్వర్‌రావు

23 నుంచి కేయూ ఇంజనీరింగ్ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 16: ఈ నెల 23 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 23, 25, 27, 29, 31,ఫిబ్రవరి 2, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, డెటాసైన్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని ఇంజరింగ్ కళాశాల, కేయూ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పరీక్షల నియంత్రణాధికారులు సూచించారు.

19న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, జనవరి 16: ఈ నెల 19వ తేదీన హనుమకొండ ములుగు రోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సెస్ బ్యాంకులో సుమారు 80 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 28 యేళ్ల మధ్య వయస్సు గల ఇంటర్, ఏదైనా డిగ్రీ చేసిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9848895937, 9700922136లో సంప్రదించాలని తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

ఎల్కతుర్తి, జనవరి 16: తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడి అక్కడిక్కడే గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దండేపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గునిగంటి తిరుపతి (42) వృత్తిలో భాగంగా తాటి కల్లు గీయడానికి వెళ్లాడు. గ్రామ శివారులోని పెద్ద చెరువు కట్ట కింద ఉన్న చెట్టు ఎక్కి కల్లుగీస్తున్న క్రమంలో మోకు జారీ పైనుంచి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుజురాబాద్ సివిల్ అస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సరిత, కుమార్తె రక్షిత, కుమారుడు సాత్విక్‌లు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు తిరుపతి కుంటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.



గునిగంటి తిరుపతి (ఫైల్)

పురుగుల మందుతాగిన వ్యక్తి మృతి

నర్సింహులపేట, జనవరి 16 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన వంతడుపలలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్‌రెడ్డి (48) గ్రామ రెవెన్యూ పరిధిలో రెండేళ్ల కిందట కోళ్లఫామ్ ఏర్పాటు చేసుకుని నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో కోళ్లఫామ్‌లో ఆశించిన మేరకు లాభాలు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయాడు. తెచ్చిన అప్పులు రెట్టింపుకావడం, భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేవి. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 3న క్రిమిసంహారక మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి తొర్రూరు ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి పెద్దకుమారుడు కార్తీక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

19 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు, జనవరి 16: మండలంలోని బోటిమీదితండా శివారు కొండెంగెలగుట్ట తండాలో ఓ ఇంట్లో నిల్వ చేసిన 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 క్వింటాళ్ల పటికను మంగళవారం పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. కొండెగల గుట్ట తండాకు చెందిన బానోత్ చిన్నమాలు తన ఇంట్లో 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 కింటాళ్ల పటిక నిల్వచేసి తండావాసులకు విక్రయిస్తున్న క్రమంలో పట్టుకొని సీజ్ చేసి బానోత్ చిన్న మాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ పేర్కొన్నాడు.



మేడారంలో వనదేవతలను దర్శించుకున్న భక్తులు

వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారంలో భారీగా భక్తజనం

మేడారం, జనవరి 16 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం కిక్కిరిసిపోయింది. మకర సంక్రాంతి, కనుము పండుగల నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర జరగనున్న నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరకొని వనదేవతలకు పూలు, పండ్లు, చీరె సారె, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం (బంగారం) సమర్పించారు. యాట మొక్కులను చెల్లించుకున్నారు. ఈ రెండు రోజుల్లో సుమారు 2 లక్షలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

అధిష్ఠానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా..

మాజీ మంత్రి ఈటల రాజేందర్

భీమదేవరపల్లి, జనవరి 16: బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తానని మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కొత్తకొండలో విలేకరులతో మాట్లాడుతూ.. తాను కరీంనగర్ మట్టి బిడ్డనని, కరీంగనర్‌లో పలుమార్లు మంత్రిగా పనిచేశానన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అప్పుడు పని చేశానన్నారు. కరీంనగర్ ప్రజలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. కానీ కరీంనగర్‌లో తమ సిట్టింగ్ ఎంపీ ఉన్నారన్నారు. దీంతో పార్టీ ఆదేశిస్తే ఎంపీగా ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం తాము వ్యతిరేకం కాదని, కానీ దీంతో పేదలైన ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా ప్రభుత్వం చేయూతనివ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వృక్ష ప్రసాద దాత జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పృథ్వీరాజ్‌గౌడ్, మాచర్ల కుమార్, అంబీరు కవిత, గోదాల సంపత్, గుండెల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తా...

మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

భీమదేవరపల్లి, జనవరి 16: పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తానని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. కొత్తకొండ జాతరలో సోమవారం వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రంలోని తమ పార్టీ న్యాయకత్వాన్ని ఎదురించి తెలంగాణను సాధించామన్నారు. తాను వరంగల్ ఎంపీగా పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో చిచ్చు పెట్టి పబ్బం గడుపుతోందన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం పేరుతో ప్రజాస్వామ్యాన్ని మోదీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనుకయ్య, నాయకులు ఆదరి రవిందర్, కొల్గూరి రాజు, రవీందర్, డబ్బా శంకర్, మడిపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ రుత్విక్‌సాయికి తెలంగాణ కేడర్



హనుమకొండ రూరల్, జనవరి 16: గత ఏడాది సివిల్స్ ఫలితాల్లో 558వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన కొట్టి రుత్విక్ సాయికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కేడర్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ రాంనగర్‌కు చెందిన రుత్విక్‌సాయి ఐపీఎస్‌కు ఎంపికై ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన 460వ ర్యాంకర్ పత్తిపాక సాయికిరణ్‌కు కూడా తెలంగాణ కేడర్ దక్కింది.

జై వీరభద్రా..

● భక్త జన జాతరగా మారిన కొత్తకొండ
● మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్
● ఆకర్షణగా నిలిచిన ఎడ్లబండ్ల రథాలు.. మేకల బండ్లు

భీమదేవరపల్లి, జనవరి 16: కొత్తకొండ.. భక్త జన జాతరగా మారింది.. ఎటు చూసినా క్యూలైన్లతో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో కొత్త కొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుడి నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపోయింది. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగతో లక్షలాది మంది భక్తులు హాజరైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కుమార్, వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝూ, డీసీపీ బారీ, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీ వంగ రవి, సర్పంచ్ దూడల ప్రమీల - సంపత్, ఎంపీటీసీ యాటపోలు రాజమణి-శ్రీనివాస్‌లతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్‌రావులు ఆలయానికి వచ్చిన అతిథులు, భక్తులకు స్వాగతం పలికారు.

ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన 50మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో విశిష్టమైన సేవలందించారు. హనుమకొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగామ, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. హుజూరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్ధిపేట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపడం, ప్రైవేట్ వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈ నెల 15న సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన భక్తులతో జాతర మొత్తం కిటకిటలాడింది. భక్తుల రద్దీతో కొత్తకొండ వీధులన్నీ భక్త జనంతో నిండిపోయాయి. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారిని దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝూ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ బారీ, ఏసీపీ డేవిడ్ రాజు, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుమారు 400మంది పోలీసులు జాతరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరను విజయవంతంగా పూర్తి చేసిన పోలీసు అధికారులు తిరిగి తమ విధుల్లోకి చేరేందుకు వెళ్లారు.

ప్రత్యేక పూజలు

సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. స్వామివారికి కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి ఆలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా పూజలు నిర్వహిస్తే సమస్త పీడల నుంచి విముక్తి కలిగి భోగభాగ్యాలు ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు. మంగళవారం నాడు నాగవెల్లి, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నల్లపూసలను అలంకరింపజేశారు. అనంతరం పుష్పోత్సవం నిర్వహించారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

మొక్కులు చెల్లించిన లక్షలాది మంది భక్తులు

కొత్తకొండ దేవాలయంలో మకర సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని సోమ, మంగళవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. మకర సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో భక్తులతో ఆలయం మొత్తం కిటకిటలాడగా క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో రాత్రి వేళల్లోనే జాతర ఎక్కువ సాగేది. అలాంటిది ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల రథాలు

కొత్తకొండ జాతరకే కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తపల్లి గ్రామం నుంచి 65ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు. మూడురోజులుగా రైతులు కష్టపడి తమ ఎడ్లబండ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది జాతరకు తీసుకొచ్చారు. 65 ఎండ్లబండ్ల రథాలను సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఇంటికి వెళ్లిపోయాయి. అందమైన ఎడ్లబండ్లను చూసేందుకు జాతరకు వచ్చిన భక్తులు ఆసక్తిగా చూశారు. వీటితో పాటు వేలాది ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశాయి. వేలేరు గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు పలువుర్ని ఆకట్టుకున్నాయి. కొన్నేళ్లుగా మేకలబండ్లు వేలేరు నుంచి రావడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం అర్ధరాత్రి మేకల బండ్లు రావడంతో ఆలయ అధికారులు వాటిని ఆలయం ముందుకు తీసుకవచ్చారు. ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామాల సునీతలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వీరభద్రస్వామి



భద్రకాళి అమ్మవారు

పారిశుధ్యం భేష్

కొత్తకొండ జాతరలో పారిశుధ్య సేవలు భేష్‌గా ఉన్నాయి. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఆధ్వర్యంలో జాతరలో అధికారుల సేవలను పరిశీలించారు. డీపీవో జగదీశ్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవోలు నాగరాజు, రవి పర్యవేక్షణలో పారిశుధ్య సేవలు రాత్రి పగళ్లు అందించారు. సుమారు 40మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు, 150మంది కార్మికుల సిబ్బందితో అలయం చుట్టూ, పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుధ్య కార్మికులు 24గంటలు చెత్తను తొలగించారు. ప్రతీ దుకాణం ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. జాతరలో చెత్తాచెదారం, చెడిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు.



వేలేరు నుంచి వచ్చిన మేకల రథం



శ్రీవీరభద్రస్వామిని దర్శించుకుంటున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా



గండదీపంలో నూనె పోస్తున్న యువతులు

మంత్రి సురేఖను కలిసిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కమిటీ

సుబేదారి, జనవరి 16: హనుమకొండ న్యూశాయంపేట లోని దోనగుట్ట సంతోష లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన కమిటీ నాయకులు మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ గ్రంధి సత్యవతి మంత్రికి స్వామి వారి కల్యాణ వస్త్రాలు, అక్షింతలు, కంకణాలు అందజేశారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా సత్యవతి మంత్రి సురేఖను కోరారు. స్పందించిన మంత్రి తప్పకుండా త్వరలో దేవాలయాన్ని సందర్శించి ఎలాంటి అభివృద్ధి చేయాలో పరిశీలించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో దేవాలయ ధర్మకర్తలు వేల్పుల మోహన్‌రావు, దేవాలయ కమిటీ సభ్యులు భారతాల వెంకన్న, కాసం మల్లిఖార్జున్, వెనుకంటి కుమార్, ఆలయ అర్చకులు శ్రీమాన్ జీడికంటి కృష్ణప్రసాద్‌లు ఉన్నారు.

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణాలు

■ కీర్తినగర్ ఘటనతో మరోమారు సుస్పష్టం
■ గత తప్పిదాలతో కళ్లు తెరవని వైనం
■ శాపంగా పరిణమించిన మిషన్ భగీరథ అరకొర పనులు
■ జీడబ్ల్యూఎంసీ, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్‌ల మధ్య సమన్వయ లోపం

తీరు మారని బల్దియా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 16: ప్రజలకు మెరుగైన జీవన పరిస్థితులను కల్పించాల్సిన వరంగల్ మహానగర పాలక సంస్థ.. అందుకు భిన్నంగా ప్రాణాలనే బలిగొంటోంది. ఇందుకు నిదర్శనం మూడు రోజుల కిందట కీర్తినగర్ బొడ్రాయి వద్ద జరిగిన మ్యాన్ హోల్ ప్రమాదం. అసంపూర్తిగా నిర్మించిన మిషన్ భగీరథ మ్యాన్‌హోల్ ఆటో డ్రైవర్ మల్లేశం ప్రాణాన్ని బలి తీసుకుంది. జీడబ్ల్యూఎంసీతో పాటు పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖల నిర్వాకం వల్లే నిండు ప్రాణం బలైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి ఘటనలు నగరంలో గతంలోనూ జరిగాయి. అయినా బల్దియా నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. ప్రమాదకర మ్యాన్‌హోల్స్, గుంతల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది.

మ్యాన్‌హోల్ ప్రమాదమే సాక్షీభూతంగా..

కీర్తినగర్ నుంచి ఎన్‌టీఆర్‌నగర్‌కు ఆటో నడుపుతున్న మల్లేశం మ్యాన్‌హోల్ ప్రమాదానికి లోనయ్యారు. ఆటో అదుపు తప్పడంతో ఆటో అద్దాలు పగలడం, ఆటో డ్రైవర్ మల్లేశం మెడ చిక్కుకోవడంతో నరాలు తెగి రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు బల్దియా, ఇంజనీరింగ్ శాఖలు సంపూర్ణంగా బాధ్యత వహించాల్సి ఉంది. కనీసం ఇక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. నిత్యం వాహనాల రాకపోకలు జరిగే ఈ రోడ్డులో మ్యాన్‌హోల్ ప్రమాదంపై పలుమార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అయినా అధికారులు నిర్లక్ష్య ధోరణినే ప్రదర్శించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గుంతలో పడిన ఆటో



మృతిచెందిన డ్రైవర్ మల్లేశం

కళ్లు తెరవని వైనం

బల్దియా నిర్లక్ష్యానికి ప్రాణాలు బలవ్వడం ఆటో డ్రైవర్ మల్లేశం ఘటన కొత్తేమీకాదు. గతంలో హనుమకొండ ఫారెస్టు కార్యాలయం నుంచి రెవెన్యూ కాలనీ వెళ్లే రోడ్డులో పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో పడి బాలుడు మరణించారు. ఇతర రాష్టానికి చెందిన కుటుంబం కూలిపని కోసం హనుమకొండకు వచ్చి జీవనం సాగిస్తోంది. నీటిత నిండిన గుంటను చూడకుండా బాలుడు అందులో పడి ఊపిరాడకుండా మరణించాడు. ఈఘటన నగరవాసులను తీవ్ర ఆగ్రహానికి గురి చేసింది. బాలుడి మృతదేహంతో ఆందోళనలు కూడా జరిగాయి. వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి దేశాయిపేట వెళ్లే రోడ్డులోనూ పైప్‌లైన్ పనుల నిమిత్తం తవ్విన గుంతను బల్దియా అధికారులు పూడ్చలేదు. ఓ సైక్లిస్టు గుంతలో పడి తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. ఇక్కడే మరో స్కూటరిస్టు ప్రమాదానికి గురవ్వడంతో ఆయన కాలు విరిగింది. ఇలాంటి ఘటనలు ఎన్నో నగరంలో చోటు చేసుకున్నాయి. తాజాగా ఆటో డ్రైవర్ ప్రాణం బలి అయ్యింది. బల్దియా అధికారులకు చీమ కుట్టినట్లుగా లేదు.

శాపంగా మిషన్ భగీరథ పనులు

మిషన్ భగీరథ పనులు నగరవాసులకు వరమో.. శాపమో.. తెలియనిదిగా మారింది. మూడేళ్లకుపైగా నగరంలో మిషన్ భగీరథ పనులు కొనసా...గుతూనే ఉన్నాయి. నగరంలోని 66 డివిజన్లలో పనులు ఇంకా అసంపూర్తమే. మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు, కనెక్షన్ల కోసం తవ్విన గుంతలను పూడ్చి వేయడం లేదు. పూడ్చివేసినా అసంపూర్ణంగానే ఉంటున్నాయి. దీనిపై అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. అసలు పర్యవేక్షణే చేయడం లేదు. ఈఈల నుంచి ఏఈల వరకు పర్యవేక్షణే చేయడం లేదు. దీంతో పైప్‌లైన్, కనెక్షన్ల కోసం తవ్విన గుంతలు అసంపూర్ణంగా ఉండడం, ప్రజల ప్రాణాలకు సంకటంగా పరిణమించాయి.

సమన్వయ లోపం

మిషన్ భగీరథ పైప్‌లైన్ తవ్వకాల పూడ్చివేత, మ్యాన్‌హోల్స్ మూసివేతలో వరంగల్ మహానగర పాలక సంస్థ, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పూడ్చివేత పనులతో తమకు సంబంధం లేదంటూ ఒకరిపై ఒకరు నిందించుకోవడం పరిపాటిగా మారింది. మిషన్ భగీరథ గుంతల వల్ల ప్రజలు ఇళ్లలోని వెళ్లని పరిస్థితులు ఏర్పడ్డాయి. దారి లేకుండా గుంతలు తవ్వి వదిలేశారు. దీనిపై గతంలో నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ ఈ అంశంపై హనుమకొండ బాలసముద్రంలోని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ కార్యాలయంలో సమీక్షనే నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన గుంతలు మూసివేయాలని ఆదేశించారు. అయినా రెండు శాఖల అధికారుల తీరులో మార్పు రాలేదు.

బోర్డులు కరువా..

భగీరథ పైప్‌లైన్ పనుల క్రమంలో తవ్విన గుంతలు పూడ్చి వేయకపోవడం ఒక తప్పిదమైతే కనీసం హెచ్చరిక బోర్డులు కూడా బల్దియా, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖలు ఏర్పాటు చేయడంలేదు. రెండింటికి బోర్డులే కరువయ్యాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చేలా రెండు శాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం మిషన్ భగీరథ పైప్‌లైన్ మ్యాన్‌హోల్స్ మాత్రమే కాదు నగరంలో ఇతర ప్రాంతాల్లో కూడా మ్యాన్ హోల్స్ రోడ్లపై ఉన్న గుంతల విషయంలో జీడబ్ల్యూ ఎంసీ, ఆర్‌అండ్‌బీ శాఖలు చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేతులు కాలాక విచారణ

చేతులు కాలాక అనేచందంగా వరంగల్ మహానగర పాలక సంస్థ ఆటో డ్రైవర్ మల్లేశం మృతి ఉదంతంపై విచారణ చేపట్టనున్నట్లు ప్రకటించింది. మ్యాన్‌హోల్ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు జీడబ్ల్యూఎంసీ ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు సమగ్ర విచారణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పైప్‌లైన్లు, రిజర్వాయర్‌ల నిర్మాణం చేపట్టడంతోపాటు వాల్వ్ చాంబర్‌ల మీద మూతలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రోడ్లపై పైప్‌లైన్లు వేయడం, నిర్మాణ పనులు చేపట్టే క్రమంలో ప్రమాదాలకు తావు లేకుండా హెచ్చరక బోర్డులు ఏర్పాటు చేయాలని జీడబ్ల్యూఎంసీలోని ప్రజారోగ్య విభాగానికి సూచించినట్లు ఎస్‌ఈ తెలిపారు. మొత్తంగా ఒక ప్రాణం బలి అయ్యాక జీడబ్ల్యూఎంసీకి తన బాధ్యతలు గుర్తొచ్చాయి. నిండు ప్రాణం పోయిన తరువాత విచారణ జరిపిస్తామంటూ తాపీగా ప్రకటించింది.

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, జనవరి 16: చాత్తాద శ్రీవైష్ణవ సంఘం హనుమకొండ జిల్లా శాఖ రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరునగరి రవికుమార్, గౌరవ అధ్యక్షుడు తిరునహరి సత్యనారాయణ స్వామి, కోశాధికారి తిరునగరి పద్మాకర్, రాష్ట్ర మండలి సభ్యులు పెరంబుదూరు నర్సింహస్వామి, తాడూరు వెంకటేశ్వరస్వామి, జిల్లా నాయకులు అప్పనాథ స్వామి, శ్రీనివాసపతి, దరిపల్లి రవికుమార్, తిరునహరి శోభ, మధురకవి ఇందిర, శ్రీరాం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

సుబేదారి, జనవరి 16: న్యూశాయంపేట రాజరాజేశ్వరీ ఆటో యూనియన్‌కు చెందిన ఆటో డ్రైవర్ మస్కుల శ్రీధర్ ఇటీవల చనిపోగా శ్రీధర్ కుటుంబానికి ఆటో యూనియన్ తరపున మంగళవారం రూ.30వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వి.సాంబమూర్తి, ఉపాధ్యక్షులు బి. సునిల్, క్యాషియర్ ఆర్. సురేష్‌తో పాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలి..

▸▸ మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

వడ్డెపల్లి, జనవరి 16: ఏఐసీసీ నేషనల్ జాయింట్ కో ఆర్డినేటర్ ఉల్లెంగల యాదగిరికి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ లేదా ఖమ్మం ఎంపీ టికెట్‌ను కేటాయించి రాజకీయ ప్రాతినిథ్యం కల్పించాలని మేదరి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రతాపగిరి శ్రీనివాస్ కాంగ్రెస్ జాతీయ అధిష్టానవర్గాన్ని కోరారు. హనుమకొండ సాయినగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 35ఏళ్ల నుంచి యాదగిరి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నాడని కనీసం రాజ్యసభ సీటయినా కేటాయించి సముచిత స్థానం కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు దొడ్డిపాటి శేఖర్, ఏషబోయిన సాంబయ్య, కమటం ప్రభాకర్ రావు, పల్లపు యాదగిరి, ఏకు సుధాకర్, అంకం కోమల, లింగారెడ్డి, మామిండ్ల నారాయణ, పుల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప్ సప్తాహను విజయవంతం చేయాలి

కాళోజీ జంక్షన్, జనవరి 16: భారతీయ జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంకల్ప్ సప్తాహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లియాఫీ వరంగల్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ అధ్యక్షుడు పబ్బా రాజశ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. ఎల్ఐసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈకార్యక్రమం ద్వారా ఎల్ఐసీలోని నూతన పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన ఏజెంట్లకు సూచించారు. తద్వారా ప్రజలకు అనువైన పాలసీలను చేయించాలని తెలిపారు. ఈ నెల 16 నుంచి 22 వరకు సంకల్ప్ సప్తాహను నిర్వహిస్తున్నట్లు ఇందులో ప్రతీ ఎల్ఐసీ ఏజెంట్ తనవంతు కృషి చేయాలని ఆయన ప్రకటనలో కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

మడికొండ, జనవరి 16: గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ కడిపికొండకు చెందిన బీఆర్ఎస్ నాయకులు దేవరుప్పల కోటి మాతృమూర్తి లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం బాధితుల ఇంటికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, రైతు బంధు కో ఆర్డినేటర్ సంపత్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు రజని, నాయకులు రాజేందర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



అరూరి హన్మంతరావు

మడికొండ, జనవరి 16: గుర్తు తెలియని మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మడికొండలో జరిగింది. స్థానిక ఏఎస్సై దివాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ ఎస్సీ కాలనీకి చెందిన అరూరి హన్మంతరావు(45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విసిగిపోయిన హన్మంతరావు ఈనెల 2న సాయంత్రం గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హన్మంతరావు మంగళవారం మృతిచెందారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య అరూరి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రైల్వే డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్.ప్రశాంత్ కృష్ణ సాయి

కాజీపేట, జనవరి 16: దక్షిణ మధ్య రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కాజీపేట ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే స్టేడియంలో రైల్వే ఉద్యోగులకు క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఫ్రెండ్స్ లెవన్, యూత్ వారియర్స్ టీంల మధ్య క్రికెట్ పోటీలను మంగళవారం ఉదయం రైల్వే ఇనిస్టిట్యూట్ చైర్మన్, సీనియర్ డీఈఈ ఆర్. ప్రశాంత్ కృష్ణ సాయి, సీనియర్ డీఎంఈ ఎ.స్వరాజ్‌కుమార్‌లు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో యూత్ వారియర్స్ టీమ్‌పై లెవన్ టీమ్ 34 పరుగులతో విజయం సాధించింది. అనంతరం మధ్యాహ్నం జరిగిన ఆలేరు, డోర్నకల్ టీంల మధ్య జరిగిన పోటీలలో ఏడీఈఎన్ రామకృష్ణ రాజు టాస్ వేసి ప్రారంభించగా డోర్నకల్ టీంపై ఆలేరు టీం నాలుగు పరుగులతో విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవుల పల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావు, సభ్యులు ధరావత్ రఘు, పి.ప్రశాంత్, ఎస్.ప్రవీణ్, సుంచు ప్రశాంత్ కుమార్, పి. రవి కుమార్, ఆర్గనైజర్‌లు సునీల్, ఎస్. మహేశ్ కుమార్‌లు పాల్గొన్నారు.

అమ్మవారిపేట జాతరకు నిధులు మంజూరి చేయాలి..



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న జాతర ప్రతినిధులు

వడ్డెపల్లి, జనవరి 16: కాజీపేట మండలం కొత్తపల్లి హవేలి శివారు దామెర గుట్టల వద్ద రెండేళ్లకోసారి జరిగే అమ్మవారిపేట సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని జాతర అభివృద్ధి కమిటీ చైర్మన్ కోదూరి భిక్షపతి, ఆర్గనైజర్ దాసి రాందేవ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతర ప్రాంగణంలోని సమ్మక్క-సారలమ్మల గద్దెలకు శాశ్వత నిర్మాణాలు, బారికేడ్లు, తాగునీరు, విద్యుత్, శానిటేషన్, స్నానఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. జాతర ప్రవేశ ద్వారం వద్ద ముఖద్వారం (ఆర్చీ) నిర్మాణం ఏర్పాటుతో పాటు ఉర్సు నుంచి అమ్మవారలను తీసుకొచ్చే జక్కలొద్ది రోడ్డుకు మరమతు చేపట్టాలని, గట్టమ్మ దేవాలయం వద్ద శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని, పోలీసు బందోబస్తు, వైద్య సదుపాయాలను కల్పించాలని వినతి పత్రంలో కోరారు. మంత్రి కొండా సురేఖకు వినతి సమర్పించిన వారిలో జాతర కోశాధికారి బైరి నాగరాజు, ఉప కోశాధికారి బైరి హరినాథ్, జాతర ప్రతినిధులు కేడల పద్మ, మంతెన సునీత, ఆవునూరి రాంమూర్తి, ఆవునూరి కుమారస్వామి, బజ్జూరి వీరేశం, దాసరి సుధాకర్, ఆవునూరి రామన్న, ఆనందం, అశోక్, పోశాల స్వామి, నాగరాజు, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో నియంత పాలన కొనసాగింది..

వీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర

ధర్మసాగర్, జనవరి 16: బీఆర్ఎస్ పార్టీ పదేళ్లకాలంలో రాష్ట్రంలో నియంతపాలన కొనసాగించిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర అన్నారు. ధర్మసాగర్ మండలం కేశవనగర్ శివారు బంజారుపల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని కలగంటున్నడో.. లేక కేసీఆర్ ఇచ్చే పదవుల కోసం ఆశ పడతున్నడో అర్థం కావడం లేదన్నారు. కడియం శ్రీహరి పదవుల కోసం, కాంట్రాక్ట్ పనుల కోసం ఆశపడి బయటి వాళ్ల మీద రుద్దడం, రెచ్చగొట్టి మాట్లాడటం సరి కాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎన్నుకున్నారన్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినా ఇంక కడియం శ్రీహరి అధికారంలో ఉన్నట్టుగా భ్రమలో ఉన్నారని ఆమె ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకులు బండి సంజయ్ సైతం కాంగ్రెస్ పార్టీ కూలిపోతుందని, కేసీఆర్‌తో ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని అనడం ఆయన స్థాయికి తగ్గ మాట కాదని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటేనని విమర్శించారు. వెన్నుపోటు అనేది కడియం శ్రీహరికి అలవాటన్నారు. ఎన్టీఆర్ పిలిచి ఎమ్మెల్యే సీటు ఇస్తే ఆయన ప్రభుత్వాన్ని కూల్చివేశారని ఆమె విమర్శించారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సంపత్, మాజీ ఎంపీటీసీ రాజు, తిరుమల్‌రెడ్డి, లెనిన్, ఆరోగ్యం, గొట్టం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోపాల్‌పూర్ చెరువుకు శాశ్వత హద్దులు ఏర్పాటు చేయాలి

వడ్డెపల్లి, జనవరి 16: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్‌పూర్ ఊర చెరువుకు శాశ్వత హద్దులు ఏర్పాటు చేయాలని కాకతీయ జల వనరుల సంరక్షణ వేదిక (కేజేఎస్‌వీ) కన్వీనర్ తుపాకుల దశరథం తదితరులు జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషాతోపాటు నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను మంగళవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా తుపాకుల దశరథం మాట్లాడుతూ.. గోపాల్‌పూర్ ఊర చెరువుకు ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) బఫర్ జోన్‌లకు శాశ్వత హద్దులు ఏర్పాటు చేయించాలని, వర్షాలకు చెరువులో చేరిన ఇసుక మేటలతో పాటు గుర్రపు డెక్క తీగను తొలగించాలని అన్నారు. చెరువును ట్యాంక్ బండ్‌గా రూపొందించి సుందరీకరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతోపాటు కట్టకు ఇరువైపులా ఆహ్లాదకరాన్ని పంచే చెట్లను, మొక్కలను ఏర్పాటు చేయాలని, గుడిసెలు ఏర్పాటు చేయకుండా, శిఖం ప్రాంతం కబ్జాకు గురికాకుండా నిఘా పెంచాలని వినతి పత్రంలో కోరారు.

రాంపూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాంపూర్‌లో కలుసుకొని గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మడికొండ, జనవరి 16: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం రాంపూర్‌లో కలుసుకున్నారు. చిన్ననాటి సంగతులు, చేసిన అల్లరి చేష్టలు అన్నీ గుర్తుకు చేసుకొని సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.నరేష్, సహోదర్, కిషోర్, అనిల్, శ్రీనివాస్, అశోక్, శ్రీను, ప్రధానోపాధ్యాయులు సర్వోత్తంరెడ్డి, పుష్పాదేవి, రాజిరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలి..



సమావేశంలో మాట్లాతున్న పీఆర్. మోహన్

వడ్డెపల్లి, జనవరి 16: పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్. మోహన్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఆర్‌సీ కమిటీ నివేదికను వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లకు జారీ చేసిన హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకినపల్లి సత్యనారాయణ, రాష్ట్ర, జిల్లా నాయకులు ఎండి ఖాజా మొహినొద్దీన్, నారాయణరావు, లక్మారెడ్డి, నర్సింహారెడ్డి, విద్యాసాగర్, రాజయ్య, జగదీశ్‌చంద్ర, సుబాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వావలంబన సాధించాలి

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



ముగ్గుల పోటీ విజేతలను అభినందిస్తున్న రావు పద్మ తదితరులు

హనుమకొండ రూరల్, జనవరి 16: మహిళలు మరింత స్వావలంబన సాధించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా మంగవారం శ్రీ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావు పద్మ విచ్చేసి మాట్లాడారు. శ్రీ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ యేటా సామాజిక, సంప్రదాయ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చొల్లేటి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. సామాజిక, రాజకీయ, బాధ్యతలతోపాటు జాతీయవాదంతో కూడిన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కె.అనితారెడ్డి, ఓరుగల్లు వైభవ కళామండలి కన్వీనర్ సౌమిత్రి లక్ష్మణాచారి, పగడాల సరళ, సిరికొండ సుజాత, కవిత, వాసం కరుణ, శైలజ, కల్పన, జ్యోతి, సుజాత, సరోజన, వనమాల, పుష్ప, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కలో ఘనంగా గోపూజ



పూజలు చేస్తున్న పూజారులు

కాజీపేట, జనవరి 16 : కాజీపేట విష్ణుపురి శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో మంగళవారం కనుమ పండుగను పురస్కరించుకుని గోశాలలో గోమాత పూజలు నిర్వహించారు. దేవాలయ చైర్మన్ ఐనవోలు వెంకటేశ్వరశర్మ గణపతి పూజ చేసి భక్తులతో గోమాత పూజ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటలు పండించడం వల్లే దేశం బాగుంటుందని రైతులను రాజుగా చూడాలని అన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

- హనుమకొండ కల్చరల్: హనుమకొండ బాలసముద్రంలోని కూరగాయల మార్కెట్‌లో గల శ్రీలక్ష్మిగణపతి దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం గోపూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, మార్కెట్ డైరెక్టర్ మిద్దెల బాబు, మార్కెట్ కమిటీ సభ్యులు చింతల రఘుపతి, ములుగు కృష్ణ, గట్టు రాజమౌళి, సదానందం, కుమార్, రాధా, సీతమ్మతో పాటు టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ రఘువీర్, పురోహితులు వంగల సోమ యాజులు, ఎస్వీబీసీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, రామిరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



శ్రీలక్ష్మి గణపతి దేవాలయంలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం



స్వశక్తి

'జబ్బులకు పరిష్కారం మందులు కాదు. మందులు ఇవ్వడమే వైద్యమూ కాదు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఊరు, మట్టి, చెట్టూ చేమా ఆరోగ్యంగా ఉండాలి. మందుల మీద కాదు... ప్రతిదీ మనం తినే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది' అంటున్నారు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బైరాక్' (బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్) ఇండిపెండెంట్ డైరెక్టర్... తిరుపతి వైద్యురాలు... **పెన్నా కృష్ణప్రశాంతి**. తెలుగు రాష్ట్రాల నుంచి 'బైరాక్'కు ఎంపికైన తొలి ప్రతినిధిగా చరిత్ర సృష్టించిన ఆమె... తన అనుభవాలను 'నవ్య'తో పంచుకున్నారు.



నవతరం ఆరోగ్యంగా లేదు

"బయోటెక్నాలజీ, వ్యవసాయం, వైద్యం, ఆహారం, పశు, మత్స్య రంగాల్లో ఆధునిక ఆవిష్కరణలకు 'బైరాక్' ఊతమిస్తోంది. ఈ రంగాల్లో పరిశోధనలకు ఆర్థిక సాయం చేస్తోంది. దీనికింద పదేళ్లలో దేశంలో దాదాపు 350 ఆవిష్కరణలు జరిగాయి. వీటిలో 'కొవీషీల్డ్ వ్యాక్సిన్' ఒకటి. అత్యంత చవగ్గా, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రానికి ఒక పరిశోధక బృందం రూపకల్పన చేసింది. గ్రామీణ శాస్త్రవేత్తలు మొదలు... ఐఐటీల దాకా 'బైరాక్' సేవలను వినియోగించుకోవచ్చు. దురదృష్టం ఏంటంటే 'బైరాక్' అనేది ఒకటుందనే విషయమే మనలో చాలామందికి తెలియకపోవడం. డిగ్రీ కాలేజీ స్థాయి నుంచే పరిశోధక ప్రాజెక్టులకు దీని నుంచి ఆర్థిక సాయం అందుకునే వీలుంది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి 'బైరాక్' దగ్గర వందల కోట్ల నిధులున్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు దీన్ని వినియోగించుకుంటున్నట్టుగా ఏపీ వాడుకోవడంలేదు. అవగాహన లేకపోవడమే ఇందుకు కారణం. 'కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ' బయోటెక్నాలజీ కార్యదర్శి రాజేష్ ఎస్ గోఖలే ఛైర్మన్‌గా ఉండే బైరాక్‌లో శాస్త్రవేత్తలు, అత్యున్నత విద్యావేత్తలు అయిన ఆరుగురు డైరెక్టర్లుంటారు. వీరు రెండు నెలలకోసారి సమావేశం అవుతారు. నూతన ఆవిష్కరణల కోసం వచ్చే ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి నిధులు కేటాయిస్తారు. ఇంత బాధ్యతాయుతమైన, ప్రతిష్ఠాత్మకమైన డైరెక్టర్ పదవి, ఒక స్వతంత్ర తెలుగు వైద్యురాలిని వెతుక్కుంటూ రావడమే విశేషం.

కర్రకు బల్బు వేలాడదీసి...

మా నాన్న పెన్నా ప్రభాకరరెడ్డి నీటి పారుదల శాఖలో ఇంజనీర్. మా అమ్మ కోకిలా సరోజమ్మ డాక్టర్. నాన్నకు తరచూ బదిలీలవల్ల మేం ఎక్కడా కుదురుగా లేము. గైనకాలజిస్టుగా అమ్మకు క్షణం తీరిక ఉండేది కాదు. ఆమెది వామపక్ష భావజాలం. నాన్న సంప్రదాయవాది. ఆయన వాకిట్లో కర్రకు బల్బు వేలాడదీసి, తనూ మేల్కొని రాత్రంతా నన్ను చదివించేవారు. నేను కాలు బయటపెట్టాల్సిన అవసరం లేకుండా ప్రతిదీ సిద్ధం చేసేవారు. దాంతో నాకు చదవడం తప్ప నలుగురితో కలవడం, మాట్లాడడం తెలీదు. 'పొట్టిగున్నావు, నల్లగున్నావు, లావుగున్నావు, నీకు పెళ్లి కాదు'... అని అందరూ జాలిపడుతూ ఉంటే నాలోకి నేను పారిపోయేదాన్ని. సమాజం చూపే ఈ తేడా నాలో కసిని పెంచింది. దాంతో చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టాను. ప్రతి తరగతిలోనూ ఫస్ట్. ఏడులో ఖమ్మం జిల్లా టాపర్‌ని. టెన్త్‌లో స్టేట్ ఐదో ర్యాంకర్‌ని. ఇంటర్‌లో స్టేట్ సెకండ్. అదే ఊపులో ఎంసెట్ రాసి 121వ ర్యాంకుతో తిరుపతి 'ఎస్వీ మెడికల్ కాలేజీ'లో చేరాను. మెడిసిన్‌లోనూ పలు సబ్జెక్టుల్లో గోల్డ్ మెడల్స్ సాధించాను.



ప్రత్యేక గుర్తింపు...

ఆలిండియా రేడియోలో ఉపన్యాసాలు, బడి పిల్లలతో సంభాషణలు, ప్రతివారం అవగాహనా కార్యక్రమాలు... ఇవన్నీ నన్ను మాటకారిగా మలిచాయి. 'ఐఎంఏ, ఫిజీషియన్ల సంఘం, డయాబెటిక్ పరిశోధనా మండలి'లో నా పాత్ర, ప్రసంగాలు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. అవి ఉత్తర భారత వైద్య ప్రపంచం చూపును దక్షిణాది వైపు కాస్త మళ్లించగలిగాయి. నా కృషికి 'ఏపీజే అబ్దుల్ కలామ్ ఎక్సలెన్స్' అవార్డు దక్కింది. ఈ ప్రయాణమే నేడు నన్ను 'బైరాక్' డైరెక్టర్‌ను చేసింది.

రాష్ట్రంలోని వైద్య కళాశాలలన్నిటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచి 'డాక్టర్ ఎన్ఆర్‌కె రావు' గోల్డ్ మెడల్‌ను నాటి గవర్నర్ కృష్ణకాంత్ చేతుల మీదుగా అందుకున్నాను.

చులకన చేసినవారే...

నేను డాక్టర్ అయ్యాక కూడా ఈ పరుగు ఆగలేదు. రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంకుతో కర్నూలులో పీజీలో చేరాను. 'అమ్మాయిలు ఇంట్లో అంట్లు తోముకోవాలి గానీ... జనరల్ మెడిసిన్‌కి ఎందుకు వస్తారు' అని తొలి క్లాస్‌లోనే ఒక ప్రొఫెసర్ అన్నారు. ఎప్పటిలాగే నోరు మెదపలేదు. చదువుతోనే వాళ్లకు సమాధానం చెప్పాలనుకున్నాను. ఆరు నెలల తరువాత ఆ ప్రొఫెసరే పిలిచి... 'జిల్లా కలెక్టర్ భార్యకు ఆరోగ్యం బాలేదట. వెళ్లి చూసిరా' అని అంతమంది మగ డాక్టర్లున్నా నన్నే పంపించారు.

మౌనాన్ని బద్దలు చేసింది...

పీజీ చదువుతుండగానే నా పెళ్లి అయింది. చదువు, చంకలో బిడ్డ, రెండు గదుల ఇరుకు ఇంట్లో కాపురం. మావారు హరినాథరెడ్డి సర్జన్. ఆయనకు చాలీచాలని జీతం. వేల రూపాయల ఖరీదు చేసే మెడికల్ పుస్తకాలు కొనలేని పరిస్థితి. ఆయన మద్రాసు మూర్ మార్కెట్‌కి వెళ్లి చవగ్గా పాత పుస్తకాలు కొనుక్కునేవారు. ఇరువైపుల కుటుంబాల మధ్య పెరిగిన పంతాలు గొడవలుగా మారి పెద్దవాళ్ల ఆసరా కూడా కరువైంది. ఆ సంఘర్షణే నాలో గడ్డకట్టిన మౌనాన్ని బద్దలు చేసింది. ఆ ధిక్కారం స్వతంత్ర బాటలోకి నడిపించింది. పీజీలోనూ కర్నూలు కాలేజీ ఫస్ట్ సాధించాను. తరువాత తిరుపతిలో ప్రాక్టీస్ ప్రారంభించాను. వేలూరు సీఎంసీలో డయాబెటాలజీలో ఫెలోషిప్ చేశాను. డయాబెటిక్ ఫుట్ మీద అధ్యయనం జరిపి, సమర్పించిన పరిశోధనా వ్యాసానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పరిశోధక అవార్డు లభించింది. డయాబెటాలజీలో చేసిన పరిశోధక కృషి... 7 దేశాల్లో ఈ అంశంపై ప్రసంగించే అవకాశం కల్పించింది.

వాళ్లే నేర్పించారు...

కాలేజీలో చదువుకున్న దానికన్నా ఎక్కువ పాఠాలు వైద్యం కోసం వచ్చే ప్రజల నుంచి నేర్చుకున్నాను. జబ్బులకు మందులు మాత్రమే సరిపోవని అర్థం చేసుకున్నాను. మాటలు అవసరం అయ్యాయి. ఆ మాటలను నాకు రోగులే నేర్పించారు. ఎదిగే వయసులో అనారోగ్యంతో వచ్చే ఆడపిల్లల్ని చూస్తే దిగులేసేది. చిన్న సమస్యలే వారి మనసును మెలిపెట్టేసేవి. డబ్బులున్న, చదువుకున్న తల్లులైతే సరే... డాక్టర్ దగ్గరకన్నా తీసుకువస్తారు. మరి పేద గ్రామీణ పిల్లల పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నే నన్ను ప్రభుత్వ బడులకు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు నడిపించింది. పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పిని అమ్మతో పంచుకుంటారు గానీ, అదనంగా పెరిగే వెంట్రుకలు, బ్రెస్ట్ సైజుపై సందేహాలు, పింపుల్స్ వంటివి ఆ వయసు ఆడపిల్లల్ని తీవ్రంగా కలచివేసే అంశాలు. ఎవరితోనూ మాట్లాడలేరు. వీటి గురించి వారికి అర్థమయ్యేలా చెప్పగలిగితే చాలు... సగం ఆరోగ్యం లభించినట్టే. ఇదే వయసు మగపిల్లలతో మాట్లాడాక నాకు ఒక విషయం అర్థమైంది. ఆడపిల్లలకన్నా మగపిల్లలే ఎక్కువగా సిగ్గుపడతారని. ఆడపిల్లల్లానే వాళ్లనీ శరీరంలోని మార్పులు తీవ్రంగా ఆందోళన పెడతాయని.

అధ్యయనాలు పెరగాలి...

అయినా ప్రజారోగ్యం పట్ల ఆందోళన, అసంతృప్తిని ఇవేవీ తగ్గించలేకపోతున్నాయి. నేడు నవతరం ఆరోగ్యంగా లేదు. రేపటి తరం ఆరోగ్యం కోసం గట్టి ప్రయత్నాలు మొదలవ్వాలి. పిల్లల్లో ఒబెసిటీ, పీసీఓడీ ఇప్పుడున్నంత ఎక్కువగా పదేళ్ల కిందట లేవు. కొవిడ్ తర్వాత చాలా మార్పులు వచ్చాయి. అధ్యయనాలు పెరగాలి. ప్రాచీన సంస్కృత ఆయుర్వేద గ్రంథాలను అనువదించుకోవాలి. అందులో పేర్కొన్న అంశాల మీద ఆధునిక పరిశోధనలు జరగాలి. ఫలానా పండు తింటే ఫలానా రోగం తగ్గుతుందనో, ఫలానా జబ్బుకి ఫలానా ఆకు లేదా వేరు పరిష్కారం అనో చెప్పడం కాదు. అది ఎలానో పరిశోధనలో నిగ్గు తేల్చాలి. దేశంలోని ఔత్సాహికులనూ, పరిశోధనా సంస్థలనూ ఈ దిశగా మళ్లించగలగాలి. అందుకు అవసరమైన అవగాహన కలిగించేందుకు, కావలసిన ఆర్థిక వనరులు సమకూర్చేందుకు 'బైరాక్' సిద్ధంగా ఉంది. దాన్ని అందరూ వినియోగించుకోవాలి. విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, కళాశాలలను సంప్రతిస్తూ ఆ దిశగా నా ప్రయత్నం కొనసాగిస్తున్నాను."

• పి.నరేంద్ర, తిరుపతి

ఫ్యాషన్

కళ్లు చెదిరే కాంతల్లా...

కుందనపు బొమ్మల్లా వెలిగిపోవాలంటే కంచిపట్టు చీరల్లో కాంతులీనాలి. బంగారు, వెండి జరీ ధగధగలు, కలనేతల కళా కాంతులు మీ సొంతం చేసుకోవాలనుకుంటే ఇదిగో ఇలాంటి సంప్రదాయ కట్టుబొట్టును అనుసరించండి!



2

తెల్ల పట్టుచీర హుందాతనమే వేరు. ప్రింటెడ్ డిజైన్ మోడర్న్ లుక్‌ని తెచ్చిపెడితే, కాంట్రాస్ట్ జరీ బార్డరు చీర మొత్తానికే వన్నె తెస్తుంది.



1

చామంతులు, కనకాంబరాలు కలిపి కట్టిన పూమాలలా కనిపించాలంటే పవిట చెంగు, కుచ్చిళ్లు ఒక రంగులో, చీర మొత్తం మరో రంగులో ఉండాలి. అలాంటి కాంట్రాస్ట్ రంగుల్లోనే చీర భారీగా కనిపించి కనువిందు చేస్తుంది.



3

వెండి వెలుగులు విరజిమ్మాలంటే వెండి జరీలో ధగధగలాడాలి. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే వెండి జరీ చీరను ఎంచుకుంటే సరి!



4

కుచ్చిళ్ల దగ్గర జరీ బార్డరు మోకాళ్ల వరకూ ఉండడం తాజా ఫ్యాషన్! ఈ స్టయిల్ చీరకు వినూత్న ఆకర్షణను తెచ్చిపెడుతుంది. ఆ జరీ మీద కనిపించీ, కనిపించకుండా ఉండే సెల్ఫ్ డిజైన్ ఈ చీరకున్న మరో ప్రత్యేకత.

ఉసిరితో... శిరోజాల సిరి!

విటమిన్-సి అధికంగా ఉండే ఉసిరితో హెయిర్‌ప్యాక్స్ వేసుకుంటే చక్కని ఫలితం ఉంటుంది. సులువుగా ఇంట్లోనే తయారు చేసుకునే హెయిర్‌ప్యాక్స్ ఇవే..

- బౌల్‌లో ఒక టేబుల్ స్పూన్ ఉసిరికాయల పొడి, శుభ్రపరచిన మూడు మందార పూల పేస్ట్, మూడు టేబుల్ స్పూన్‌ల కొబ్బరినూనెను తీసుకుని బాగా కలపాలి. ఈ పేస్ట్‌ను జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు స్మూత్‌గా తయారవుతుంది.
- గుప్పెడు తులసి ఆకులను శుభ్రపరచి పేస్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత బౌల్‌లో టేబుల్‌స్పూన్ ఉసిరికాయల పొడిని తీసుకుని తగినన్ని నీటిచుక్కలు వేసి పేస్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇందులో తులసి ఆకుల పేస్ట్ వేసి అరగంట తర్వాత మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే చుండ్రు కనపడదు.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల కుంకుడుకాయల చూర్ణానికి... రెండు టేబుల్ స్పూన్ల ఉసిరిపొడిని కలిపి నీటితో లేదా కొబ్బరినూనెతో పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని పట్టిస్తే జుట్టు రాలదు.
- మూడు టేబుల్ స్పూన్ల ఆమ్ల పౌడర్‌ను బౌల్‌లో తీసుకోవాలి. ఇందులోకి రెండు టీస్పూన్‌ల నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడును తాకేట్టు అప్లై చేయాలి. గంట తర్వాత మైల్డ్ షాంపూతో కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుండే జుట్టులో పల ఉండే బాక్టీరియా పోతుంది. డాండ్రఫ్ దరి చేరదు.



- రెండు టేబుల్ స్పూన్ల పెరుగులోకి, రెండు టేబుల్ స్పూన్ల ఉసిరికాయల పొడి వేసి మెత్తగా చూర్ణం చేసి జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత జుట్టును శుభ్రపరచాలి. ఇలా తరచూ చేస్తుంటే.. తల చల్లగా ఉంటుంది. జుట్టు పెరుగుదల కనపడుతుంది.
- మూడు టేబుల్‌స్పూన్ల మెంతులను రాత్రంతా నానబెట్టాలి. దీన్ని పేస్ట్ చేసి పెట్టుకోవాలి. ఈ మిశ్రమంలోకి రెండు టేబుల్ స్పూన్ల ఉసిరి పొడను కలిపి మెత్తగా చూర్ణం చేసి జుట్టుకు పట్టించాలి. ఆరిన తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రపరచుకోవాలి. ఇలా చేస్తే కుదుళ్లు గట్టిగా తయారవుతాయి.
- ఇలా హెయిర్‌ప్యాక్స్ వేసుకోవటంతో పాటు శారీరక శ్రమ, మంచి నిద్ర అవసరం. అప్పుడే జుట్టు మరింత ఆరోగ్యంగా ఉంటుంది.

సిద్ధించిన సంకల్పం

స్వావలంబన

పథకాలు ప్రజలకు దగ్గరకు చేరినప్పుడే, ప్రభుత్వ ఆశయాలు నెరవేరతాయి. కానీ ఆ పథకాల గురించి అవగాహన లేక, వాటిని సద్వినియోగం చేసుకోలేని మారుమూల గ్రామస్థుల పరిస్థితి ఏంటి? ఈ దిశగా ఆలోచించిన కేంద్ర ప్రభుత్వం, పథకాలను ప్రజల దగ్గరకు తీసుకువెళ్లి, ప్రయోజనాలను సద్వినియోగం చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఆ కార్యక్రమమే 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'. హరియాణాలో వైభవంగా సాగుతున్న ఈ యాత్రకు హాజరైన లబ్ధిదారులు 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.



రేఖ, ఆశా యాదవ్, మధు

సురక్షితమైన శానిటరీ ప్యాడ్స్‌తో...

నా పేరు మధు. మా స్వయం సహాయక సంఘం పేరు జన్ కళ్యాణ్. మొదట్లో కొంత తడబడినా మహిళా బృందాన్ని నడిపించడం మీద పట్టు సాధించాను. ఒక్కరి సంపాదనతోనే కుటుంబాన్ని నడిపే రోజులు పోయాయి. ఏ లోటు లేకుండా పిల్లా పాపలతో కుటుంబం సజావుగా సాగాలంటే ఇంటి ఇల్లాలు కూడా ఎంతో కొంత సంపాదించడం అవసరం. ప్రస్తుతం స్వయం సహాయక బృందానికి లీడర్‌గా నేను నాతో పాటు సాటి మహిళలను కూడా స్వయం స్వావలంబన వైపు నడిపించగలుగుతున్నాను. ప్రస్తుతం నేను శానిటరీ ప్యాడ్స్ విక్రయిస్తున్నాను. గ్రామీణ మహిళలు నెలసరి సమయంలో అనుసరించే విధానాలతో ఎన్నో చర్మ సమస్యలు, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సురక్షితమైన, ఆరోగ్యకరమైన ప్యాడ్స్ వాడకంతో ఈ సమస్యలను రూపుమాపవచ్చని అవగాహన కల్పించి, వీటిని కొనుగోలు చేసేలా ప్రోత్సహించడంతో పాటు, స్వీయ సంపాదన కోరుకునే మహిళలను జన్ కళ్యాణ్ గ్రూపులో సభ్యులుగా చేర్చగలిగాను. మేం విక్రయించే శానిటరీ ప్యాడ్స్‌లో ప్లాస్టిక్ ఉండదు. ఇవి పూర్తి కాటన్‌తో తయారవుతాయి. కాబట్టి ఇవి పూర్తిగా సురక్షితమైనవి.

జూట్, పేపర్ బ్యాగ్స్‌తో...

నా పేరు రేఖ. మాకడోలా మా గ్రామం. మా గ్రూపు పేరు 'నయీ ఆశా'! మా గ్రామ సంఘటన్ పేరు కిరణ్ మహిళా గ్రామ సంఘటన్! ఇలాంటివి మా దగ్గర 13 గ్రూపులున్నాయి. వీటిలో 10 గ్రూపులు మా గ్రామ సంఘటన్‌తో అనుసంధానమై పని చేస్తున్నాయి. మా గ్రూపులన్నీ, కాగితపు సంచులు, జూట్ సంచులు, మిల్లెట్ ఉత్పత్తులను తయారుచేస్తాయి. ఇందుకోసం మాకు ప్రభుత్వం నుంచి 10 వేల రివాల్వింగ్ ఫండ్లు దొరికాయి. అలాగే గ్రామ సంఘటన్ నుంచి 5 లక్షల నిధులు అందాయి.

ప్రస్తుతానికి సంచులన్నిటినీ అరువు తెచ్చుకున్న కుట్టు మిషన్లతోనే కుడుతున్నాం. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి లోన్ అందితే సొంత కుట్టు మిషన్లను ఉపయోగించి, ఉత్పత్తులను తయారుచేసుకుంటాం! బ్యాంకులు కూడా మాకు లోన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. మా పట్ల ప్రభుత్వం ప్రతిస్పందన ఎంతో బాగుంది. బ్యాంకులు కూడా పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉన్నాయి. మేం లోను తీసుకున్న తర్వాత క్రమం తప్పకుండా తీర్చేస్తున్నాం. కాబట్టి ప్రభుత్వం కూడా మా పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ, అవసరమైనంత లోనుకు అనుమతిస్తోంది. ఇందుకోసం మేం వేటినీ తాకట్టు పెట్టవలసిన అవసరం లేదు. ఇదంతా 'నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్'తో అనుసంధానవడం మూలంగా మాకు ఈ ప్రయోజనాలన్నీ దక్కుతున్నాయి. ఇంతకు ముందు మేం సాధారణ గృహిణులుగా ఇళ్లకే పరిమితమై ఉండే వాళ్లం. జాతీయ గ్రామీణ్ జీవితా మిషన్‌తో అనుసంధానమైన తర్వాత, మాకంటూ ఒక గుర్తింపు పొందగలిగాం! ప్రస్తుతం 200 మంది మహిళలం ఒక గ్రూపుగా ఏర్పడి, ఒక కుటుంబంగా కలిసి పని చేస్తున్నాం! మా అవసరాలను, ఇబ్బందులను కలిసి పంచుకుంటూ, ఎవరెవరు ఎలాంటి ఆసక్తిని కలిగి ఉన్నారో, జీవనోపాధికి అవసరమైన ఎలాంటి శిక్షణ అవసరత ఉందో మేం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోగలుగుతున్నాం. ఇలా మాలో కుట్టుపని నేర్చుకున్న కొందరు మహిళలు సొంత బొటిక్స్ మొదలుపెట్టారు. కొంతమంది టైలర్లుగా స్థిరపడ్డారు. కొందరు లోను ద్వారా ఉపాధి లేక ఇంటికే పరిమితమైన తమ భర్తల కోసం ఇ-రిక్షా లాంటి ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను కూడా పొందారు. స్వయం సహాయక సంఘాల నుంచి లోన్ పొందిన కొందరు మహిళలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించగలుగుతున్నారు.

పచ్చళ్లు, మిల్లెట్ ఉత్పత్తులతో...

నా పేరు ఆశా యాదవ్. నేను మా గ్రామంలో పది గ్రూపులు ఏర్పాటు చేశాను. నాతో పాటు 150 నుంచి 200 మంది మహిళలు, 2019లో ఎన్ఆర్ఎల్ఎమ్‌తో అనుసంధానమయ్యాం. ప్రారంభంలో నాలుగు గ్రూపులతో మొదలైన మేం ప్రస్తుతం పది గ్రూపులకు పెరిగాం. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలందరినీ సంప్రతించి, మెరుగైన జీవనానికి అవసరమైన వనరులు, అవసరతలు, వాటితో సాధించగలిగే వీలున్న స్వయం స్వావలంబనల గురించి చర్చించాం. ఆ విధంగా ఎన్ఆర్ఎల్ఎమ్ నుంచి పచ్చళ్ల తయారీలో మేం శిక్షణ పొందాం. అలా పది మంది మహిళా బృందంతో కలిసి పచ్చళ్ల తయారీ పని మొదలు పెట్టాం. నేను నా పచ్చళ్ల గురించి మార్కెటింగ్ చేసినప్పుడు, దాని ద్వారా ఎంతో మంది మహిళలకు ప్రభుత్వ పథకాలు, శిక్షణా కార్యక్రమాల గురించి అవగాహన ఏర్పడింది. అలాగే 2023 ప్రారంభంలో మిల్లెట్ పదార్థాల తయారీలో కూడా మేం శిక్షణ పొందాం! మా ఉత్పత్తులకు మంచి స్పందన దక్కుతోంది. మేం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ సహాయంతోనే స్వయం స్వావలంబన సాధించగలుగుతున్నాం. ఈ పథకాల గురించి అవగాహన లేని మహిళలు ఇంతకుముందు కూలీ పనులకు వెళ్లేవాళ్లు. శారీరక శ్రమతో కూడిన ఆ పనులతో వాళ్లు ఎన్నో ఇబ్బందులు పడుతూ ఉండేవాళ్లు. కానీ ఇప్పుడు మా అందరి జీవితాలు మారాయి. ఇంటి పట్టునే మేం ఉపాధిని పొందగలుగుతున్నాం. సంపాదన కోసం పుట్టింటి మీదా, అత్తింటి మీదా ఆధారపడే అవసరం లేకుండా, స్వయంకృషి మీదే ఆధారపడడం మాకెంతో గర్వకారణంగా ఉంది. ఈ అవకాశాన్ని కల్పించి, మా జీవితాలను వెలుగులోకి నడిపించిన కేంద్ర ప్రభుత్వానికి మేం రుణపడి ఉంటాం!

• గోగుమళ్ల కవిత


ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 17 జనవరి 2024
cinema@andhrajyothy.com



వచ్చే సంక్రాంతికి మెగా ధమాకా

చిరంజీవి అభిమానులకు సంక్రాంతి సందర్భంగా డబుల్ ధమాకా ఇచ్చారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం (మెగా 156-వర్కింగ్ టైటిల్) టైటిల్, రిలీజ్ డేట్ ఖరారయ్యాయి. ఈ చిత్రానికి 'విశ్వంభర' అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా సోమవారం విడుదల చేసిన ప్రత్యేక వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఫాంటసీ అడ్వెంచర్‌గా వశిష్ఠ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని భారీ హంగులతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఛోటా కె

వింటేజ్ లుక్‌తో రాజా సాబ్



ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి రూపొందిస్తున్న చిత్రానికి 'రాజా సాబ్' అనే పేరు నిర్ణయించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో 'రాజా సాబ్' చిత్రాన్ని దర్శకుడు మారుతి రూపొందిస్తుండడంతో సినిమా మీద అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. వింటేజ్ లుక్‌లో లుంగీ కట్టుకున్న ప్రభాస్ అందర్నీ ఆకట్టుకుంటున్నారు. సరదాగా, రొమాంటిక్‌గా సాగే క్యారెక్టర్ లుక్‌లో 'డార్లింగ్' ప్రభాస్‌ను చూడడంతో అభిమానులతో పాటు సినిమా లవర్స్ అందరికీ ఫ్రెష్ ఫీల్ కలుగుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లోనే ఒక కలర్‌ఫుల్ సినిమా చూడబోతున్న భావనని మారుతి కలిగించారు.

తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో 'రాజా సాబ్' ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రానికి కార్తీక్ పళని సినిమాటోగ్రఫీని, తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. 'మగధీర', 'బాహుబలి' చిత్రాలకు వి.ఎఫ్.ఎక్స్ అందించిన కమల్ కన్నన్ ఈ సినిమాను వర్క్ చేస్తున్నారు.

అయోధ్యలో స్థలం కొన్న అమితాబ్



అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం ఈ నెల 22న జరుగుతుంది. దేశ, విదేశాలలో ఉన్న వారంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న కార్యక్రమం ఇది. రామమందిరం ఏర్పాటుతో అయోధ్య పరిసర ప్రాంతాల రూపురేఖలు వేగంగా మారిపోతున్నాయి. రామమందిరం ప్రారంభోత్సవం రోజునే సరయూ నది ప్రాంతంలో 45 ఎకరాల్లో 'సరయు ప్రాజెక్ట్' పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థ హౌస్ ఆఫ్ అభినందన్ లోధా కొత్త వెంచర్ ప్రారంభిస్తోంది. సరయు నది ఒడ్డున ఓ ఫైవ్ స్టార్ హోటల్ కూడా నిర్మించడానికి ఇప్పటికే లీలా ప్యాలెస్ గ్రూప్‌తో ఒప్పందం చేసుకుందీ సంస్థ. ఈ నేపథ్యంలో అమితాబ్ బచ్చన్ ఈ సంస్థలో పది వేల చదరపు అడుగుల స్థలం కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీని విలువ ఎంతో తెలుసా? రూ. 14 కోట్ల 50 లక్షలు. 'ఈ ఆధ్యాత్మిక నగరంలో ఇల్లు కట్టుకోవాలన్నది నా కోరిక. అందుకే ఈ స్థలం కొన్నాను' అని అమితాబ్ పేర్కొన్నారు. అయోధ్యలో అమితాబ్ స్థలం కొనడంతో అక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో జోష్ పెరగడం ఖాయం!

కాలం ఏదైనా మార్మోగే పేరు
కంగువ



సూర్య కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'కంగువ'. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నాయి. దిశాపటానీ కథానాయిక. శివ దర్శకుడు. మొత్తం పదికి పైగా భాషల్లో విడుదల చేస్తున్నారు. త్రీడీ లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా చిత్రబృందం 'కంగువ' సెకండ్ లుక్‌ను రిలీజ్ చేసింది. చారిత్రక నేపథ్యంలో కాల్పనిక గాథతో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో సూర్య యుద్ధ వీరుని లుక్‌లో మెరిశారు. 'గతం, వర్తమానం, భవిష్యత్... కాలం ఏదైనా నలుదిక్కులా మార్మోగే పేరు ఒక్కటే 'కంగువ'... అంటూ సూర్య లుక్‌కు మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్‌ను బట్టి సూర్య పాత్ర ఇందులో ఎంత శక్తిమంతంగా ఉండబోతోందో తెలుస్తోంది. బాబీ డియోల్, యోగిబాబు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: వెట్రి పళనిస్వామి

గాయని చిత్రకు సైబర్ సెగ



సీనియర్ గాయని చిత్రపై సోషల్ మీడియాలో దాడి మొదలైంది. అయితే ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు.. కేరళలో అధికారంలో ఉన్న సీపీఐ (ఎం) పార్టీతో సహా చిత్రకు మద్దతుగా నిలిచాయి. ఆమె గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న వ్యతిరేక ప్రచారాన్ని దుయ్యబడుతూ, మనసులో మాట చెప్పే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందనీ, ఇందులో వ్యక్తిగత విమర్శలు చేసి చిత్ర వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలని చూడడం సబబు కాదనీ ఆ పార్టీలు అంటున్నాయి. అసలు ఏం జరిగింది? కొందరు నెటిజన్ల దృష్టిలో చిత్ర చేసిన తప్పు ఏమిటి? అయోధ్యలో రామమందిరం ఈ నెల 22న ప్రారంభం కానున్న సంగతి విదితమే. ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతున్న సమయంలో ప్రతి ఒక్కరూ 'శ్రీ రామ.. జయ రామ.. జయ జయ రామ' అనాలనీ చిత్ర ఇటీవల విడుదల చేసిన ఓ వీడియోలో కోరారు. అంతే కాకుండా అదే రోజు సాయంత్రం తమ ఇంట్లో ఐదు దీపాలను వెలిగించాలని కూడా ఆమె ఆ వీడియోలో విజ్ఞప్తి చేశారు. అయితే చిత్ర ఇలా కోరడం ఓ వర్గం నెటిజన్లకు నచ్చలేదు. రామ మందిరం గురించి ఆమె అలా చెప్పడం బాగోలేదని కొందరంటే, రాజకీయ ప్రయోజనం ఆశించి చిత్ర అలా మాట్లాడుతున్నారని మరి కొందరు నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంటుందనీ, ఆ విషయంలో చిత్రను తప్పు పట్టడం సరికాదని మరికొందరు ఆమెను సమర్థిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

వచ్చే సంక్రాంతికి శతమానం భవతి సీక్వెల్



వచ్చే సంక్రాంతికి కోసం పన్నెండు నెలలు ముందుగానే బెర్త్ రిజర్వ్ చేసుకున్నారు నిర్మాత దిల్ రాజు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనరుపై 2017లో శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ జంటగా 'శతమానం భవతి' చిత్రాన్ని ఆయన నిర్మించారు. సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న ఈ చిత్రం భారీ సినిమాల పోటీని తట్టుకుని నిలబడి తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. అంతే కాదు జాతీయ ఉత్తమ చిత్రంగా అవార్డ్ సాధించి తెలుగు చిత్ర పరిశ్రమ గొప్పతనం చాటింది. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌గా 'శతమానం భవతి నెక్స్ట్ పేజ్'ను రూపొందిస్తున్నట్లు దిల్ రాజు ప్రకటించారు. సినిమా పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తామనీ, అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 2025 సంక్రాంతికి సినిమా విడుదల చేస్తామనీ ఆయన వెల్లడించారు.

ఫైటర్ హంగామా



హృతిక్ రోషన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఫైటర్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ నెల 25న విడుదలవుతోంది. 2019 నాటి పుల్వామా ఘటన నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సంక్రాంతి సందర్భంగా చిత్రబృందం 'ఫైటర్' ట్రైలర్‌ను విడుదల చేసింది. దేశభక్తి, యాక్షన్, ఎమోషన్ అంశాల కలబోతగా చిత్రం రూపొందినట్టు ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఇందులో హృతిక్ పాత్రను షంషేర్ పఠానియాగా పరిచయం చేశారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్ డ్రాగన్స్ అనే విభాగానికి ఆయన లీడర్‌గా కనిపించారు. ఎయిర్‌ఫోర్స్ యూనిఫాంలో హృతిక్ ఆకట్టుకున్నారు.

రిలీజ్‌కు కృష్ణ చివరి చిత్రం



సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చివరి చిత్రం 'కృష్ణ విజయం' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అంబుజా మూవీస్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి మధుసూదన్ హవల్దార్ దర్శకత్వం వహించారు. నాగబాబు, సుహాసినీ, గీతాసింగ్ ముఖ్య పాత్రలు పోషించారు. త్వరలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఇటీవలే ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ, మహేశ్‌బాబు అభిమానులకు ప్రత్యేక షో వేశారు. పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కృష్ణగారి సినిమాకు దర్శకత్వం వహించడం తనకు దక్కిన అదృష్టమని దర్శకుడు తెలిపారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని ఆయన చెప్పారు. ఈ చిత్రానికి శ్రీలేఖ సంగీతం అందించారు.

ఎవరు హీరో?, ఎవరు విలన్?



మార్కెటింగ్ స్కామ్ అనే పాయింట్ చుట్టూ అల్లుకున్న ఆసక్తికర కథతో తెరకెక్కిన చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. ప్రజిన్ పద్మనాభన్, జీవా, విజయ్ విశ్వ, సాయి ధన్య షాలిని ముఖ్య తారాగణం. రామ్ ప్రభ దర్శకత్వంలో వ్యాపారవేత్త వేల్ మురుగన్ నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ఇలాంటి పాయింట్‌తో సినిమాలు రాలేదు. ఇందులో ఎవరు హీరో?, ఎవరు విలన్? అనేది క్లైమాక్స్ వరకూ తెలియదు. సినిమాను దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించాడు' అన్నారు. ఈ చిత్రానికి మనోజ్ కుమార్ బాబు సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: సురేశ్‌కుమార్, సుందరం.

హంగులతో వస్తున్న రాజావారు



'గుర్తుందా శీతాకాలం' చిత్రంతో నిర్మాతగా తనదైన అభిరుచిని చాటుకున్నారు చింతపల్లి రామారావు. ఇప్పుడాయన నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా దర్శకుడు వేగేశ్న సతీష్ రూపొందిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా నిర్మాత సినిమా విశేషాలను పాత్రికేయులతో పంచుకున్నారు. వాణిజ్య హంగులతో శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల్లో తొలి కాపీ సిద్ధమవుతుందని తెలిపారు. ఇక నుంచి ఏటా మూడు సినిమాలు నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు చెప్పారు. తెలుగు, కన్నడ అగ్రహీరోలతో భారీ సినిమాలు చేస్తున్నట్లు ప్రకటించారు. వాణిజ్యహంగులతో పాటు సమాజానికి మంచి సందేశం ఉండేలా సినిమాలు చేస్తానని ఆయన తెలిపారు.

నిర్మాతే హీరోయిన్!



ఒక తెలుగు యువతి సినిమాలో హీరోయిన్‌గా నటించడం, ఆ చిత్రానికి ఆమే నిర్మాత కావడం, కథను కూడా అందించడం అరుదుగా జరిగే విషయం. అలా మల్టీ టాలెంటెడ్‌గా సుమయా రెడ్డి 'డియర్ ఉమ' చిత్రంతో అందరినీ ఆకట్టుకోనున్నారు. సుమ చిత్ర ఆర్ట్స్ సంస్థ పతాకంపై ఆమె నిర్మిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీ అంబర్ హీరోగా నటిస్తున్నారు. సాయి రాజేశ్ మహదేవ్ దర్శకుడు. ఈ సినిమా గురించి సుమయా రెడ్డి మాట్లాడుతూ 'చిత్రం షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే విడుదల చేస్తాం. ఫీల్ గుడ్ లవ్ స్టోరీతో సాటే చక్కని సందేశం అందిస్తున్నాం. త్వరలో టీజర్ విడుదల చేస్తాం' అని చెప్పారు. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా సినిమా తీశారని, సినిమాలో లవ్, ఫ్యామిలీ సెంటిమెంట్, యాక్షన్ అంశాలు ఉన్నాయనీ దర్శకుడు తెలిపారు. కమల్ కామరాజ్, సప్తగిరి, అజయ్ ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, రూపలక్ష్మి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం! రధన్, ఛాయాగ్రహణం:రాజ్ తోట.

46 ఫోర్లు, 3 సిక్స్‌లతో 404 నాటౌట్


ప్రఖర్ చతుర్వేది

» కూచ్ బెహార్ ట్రోఫీ ఫైనల్లో చతుర్వేది మారథాన్ ఇన్నింగ్స్
» యువీ రికార్డు బద్దలు కొట్టిన కర్ణాటక కుర్రాడు

శివమొగ్గ (కర్ణాటక): కర్ణాటక యువ క్రికెటర్ ప్రఖర్ చతుర్వేది మారథాన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అండర్-19 కూచ్ బెహార్ ట్రోఫీ ఫైనల్లో ఏకంగా 404 పరుగులు చేసి వారెవ్వా అనిపించాడు. ముంబై జట్టుతో జరిగిన తుదిపోరులో 18 ఏళ్ల ప్రఖర్ చతుర్వేది (638 బంతుల్లో 46 ఫోర్లు, 3 సిక్స్‌లతో 404 నాటౌట్) రికార్డు క్వాడ్రపుల్ సెంచరీ కొల్లగొట్టాడు. ఈ క్రమంలో ఈ టోర్నీ ఫైనల్లో 24 ఏళ్ల క్రితం మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ (358) నెలకొల్పిన అత్యధిక స్కోరు రికార్డును చతుర్వేది బద్దలుకొట్టాడు. ఓవరాల్‌గా 2011-12లో అసోంతో మ్యాచ్‌లో మహారాష్ట్ర ఆటగాడు విజయ్ జోల్ (451 నాటౌట్) అత్యధిక స్కోరు నమోదు చేయగా.. తాజా ఇన్నింగ్స్‌తో చతుర్వేది రెండో స్థానంలో నిలిచాడు. చతుర్వేది రికార్డు ఫీట్‌తో తొలి ఇన్నింగ్స్‌లో 890/8 స్కోరు చేసిన కర్ణాటక.. ముంబైతో ఫైనల్‌ను డ్రాగా ముగించింది. కానీ, మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కర్ణాటక టైటిల్ దక్కించుకొంది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 380 పరుగులకు కుప్పకూలింది.

చదువుల కుటుంబం నుంచి వచ్చి..: చదువులకే అధిక ప్రాధాన్యతనిచ్చే కుటుంబం నుంచి వచ్చిన ప్రఖర్ చతుర్వేది క్రికెట్‌లో విశేషంగా రాణిస్తున్నాడు. చతుర్వేది తండ్రి సంజయ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా.. తల్లి రూప డీఆర్‌డీవోలో టెక్నికల్ అడ్వైజర్. అయితే, క్రికెట్ పట్ల తమ కుమారుడికి ఉన్న ఆసక్తిని గమనించి ఆ దిశగా ప్రోత్సహించారు.



సెమీస్‌కు భారత్

చిత్తుగా ఓడిన ఇటలీ
ఒలింపిక్ క్వాలిఫయర్స్

రాంచీ: ఒలింపిక్ బెర్త్ ఆశిస్తున్న భారత మహిళల హాకీ జట్టు ఆ దిశగా మరింత ముందడుగు వేసింది. హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీ పూల్ 'బి'లో మంగళవారం ఇటలీతో జరిగిన చివరి మ్యాచ్‌లో 5-1తో ఘనవిజయం సాధించింది. తద్వారా మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్ సెమీస్‌లో చోటు దక్కించుకుంది. గురువారం జరిగే నాకౌట్ పోరులో భారత జట్టు జర్మనీతో తలపడనుంది. ఈ మ్యాచ్‌కంటే ముందు తమకు పోటీగా ఉన్న న్యూజిలాండ్ 0-1తో అమెరికా చేతిలో ఓడడం భారత్‌కు కలిసివచ్చింది. దీంతో నాకౌట్‌లో చోటు కోసం ఇటలీతో మ్యాచ్‌ను డ్రాగా ముగించినా సరిపోయేది. కానీ విజయమే లక్ష్యంగా దూసుకెళ్లి ఆట ఆరంభమైన తొలి నిమిషంలోనే ఉదిత గోల్‌తో భారత్ బోణీ చేసింది. ఆ తర్వాత రెండు, మూడో క్వార్టర్లు హోరాహోరీగా సాగినా, ఆట మాత్రం ఎక్కువగా భారత్ ఆధీనంలోనే కొనసాగింది. మూడో క్వార్టర్‌లో భారత్‌కు లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను దీపిక గోల్‌గా మలచగా.. ఆ వెంటనే సలీమా ఫీల్డ్‌గోల్‌తో భారత్ 3-0తో తిరుగులేని ఆధిక్యం అందుకుంది. ఆఖరి క్వార్టర్స్‌లో నవ్‌నీత్, ఉదిత గోల్స్‌తో జట్టు గెలుపును ఖాయం చేశారు. ఇతర మ్యాచ్‌ల్లో జపాన్ 2-0తో చిలీపై, జర్మనీ 10-0తో చెక్ రిపబ్లిక్‌పై నెగ్గి సెమీస్ చేరాయి. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో జర్మనీతో భారత్, అమెరికాతో జపాన్ తలపడనున్నాయి.

రెండో టీ20లో జింబాబ్వే గెలుపు

కొలంబో: శ్రీలంకతో ఉత్కంఠగా సాగిన రెండో టీ20లో జింబాబ్వే అదరగొట్టింది. చివరి ఓవర్‌లో 20 పరుగులు కావాల్సిన వేళ టెయిలెండర్ బ్యాటర్లు ల్యూక్ జోంగ్వే (12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25 నాటౌట్), మదండే (5 బంతుల్లో 2 సిక్సర్లతో 15 నాటౌట్) చెలరేగారు. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 4 వికెట్లతో గెలిచిన జింబాబ్వే సిరీస్‌లో 1-1తో నిలిచింది. ముందుగా శ్రీలంక 20 ఓవర్లలో 173/6 స్కోరు చేయగా.. ఛేదనలో జింబాబ్వే19.5 ఓవర్లలో 178/6 స్కోరుతో గెలిచింది. ఇర్విన్ (70) టాప్ స్కోరర్.

సుమిత్ సూపర్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలన ప్రదర్శన
తొలిరౌండ్లో 27వ ర్యాంకర్ అలెగ్జాండర్‌కు షాక్


అలెగ్జాండర్ బబ్లిక్

గ్రాండ్‌స్లామ్‌లో సీడెడ్‌పై గెలిచిన రెండో భారత ఆటగాడిగా రికార్డు

మెల్‌బోర్న్: భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నగల్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనం సృష్టించాడు. క్వాలిఫయర్‌గా మెయిన్ డ్రాకు అర్హత సాధించిన 26 ఏళ్ల నగల్ తన కంటే ఎన్నో రెట్లు మెరుగైన, ప్రపంచ 27వ ర్యాంకర్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)కు షాకిచ్చాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఆరంభ రౌండ్లో 137వ ర్యాంకరైన సుమిత్ 6-4, 6-2, 7-6(5)తో 31వ సీడ్ అలెగ్జాండర్‌ను వరుససెట్లలో చిత్తుచేసి కెరీర్‌లో తొలిసారి మెల్‌బోర్న్ పార్క్‌లో రెండో రౌండ్ చేరాడు. ఈ క్రమంలో 35 ఏళ్ల తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రాలో సీడెడ్ ఆటగాడిని ఓడించిన తొలి భారత క్రీడాకారునిగా సుమిత్ చరిత్ర సృష్టించాడు. అంతకుముందు.. 1989 ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండోరౌండ్లో భారత్ తరఫున రమేశ్ కృష్ణన్ నాటి డిఫెండింగ్ చాంపియన్, నెంబర్‌వన్ మాట్స్ విలాండర్ (స్వీడన్)ను ఓడించాడు.

ఆరంభంలో అలవోకగా..: 2 గంటల 37 నిమిషాలపాటు సాగిన పోరులో నగల్ అద్భుత ఆటను ప్రదర్శించాడు. ఆరంభంలోనే ఒకరి సర్వీస్‌లను ఒకరు బ్రేక్ చేసుకొని 1-1తో సమంగా నిలిచినా.. ఆ తర్వాత వరుసగా మూడు గేమ్‌లు గెలిచిన నగల్ 4-1తో ముందంజ వేశాడు. అయితే, క్రమంగా పుంజుకొన్న బబ్లిక్ 4-5తో సమం చేసే ప్రయత్నం చేసినా.. 10వ గేమ్‌లో సర్వీస్‌ను నిలబెట్టుకొన్న సుమిత్ 6-4తో ఆ సెట్ నెగ్గాడు. రెండో సెట్‌లో రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన నగల్ 6-2తో సులువుగా దక్కించుకొన్నాడు. అయితే మూడో సెట్‌లో ఇద్దరూ 6-6తో సమంగా నిలవడంతో.. సెట్ ఫలితం టైబ్రేక్‌కు మళ్లింది. ఇందులో సుమిత్ 6-3తో మ్యాచ్ పాయింట్‌పై నిలిచినా.. పోరాడిన బబ్లిక్ 5-6తో సమం చేసే విధంగా కనిపించాడు. కానీ, 7-5తో నగల్ సెట్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకొన్నాడు. రెండో రౌండ్‌లో 140వ ర్యాంకర్ జుచెంగ్ షాంగ్ (చైనా)తో నగల్ తలపడనున్నాడు.

స్వియటెక్ కష్టపడి..

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్ అల్కరాజ్ 7-6(5), 6-1, 6-2తో రిచర్డ్ గాస్కెట్‌పై, ఆరో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 4-6, 6-3, 7-6(3), 6-3తో డొమినిక్ కోఫర్‌పై, 11వ సీడ్ కాస్పర్ రూడ్ 6-1, 6-3, 6-1 అల్బర్ట్ రమోస్‌పై గెలిచి రెండోరౌండ్లో ప్రవేశించారు. మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్ ఇగా స్వియటెక్ 7-6(2), 6-2తో మాజీ చాంపియన్ సోఫియా కెనిన్‌ను, రిబకినా 7-6(6), 6-4తో ప్లిస్కోవాను, 5వ సీడ్ జెస్సికా పెగుల 6-2, 6-4తో రెబెక్కాను, కొలిన్స్ 6-2, 3-6, 6-1తో కెర్బర్‌ను, అజరెంకా 6-1, 4-6, 6-3తో కమిల గోర్గిని ఓడించి రెండో రౌండ్‌కు చేరుకొన్నారు. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకీ భాంబ్రి-రాబిన్ హస్సేన్ (నెదర్లాండ్స్) జంట 6-1, 6-7(8), 6-7(7)తో రఫెల్ మటోస్-నికోలస్ చేతిలో ఓడింది.

ఐటా వైల్డ్‌కార్డ్ నిరాకరించినా..

హరియాణాలోని జజ్జార్‌కు చెందిన సుమిత్ ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడేందుకు చాలా కష్టపడ్డాడు. డేవిస్‌కప్‌లో ఆడేందుకు విముఖత చూపాడన్న కారణంతో సుమిత్‌ను రీజనల్ వైల్‌కార్డ్‌తో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడించేందుకు అఖిల భారత టెన్నిస్ సమాఖ్య (ఐటా) నిరాకరించింది. వాస్తవానికి భారత్ నుంచి సింగిల్స్‌లో అత్యుత్తమ ర్యాంక్ ప్రకారం ఎంపిక చేయాలనుకుంటే సుమిత్‌నే మెల్‌బోర్న్ పంపాలి. కానీ, డేవిస్‌కప్‌కు దూరమై నిబంధనలు ఉల్లంఘించాడన్న కారణంతో అతడి ఎంట్రీని ఐటా పంపలేదు. దీంతో క్వాలిఫయింగ్ రౌండ్లలో సత్తాచాటిన సుమిత్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. ఇప్పుడు ఏకంగా తొలిరౌండ్లో సంచలన ప్రదర్శనతో తన సత్తా చాటాడు. సుమిత్ చివరిగా 2021లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడినా, అప్పుడు తొలిరౌండ్లోనే ఓడాడు. 2019లో యూఎస్ ఓపెన్‌తో గ్రాండ్‌స్లామ్ అరంగేట్రం చేసిన సుమిత్.. ఆనాడు స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌తో తలపడ్డాడు. ఈ మ్యాచ్‌లో 6-4, 1-6, 2-6, 4-6తో ఫెడెక్స్ చేతిలో ఓడినా.. ఒక సెట్ నెగ్గడం పెద్ద సంచలనమే అయింది. 2020 యూఎస్ ఓపెన్‌లో బ్రాడ్లీ కల్హన్ (అమెరికా)పై గెలిచిన నగల్.. సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్ (2013లో) తర్వాత గ్రాండ్‌స్లామ్ సింగిల్స్‌లో మ్యాచ్ నెగ్గిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు.


సీఈవో నియామకంలో.. ఉష ఒత్తిడి చేసింది

ఈసీ సభ్యుల ఆరోపణ

న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) సీఈవోగా రఘు అయ్యర్ నియామకం వివాదాస్పదమైంది. అతడి విషయంలో ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష.. తమపై ఒత్తిడి తీసుకువచ్చిందని 12 మంది ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సభ్యులు ఆరోపించారు. ఈనెల 6న అయ్యర్ నియామకంపై ఉష అధికారిక ప్రకటన చేసింది. కానీ, దీన్ని తాము ఆమోదించలేదని ఈసీ సభ్యులు చెప్పారు. ఈ మేరకు ఐవోఏ అధ్యక్షురాలికి వీరంతా లేఖ రాశారు. జీతం విషయంలోనూ నిబంధనలను పాటించలేదన్నారు. అయితే, వీరివి సిగ్గుపడాల్సిన ఆరోపణలని ఉష వ్యాఖ్యానించింది. అత్యవసర సమావేశంలో చర్చించిన తర్వాతనే నియామకాన్ని ఖరారు చేసినట్టు పేర్కొంది. అయ్యర్ గతంలో ఐపీఎల్ జట్టు రైజింగ్ పుణె సూపర్‌జెయింట్స్ సీఈవోగా పని చేశాడు.

సేన్‌కు రజావత్ షాక్

» ఇండియా ఓపెన్‌లో ప్రణయ్ ముందంజ



న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ ఇండియా ఓపెన్‌లో అదరగొట్టాడు. మంగళవారం మొదలైన ఈ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రజావత్ తనకంటే సీనియర్, స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌కు షాకిచ్చాడు. పురుషుల సింగిల్స్ తొలిరౌండ్లో ప్రపంచ 30వ ర్యాంకర్ రజావత్ 16-21, 21-16, 21-13తో ప్రపంచ 19వ ర్యాంకర్ లక్ష్యసేన్‌ను చిత్తుచేశాడు. వరుసగా రెండో టోర్నీలోనూ మొదటిరౌండ్లోనే ఓడిన సేన్.. ఒలింపిక్‌కు అర్హత సాధించే అవకాశాలను సంక్లిష్టం చేసుకున్నాడు. ఇక వెటరన్ స్టార్ హెచ్‌ఎస్ ప్రణయ్ 21-6, 21-19తో 13వ ర్యాంకర్ చో తిన్ చెన్ (చైనీస్ తైపీ)ని కంగుతినిపించి రెండోరౌండ్లో ప్రియాన్షు రజావత్‌తో పోరుకు సిద్ధమయ్యాడు. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ, రీతూపర్ణ పండా-శ్వేతాపర్ణ పండా జోడీలు ఆరంభ రౌండ్లోనే ఓటమిపాలయ్యారు.

టార్గెట్.. క్లీన్‌స్వీప్

అఫ్ఘాన్‌తో భారత్ ఆఖరి టీ20 నేడు
రాత్రి 7 గం. నుంచి స్పోర్ట్స్18లో..


టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌లో కోహ్లీ, రింకూతో పంత్

బెంగళూరు: వరుసగా రెండు ఏకపక్ష విజయాలతో ఇప్పటికే సిరీస్ దక్కించుకున్న టీమిండియా ఇక క్లీన్‌స్వీప్‌పై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో బుధవారం అఫ్ఘానిస్థాన్‌తో ఆఖరి, మూడో టీ20లో తలపడనుంది. జూన్‌లో జరిగే టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు భారత జట్టుకిదే ఆఖరి మ్యాచ్. తొలి రెండు మ్యాచ్‌ల తరహాలోనే చివరిదైన మూడో టీ20లోనూ రోహిత్ సేన ఆరంభం నుంచే దూకుడుగా ఆడాలని భావిస్తోంది. మొహాలీలో 17.3 ఓవర్లలో 159, ఇండోర్‌లో 15.4 ఓవర్లలోనే 173 పరుగులను జట్టు ఛేదించగలిగింది. వెటరన్ కోహ్లీ సైతం ఇదే ఫార్ములాతో 16 బంతుల్లోనే 29 రన్స్‌తో టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాన్ని అనుసరించాడు. ఇక శివమ్ దూబే, జైస్వాల్‌ల మెరుపు ఇన్నింగ్స్ సిరీస్‌కు హైలైట్‌గా నిలుస్తోంది. కానీ కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం ఇప్పటివరకు పరుగుల ఖాతానే తెరువకపోవడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో సంజూ శాంసన్‌తో పాటు స్పిన్నర్ కుల్దీప్, పేసర్ అవేశ్‌లకు చోటు దక్కవచ్చు. అటు సిరీస్‌లో ఓదార్పు విజయం కోసం అఫ్ఘాన్ తపిస్తోంది. చిన్నస్వామి స్టేడియంలో ఓపెనర్ గుర్బాజ్ జట్టుకు భారీ స్కోరు అందించడంతో పాటు ఛేదించడంలోనూ కీలకం కానున్నాడు. స్పిన్నర్ ముజీబ్ ధారాళంగా పరుగులిచ్చుకున్నా భారత ఎడమచేతి బ్యాటర్లను దృష్టిలో ఉంచుకుని అతడినే కొనసాగించవచ్చు.

డీప్‌ఫేక్ బారిన సచిన్

న్యూఢిల్లీ: వివిధ రంగాల్లో ప్రముఖులను లక్ష్యంగా చేసుకుంటూ డీప్‌ఫేక్ మార్ఫింగ్ వీడియోలు ఇటీవలి కాలంలో నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూడా వీటి బారినపడ్డాడు. ఓ గేమింగ్ యాప్‌ను తాను ప్రమోట్ చేస్తున్నట్టు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతోంది. ఇది సచిన్ దృష్టికి రావడంతో ఆ వీడియోలో ఉన్నది తాను కాదని, ప్రభుత్వం ఈ విషయంలో చర్య తీసుకోవాలని సచిన్ కోరాడు.

బంగ్లా క్రికెటర్ నాసిర్ హుస్సేన్‌పై నిషేధం

దుబాయ్: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ నాసిర్ హుస్సేన్‌పై రెండేళ్లపాటు ఎలాంటి క్రికెట్ ఆడకుండా ఐసీసీ నిషేధం విధించింది. 2021, అబుదాబి టీ10 లీగ్‌లో నసీర్‌తో పాటు ఇతర ఆటగాళ్లు, అధికారులు, టీమ్ యజమానులతో సహా ఏడుగురు అవినీతికి పాల్పడ్డారని గతేడాది సెప్టెంబరులో ఐసీసీ ఆరోపించింది. తాజాగా తనపై ఆరోపణలను 32 ఏళ్ల హుస్సేన్ అంగీకరించడంతో నాసిర్‌పై వేటు పడింది. 2011-2018 మధ్య కాలంలో బంగ్లా తరఫున నాసిర్ మూడు ఫార్మాట్లలో కలిపి 115 మ్యాచ్‌లాడాడు.

తదుపరి తరం కొవిడ్ వ్యాక్సిన్ అభివృద్ధిపై బీఈ కసరత్తు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బయోలాజికల్-ఈ (బీఈ) తదుపరి తరం కొవిడ్-19 వ్యాక్సిన్ అభివృద్ధిపై కృషి చేస్తోంది. సార్స్-కొవ్-2 వైరస్ ఎక్స్‌బీబీ1.5 వేరియంట్‌కు సంబంధించిన వ్యాక్సిన్ అభివృద్ధి చేస్తున్నట్లు బీఈ వెల్లడించింది. ప్రీ క్లినికల్ అధ్యయనాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న వేరియంట్ల నుంచి ఈ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుందని బీఈ మేనేజింగ్ డైరెక్టర్ మహిమ దాట్ల తెలిపారు. భారత్‌లో క్లినికల్ ట్రయల్స్‌కు ఇటీవల సీడీఎస్‌సీఓ నుంచి బీఈ తుది అనుమతి తీసుకుంది. త్వరలో క్లినికల్ ట్రయల్స్‌ను కంపెనీ ప్రారంభించనుంది. కాగా, బీఈ చెందిన కొవిడ్ వ్యాక్సిన్ కోర్బెవ్యాక్స్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఎమర్జెన్సీ యూజ్ లిస్టింగ్‌లో చేర్చింది.

ఎయిర్ ట్యాక్సీలపై మారుత్ డ్రోన్స్, స్కైడ్రైవ్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో ఎయిర్ ట్యాక్సీల (ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ లాండింగ్-ఈవీటీఓఎల్) ద్వారా రవాణా సేవలు అందించడానికి మారుత్ డ్రోన్స్, జపాన్‌కు చెందిన స్కైడ్రైవ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పందం ప్రకారం మారుత్ డ్రోన్స్ ట్యాక్సీ విమానాల మార్గాలను గుర్తించడం, స్కైడ్రైవ్ కోసం నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేయడం చేస్తుంది. వీటితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, భాగస్వాములను సమకూర్చడం, ప్రభుత్వంతో సంప్రదించడం తద్వారా దేశంలో ట్యాక్సీ విమాన సేవలను అందించడానికి అవసరమైన చర్యలు చేపడుతుంది. స్కైడ్రైవ్ ఈవీటీఓఎల్‌లను ఫ్లైయింగ్ కార్లుగా వ్యవహరిస్తారు. బ్యాటరీతో పని చేసే ఎయిర్ ట్యాక్సీలను తక్కువ దూరం ప్రయాణానికి వినియోగిస్తారు. హెలికాప్టర్ సామర్థ్యాలను కలిగి ఉంటాయి. ఫిక్స్‌డ్ వింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ తరహాలో పని చేస్తాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,330 ▲	58,050 ▲	78,100 ▲
ముంబై	62,608 ▲	57,349 ▲	71,666 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ	
హైదరాబాద్	520
17 జనవరి	
చిత్తూరు	563
గోదావరి	530
విజయవాడ	530
విశాఖపట్నం	564
వరంగల్	522

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107
వరంగల్	107
కరీంనగర్	107
మహబూబ్‌నగర్	107
కర్నూలు	107
విశాఖపట్నం	101
గోదావరి	106
విజయవాడ	106
గుంటూరు	107
ఒంగోలు	107
చిత్తూరు	113

వచ్చే పదేళ్లలో ట్రిలియనీర్

గడిచిన మూడేళ్లలో ఐదుగురు ప్రపంచ కుబేరుల సంపద రెట్టింపు

» 500 కోట్ల మంది పేదరికంలోకి..
» ప్రపంచంలో ఆర్థిక అసమానతలపై డబ్ల్యూఈఎఫ్‌లో ఆక్స్‌ఫామ్ నివేదిక



దావోస్: ప్రపంచ టాప్ టెన్ కుబేరుల్లో ఐదుగురి సంపద గత మూడేళ్లలో రెట్టింపైందని.. ప్రస్తుత బిలియనీర్ల ప్రపంచం పదేళ్లలో తొలి ట్రిలియనీర్‌నూ చూడనుందని అంతర్జాతీయ చారిటీ సంస్థ ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక పేర్కొంది. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, కార్పొరేట్ల అర్థ బలంపై వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాల్లో ఈ రిపోర్టును విడుదల చేసింది. టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్, ఎల్‌వీఎంహెచ్ గ్రూప్ అధిపతి బెర్నార్డ్ అర్నో, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, ఒరాకిల్ ఫౌండర్ ల్యారీ ఎల్లిసన్, బెర్క్‌షైర్ హాత్‌వే చైర్మన్ వారెన్ బఫెట్‌ల మొత్తం సంపద 2020 మార్చిలో 40,500 కోట్ల డాలర్లుగా ఉండగా.. 2023 నవంబరు నాటికి 86,900 కోట్ల డాలర్లకు పెరిగిందని నివేదిక తెలిపింది. అంటే.. వీరి మొత్తం సంపద గంటకు 1.4 కోట్ల డాలర్ల చొప్పున పెరిగింది. కాగా, ఆర్థిక అంతరాలు వేగంగా పెరుగుతున్న ఈ దశాబ్దంలో దాదాపు 500 కోట్ల మంది పేదరికంలోకి జారుకున్నారని రిపోర్టు తెలిపింది. ప్రస్తుత ట్రెండ్‌ను బట్టి చూస్తే, వచ్చే దశాబ్ద కాలంలో ఎవరో ఒకరు ట్రిలియన్ డాలర్ల (లక్ష కోట్ల డాలర్లు) అధిపతిగా అవతరించవచ్చని.. ప్రపంచంలో పేదరిక నిర్మూలనకు మరో 229 ఏళ్లు పట్టవచ్చని ఆక్స్‌ఫామ్ అంటోంది. ప్రపంచంలో నం.1 ధనికుడు ఎలాన్ మస్క్ ప్రస్తుత సంపద 20,600 కోట్ల డాలర్లుగా ఉంది.

నివేదికలోని మరిన్ని విషయాలు..

ప్రపంచంలోని టాప్ టెన్ కంపెనీల్లో ఏడింటి సీఈఓ లేదా ప్రధాన షేర్‌హోల్డర్ బిలియనీర్ (కనీసం 100 కోట్ల డాలర్ల ఆస్తి కలిగిన వారు)గా ఉన్నారు. ఈ కంపెనీల మొత్తం విలువ 10.2 లక్షల కోట్ల డాలర్లు. అనగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలన్నింటి జీడీపీ కంటే అధికం.

ప్రపంచంలోని 148 అతిపెద్ద కార్పొరేట్ కంపెనీలు మొత్తం 1.8 లక్షల కోట్ల డాలర్ల లాభాలు ఆర్జించాయి. వీటి లాభాల మూడేళ్ల సగటు 52 శాతం పెరిగింది. ఈ కంపెనీలు తమ వాటాదారులకు భారీగా రిటర్నులు పంచిపెట్టాయి. కానీ, ప్రపంచంలో కోట్లాది మంది ఉద్యోగుల జీతాలు మాత్రం పెరిగిన ధరలు, వ్యయ భారాలకు అనుగుణంగా పెరగలేదు.

ప్రపంచ జనాభాలో కేవలం 21 శాతం కలిగిన ఉత్తర ధనిక దేశాల చేతుల్లోనే 69 శాతం సంపద ఉంది. ప్రపంచ బిలియనీర్లలో 74 శాతం ఈ దేశాలకు చెందినవారే.

వడ్డీలపై నిషేధం

ఏప్రిల్ 1 నుంచి బ్యాంకుల జరిమానా

ముంబై: బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఆదాయం పెంచుకునేందుకు రుణగ్రహీతలపై జరిమానా వడ్డీలు విధించకుండా ఆర్‌బీఐ నిషేధం విధించింది. రుణ చెల్లింపుల్లో విఫలమైన వారి నుంచి సముచిత స్థాయిలో జరిమానా రుసుము వసూలు చేసేందుకు మాత్రం అవకాశమిచ్చింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి కొత్త నిబంధనల అమలు చేయాలని తొలుత ఆదేశించిన ఆర్‌బీఐ.. తాజాగా మరో మూడు నెలల గడువిచ్చింది. అంటే ఈ ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. "రుణ కాంట్రాక్టు షరతులు, నియమావళికి రుణగ్రహీత కట్టుబడని పక్షంలో విధించే పెనాల్టీని జరిమానా రుసుముగా పరిగణించాలి. అంతేతప్ప ఆ రుణం వడ్డీ రేటుకు జత చేసే జరిమానా వడ్డీ రూపంలో విధించకూడదని గత ఏడాది ఆగస్టు 18న విడుదల చేసిన సవరించిన నిబంధనల నోటిఫికేషన్‌లో ఆర్‌బీఐ స్పష్టం చేసింది. "జరిమానా రుసుము కూడా సహేతుకంగా, పాటించని నిబంధనకు అనుగుణ స్థాయిలో, నిష్పక్షపాతంగా ఉండాలి. అంతేకాదు, ఈ రుసుము ఆదాయం పెంచుకునే మార్గం కాకూడదు. ఆ చార్జీపై వడ్డీ విధించకూడదని" కూడా పేర్కొంది. అయితే, క్రెడిట్ కార్డులు, విదేశీ కరెన్సీలో జారీ చేసే వాణిజ్య రుణాలు (ఈసీబీ), ట్రేడ్ క్రెడిట్స్, స్ట్రక్చర్డ్ ఆబ్లిగేషన్స్‌కు మాత్రం ఈ ఆదేశాలు వర్తించవని ఆర్‌బీఐ వెల్లడించింది.

బీఓఎం లాభం 1,036 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1,036 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం 34 శాతం (రూ.775 కోట్లు) వృద్ధి చెందింది. వడ్డీ ఆదాయం పెరగటం, మొండి బకాయిలు (ఎన్‌పీఏ) తగ్గుముఖం పట్టడం ఎంతగానో కలిసివచ్చిందని పేర్కొంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.4,770 కోట్ల నుంచి రూ.5,851 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.1,980 కోట్ల నుంచి రూ.2,466 కోట్లకు పెరిగింది.

మారుతి కార్ల ధరలు పెంపు

న్యూఢిల్లీ : తమ కార్ల ధరలు సగటున 0.45 శాతం పెంచినట్టు మారుతి సుజుకీ ప్రకటించింది. ఈ పెంపు తక్షణం అమలులోకి వచ్చింది. రూ.3.54 లక్షల విలువ గల ఆల్టో నుంచి రూ.28.42 లక్షల విలువ గల ఇన్విక్టో వరకు పలు మోడల్ కార్లను మారుతి విక్రయిస్తోంది.

ఈ ఏడాది అమ్మకాల్లో 65%ఎస్‌యూవీలే

హ్యుండయ్ మోటార్స్ అంచనా
మార్కెట్లోకి సరికొత్త క్రెటా
ప్రారంభ ధర రూ.10.99 లక్షలు



న్యూఢిల్లీ: హ్యుండయ్ మోటార్స్ ఈ ఏడాది అమ్మకాల్లో 65 శాతం ఎస్‌యూవీలే ఉంటాయని భావిస్తోంది. అలాగే 2030 నాటికి మొత్తం విక్రయాల్లో విద్యుత్ కార్ల వాటా 20 శాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2023లో మొత్తం అమ్మకాల్లో ఎస్‌యూవీ విక్రయాలు 60 శాతానికి చేరాయని కంపెనీ సీఓఓ తరుణ్ గార్గ్.. మిడ్‌సైజ్ ఎస్‌యూవీ క్రెటా కొత్త వెర్షన్‌ను మార్కెట్లో విడుదల చేసిన సందర్భంగా మంగళవారం చెప్పారు. ఎస్‌యూవీ క్రెటా కొత్త వెర్షన్ కారు ధర రూ.10.99 లక్షల నుంచి రూ.19.99 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి. కాగా హ్యుండయ్ మోటార్స్ మహారాష్ట్రలోని తాలేగావ్ ప్లాంట్‌లో రూ.7000 కోట్లు పెట్టుబడులు పెడుతుందన్న వ్యాఖ్యలపై స్పందించడానికి గార్గ్ నిరాకరించారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో 34% వృద్ధి

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికర లాభం 34 శాతం వృద్ధి చెంది రూ.16,373 కోట్లుగా నమోదైంది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.12,259 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.51,208 కోట్ల నుంచి రూ.81,720 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ స్థూల ఎన్‌పీఏలు 1.23 శాతం నుంచి 1.26 శాతానికి పెరగగా నికర ఎన్‌పీఏలు కూడా 0.33 శాతం నుంచి 0.31 శాతానికి తగ్గాయి.

తగ్గినా.. 73,000 పైనే సెన్సెక్స్

మార్కెట్లో 5 రోజుల ర్యాలీకి తెర.. సరికొత్త రికార్డు స్థాయిల నుంచి నష్టాల్లోకి ఈక్విటీ సూచీలు

ముంబై: భారత స్టాక్ మార్కెట్లో ఐదు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. మంగళవారం ఆరంభ నష్టాల నుంచి తేరుకుని సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించిన ప్రామాణిక సూచీలు.. మధ్యాహ్నం నుంచి మళ్లీ నష్టాల్లోకి మళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో మదుపరులు ఐటీ, ఆయిల్ రంగ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. ఒక దశలో సెన్సెక్స్ 73,427.59 వద్ద, నిఫ్టీ 22,124.15 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డులను నమోదు చేయగలిగినప్పటికీ.. ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 199.17 పాయింట్ల నష్టంతో 73,128.77 వద్ద, నిఫ్టీ 65.15 పాయింట్లు కోల్పోయి 22,032.30 వద్ద స్థిరపడ్డాయి.

కాగా, సోమవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 760 పాయింట్ల వృద్ధితో 73,000, నిఫ్టీ 203 పాయింట్ల లాభంతో 22,000 స్థాయిలను తొలిసారిగా అధిగమించాయి.

జ్యోతి సీఎన్‌సీ లిస్టింగ్ హిట్: గతవారంలో ఐపీఓ ముగించుకున్న జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.331తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 12.38 శాతం ప్రీమియంతో రూ.372 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో మరింత ఎగబాకిన షేరు తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 30.86 శాతం లాభంతో రూ.433.15 వద్ద స్థిరపడింది.

యూబీఐ.. రూ.లక్ష కోట్లు: ప్రభుత్వ రంగానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) షేరు మంగళవారం 1.34 శాతం ఎగబాకి రూ.135.90 వద్దకు చేరుకుంది. దాంతో యూబీఐ మార్కెట్ విలువ తొలిసారిగా రూ.లక్ష కోట్ల మైలురాయిని దాటింది. తద్వారా యూబీఐ రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాప్ కలిగిన నాలుగో ప్రభుత్వ రంగ బ్యాంకుగా అవతరించింది.

19 నుంచి ఈప్యాక్ డ్యూరబుల్స్ ఐపీఓ: ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 19న ప్రారంభమై 23న ముగియనుంది. ఇష్యూ ధర శ్రేణిని కంపెనీ రూ.218-230గా నిర్ణయించింది.

ఎల్ఐసీ షేరు @ రూ.900

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ షేరు ఇంట్రాడేలో 5.30% పెరిగి రూ.900 స్థాయి వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. 2022 మే 17న కంపెనీ షేరు స్టాక్ మార్కెట్లో లిస్టయ్యాక రూ.900 స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఐపీఓ ధర రూ.949తో పోలిస్తే.. బాగా తక్కువ స్థాయిలో రూ.875.25 వద్ద లిస్టయిన షేరు.. ఆ తర్వాత రోజుల్లో మరింత క్షీణిస్తూ వచ్చింది. 2023 మార్చిలో ఆల్‌టైం కనిష్ఠ స్థాయి రూ.530 వద్దకు పతనమైంది. కానీ, ఆ తర్వాత నుంచి షేరు ధర క్రమంగా పుంజుకుంది. గత నవంబరులో 12.83%, డిసెంబరులో 22% పైగా వృద్ధి చెందింది. గడిచిన రెండున్నర నెలల్లో మార్కెట్ విలువ రూ.1.84 లక్షల కోట్లు పెరిగి ప్రస్తుతం రూ.5.64 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది.

వారం రోజుల్లో తెలంగాణ భవన్‌కు కేసీఆర్!

» బీఆర్ఎస్ పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశంలో పాల్గొనే అవకాశం



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలోనే తెలంగాణ భవన్‌కు రానున్నారు. అది కూడా ఈ వారం రోజుల్లోనే ఆయన వచ్చే అవకాశాలున్నాయని సమాచారం. ప్రస్తుతానికి పార్టీ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి సమావేశాలను తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్నారు. రోజుకో ఎంపీ స్థానం చొప్పున ఇప్పటి వరకు నిర్వహించిన ఈ సమావేశాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీశ్‌రావులు హాజరవుతున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. వీటిల్లో ఏదో ఒక సమావేశానికి కేసీఆర్ హాజరయ్యే అవకాశాలున్నాయి. ఆయన హాజరయ్యే రోజున జరగనున్న పార్లమెంటు నియోజకవర్గ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు, ముఖ్య నేతలతో మాట్లాడనున్నారని తెలిసింది. ఇందుకు అనుగుణంగా తెలంగాణ భవన్‌లోని వేదికను కూడా సిద్ధం చేస్తున్నారు. వేదిక మీదకు వీల్‌చైర్ కూడా ఎక్కేందుకు వీలుగా చిన్న ర్యాంప్‌ను నిర్మిస్తున్నారు. మొత్తం 17 పార్లమెంటు నియోజకవర్గాలకు గాను ఇప్పటికే 10 నియోజకవర్గాల సమావేశాలు పూర్తయ్యాయి. మంగళవారం జరగాల్సిన నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ సమావేశాన్ని కనుమ పండుగ సందర్భంగా వాయిదా వేసి ఈ నెల 22న నిర్వహించాలని నిర్ణయించారు. అదే చివరి పార్లమెంటు స్థానం సమావేశం కానుంది. ఏదో ఒక సమావేశానికి కేసీఆర్ హాజరయ్యే అవకాశాలున్నాయని తెలుస్తోంది. కేసీఆర్ ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌లోని బాత్‌రూమ్‌లో కాలుజారి పడడంతో ఆయనకు తుంటి ఎముక మార్పిడి శస్త్ర చికిత్స చేసిన విషయం తెలిసిందే.

విచారణకు రండి.. కుదరదు!



» ఒక్క రోజు గడువుతో పిలిచిన ఈడీ

» కుదరదని చెప్పిన ఎమ్మెల్సీ కవిత

» ఢిల్లీ మద్యం కేసులో మళ్లీ కదలిక

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి పిలిచింది. మంగళవారం విచారణకు హాజరు కావాలంటూ సోమవారం నోటీసులు జారీ చేసింది. అయితే, మంగళవారం ముందే నిర్ణయించుకున్న కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందని, ఒక రోజే గడువు ఇచ్చి పిలవడం వల్ల హాజరు కాలేక పోతున్నానని కవిత ఈమెయిల్ ద్వారా ఈడీకి సమాధానం ఇచ్చారు. మద్యం విధానం కేసులో గతంలోనూ ఈడీ కవితకు నోటీస్‌లు ఇచ్చింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గత ఏడాది మార్చిలో కవితను ఈడీ అధికారులు ఢిల్లీ కార్యాలయంలో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా విచారించారు. విచారణలో భాగంగా అధికారుల ఆదేశాల మేరకు గతంలో తాను ఉపయోగించిన సెల్‌ఫోన్లను కవిత అధికారులకు అప్పగించారు. ఈడీ కార్యాలయం వద్ద కాకుండా మహిళను ఇంటి వద్దే విచారించాలని కోరుతూ కవిత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కవిత పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు రాక ముందే ఈడీ అధికారులు గత సెప్టెంబరులో మరోసారి ఆమెకు నోటీస్‌లు జారీ చేశారు. దీంతో నవంబరు వరకు కవితను విచారణకు పిలవరాదని కోర్టు ఆదేశించింది. ఇంతలో తెలంగాణ శాసనసభ ఎన్నికలు రావడంతో ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ విచారణ వెనక్కు వెళ్లింది. ఇప్పుడు మరోసారి నోటీస్‌లు జారీ చేసిన ఈడీ కేవలం ఒక్క రోజు మాత్రమే గడువు ఇచ్చింది. విషయం కోర్టు పరిధిలో ఉన్నందున తాను విచారణకు హాజరు కాలేనని కవిత ఈడీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ముందుగా షెడ్యూల్ అయిన కార్యక్రమాలు ఉన్నందున విచారణకు హాజరయ్యే పరిస్థితి లేదని అధికారులకు ఈ-మెయిల్‌లో కవిత సమాచారం ఇచ్చారు. విచారణకు హాజరు కాలేనన్న కవిత సమాధానంపై ఈడీ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఈడీ తదుపరి చర్యలు ఎలా ఉంటాయనే దానిపై ఆసక్తి నెలకొంది. మరోసారి ఆమెకు నోటీస్‌లు జారీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

మంచి ఫలితాలే ధ్యేయంగా పనిచేయండి

» కాంగ్రెస్ నేతలకు దీపాదాస్ మున్షీ సూచన

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడమే ధ్యేయంగా పనిచేయాలని రాష్ట్ర నియోజకవర్గ నేతలకు కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సూచించారు. మంగళవారం గాంధీభవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాల పార్టీ మైనారిటీ నేతలతో ఆమె సమావేశమయ్యారు. ఆయా లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పార్టీ బలాలు, బలహీనతలను అంచనా వేసుకొని దానికనుగుణంగా తదుపరి కార్యాచరణను రూపొందించుకోవాలని వారికి దిశానిర్దేశం చేశారు. మైనారిటీలను పూర్తిగా కాంగ్రెస్ వైపునకు ఆకర్షించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం హైదరాబాద్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. కాగా, బుధవారం టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుందని సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రకటించారు.

రూ.2000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రూ.2000 కోట్ల అప్పు తీసుకుంది. మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలంలో సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి ఈ రుణాన్ని సేకరించింది. 7.60% వార్షిక వడ్డీ 19 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 7.60% వార్షిక వడ్డీ 23 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లు.. మొత్తం రూ.2,000 కోట్ల రుణం తీసుకున్నది. చివరి త్రైమాసికంలో రూ.9,000 కోట్ల అప్పు తీసుకునేందుకు తెలంగాణకు కేంద్రం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏపీ ప్రభుత్వంకూడా మంగళవారం 2,450 కోట్ల అప్పు తీసుకుంది.

ఇద్దరు సీనియర్లకు ఐఏఎస్‌లుగా పదోన్నతి

» ఐఎఫ్ఎస్ అధికారులిద్దరికి ప్రమోషన్

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో ఇద్దరు సీనియర్ అధికారులకు ఐఏఎస్‌లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ(డీవోపీటీ) అండర్ సెక్రటరీ సంజయ్‌కుమార్ చౌరాసియా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్లుగా పనిచేస్తున్న కె.సీతాలక్ష్మి, జి.ఫణీంద్రరెడ్డిలకు 'సెలెక్ట్ లిస్ట్-2022' కింద ఐఏఎస్‌లుగా పదోన్నతి(కన్‌ఫర్) కల్పించారు. 'నాన్ స్టేట్ సివిల్ సర్వీస్' కోటా కింద వీరిని తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు డీవోపీటీ తెలిపింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వీరిద్దరూ ప్రొబేషనరీ అధికారులుగా కొనసాగుతారు. మరోవైపు రాష్ట్రంలోని ఇద్దరు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్) అధికారులకు పదోన్నతి కల్పిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి ఎస్.శాంతారామ్, 2015 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి ప్రదీప్‌కుమార్‌లకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్(లెవెల్-12)గా పదోన్నతి కల్పించారు.

కూల్‌గా కబ్జా!

పర్యావరణ విధ్వంసం పరాకాష్ట

కొండపై విల్లాల మీదికి ఒక రోడ్డు.. చెరువు పక్కన వాకింగ్ ట్రాక్ మరో రోడ్డు



(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు కంపెనీ సొంత రోడ్డుగా మారుతోంది. ఈ క్రమంలో భారీ ఎత్తున పర్యావరణ విధ్వంసం జరుగుతోంది. దివ్యమైన భవనాలకు పేరొందిన ప్రముఖ నిర్మాణ సంస్థ రియాల్టీ ప్రాజెక్టు ఇది. హైదరాబాద్ నడిబొడ్డున బయో డైవర్సిటీ పార్క్ జంక్షన్‌కు కూతవేటు దూరంలో ఉంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే పలు ఐటీ టవర్లలో పలు దేశీ, విదేశీ కంపెనీలకు చెందిన వేల మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పని చేస్తున్నారు. ఈ టవర్లు 24 గంటలూ సందడిగా ఉంటాయి. టవర్లకు వెనుకనే కొండమీద ఈ సంస్థకే విల్లాల ప్రాజెక్టు కూడా ఉంది. ఆ రెండింటికీ కలిపి ఇప్పుడు ప్రభుత్వ భూమిలో అక్రమంగా కొత్త రోడ్డు వేస్తున్నారు. ఎవరు వేస్తున్నారో తెలీదు. ప్రభుత్వ శాఖలలో ఎవర్ని అడిగినా 'మేం అనుమతి ఇవ్వలేదు. మాకు సంబంధం లేదు' అంటున్నారు. నిజానికి ఈ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు ఓల్డ్ బాంబే హైవే మీద ఒక దారి ఉంది. ప్రకృతి రమణీయమైన చెరువు పక్క నుంచి మరో రోడ్డు కోసం గత ప్రభుత్వ హయాంలో పావులు కదిపారు. నిజానికి ఈ రోడ్డుకు సంబంధించిన అనుమతులేవీ రాలేదు. ప్రభుత్వంలోని ఏ శాఖ కూడా ఈ రోడ్డు పని చేపట్టడం లేదు. కానీ, ఎన్నికల కోడ్ మొదలైనప్పటి నుంచి శరవేగంగా పనులు జరుగుతున్నాయి. చుట్టూ ఉన్న రద్దీ రోడ్ల మీద వెళుతున్న లక్షల మంది ప్రజలకు కళ్లకు రోడ్డు పనులు కనిపిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు మాత్రం అసలు విషయమే తెలియనట్లు నటిస్తున్నారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధి అడిగినపుడు, "అవునా, పనులు జరుగుతున్నాయా? మాకు తెలీదు. మేమైతే అనుమతి ఇవ్వలేదు" అని తప్పించుకుంటున్నారు. జమానా మారినా గత ప్రభుత్వ హయాంలో వేళ్లూనుకున్న వ్యవస్థ చెక్కు చెదరకుండా పని చేస్తోందని ఖాజాగూడ పెద్ద చెరువును కాపాడేందుకు కృషి చేస్తున్న పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.

గత నాలుగేళ్లుగా పెద్ద చెరువు విధ్వంసం

చుట్టూ కొండలు... మధ్యలో చెరువు.... నగరం మధ్యలో ఖాజాగూడ పెద్ద చెరువు ఒక రహస్య ప్రదేశంలా ఉండేది. వర్షాకాలంలో కొండలు, గుట్టల నుంచి చెరువులోకి ఉరుకులు పెట్టే సెలయేళ్లతో ప్రకృతి రమణీయతకు నెలవుగా ఉండేది. ఇక్కడ వివిధ సర్వే నంబర్లలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమి ఉంది. 2020లో కరోనా సమయంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ మీదుగా ఓల్డ్ బాంబే హైవే నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూలుకు నేరుగా నాలుగు లేన్ల రోడ్డు వేశారు. దీనిచుట్టూ ఉన్న ప్రైవేటు భూముల్లో అనేక ఐకానిక్ టవర్లు వచ్చాయి. అటు కొండలు, ఇటు చెరువు, మధ్యలో రోడ్డుతో ఖాజాగూడ పెద్ద చెరువు ప్రాంతం నక్లెస్ రోడ్డు తరహాలో పర్యాటక ప్రదేశంగా మారిపోయింది. అర్ధరాత్రి వరకు పెద్దఎత్తున ఐటీ ఉద్యోగులు ఈ రోడ్డుపైనే పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం గమనించవచ్చు. ఐటీ కారిడార్‌లో ఆకాశాన్ని తాకే హర్మ్యాల మధ్య బయో డైవర్సిటీ జంక్షన్‌కు సమీపంలోనే పర్యావరణ సమతుల్యతను పాటించే విధంగా ఖాజాగూడ పెద్ద చెరువు, కొండలు గుట్టలుంటాయి. ఇలాంటి చోట పర్యావరణ విధ్వంసం సాగుతోంది. ఇప్పటికే సుందరీకరణ పేరుతో చెరువు చుట్టూ బండ్, వాకింగ్ ట్రాక్ నిర్మించి చెరువును కొంత పూడ్చేశారు. ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులు ఎన్నో ఏళ్ల చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్న కొండలు, గుట్టలను విల్లాల రోడ్డు కోసం తొలగిస్తున్నారు. అదంతా ప్రభుత్వ భూమేనని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. నెల రోజులుగా నిరాటంకంగా పనులు జరుగుతున్నా రెవెన్యూ, జీహెచ్ఎంసీ, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు మాట్లాడటం లేదు. పనులు ఆపే ప్రయత్నం చేయడం లేదు. కనీసం నోటీసులిచ్చేందుకు కూడా ముందుకు రావడం లేదు.

ప్రభుత్వ భూమిలో ప్రైవేటు పాగా

పెద్ద చెరువుకు తూర్పు వైపున కొండలను ఆనుకుని దివ్యమైన భవనాల రియాల్టీ కంపెనీకి పలు ఐటీ టవర్లు, గేటెడ్ కమ్యూనిటీ విల్లా ప్రాజెక్టు ఉన్నాయి. వాక్ టూ వర్క్ పేరుతో ఈ నిర్మాణాలు చేపట్టింది. వాటికి తూర్పున బాంబే హైవే నుంచి రోడ్డు ఉంది. వెనుక భాగాన కొంత వరకు ప్రభుత్వ భూమి, ఖాజాగూడ పెద్ద చెరువు శిఖం భూమి ఉన్నాయి. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న రోడ్డు గేటెడ్ కమ్యూనిటీ విల్లాలకు, ఐటీ కంపెనీకి వెనుక నుంచి ప్రత్యామ్నాయ మార్గం కోసమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాంతం రాయదుర్గం పాయగా రెవెన్యూ పరిధిలో ఉంది. ఇక్కడ సర్వే నెంబర్ 66లో 109 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని ధరణిలో నిషేధిత జాబితాలో ఉంచారు. 66/7, 66/8, 66/9, 66/10, 66/11 సర్వే నెంబర్లలో చెరువు, చెరువు శిఖం, కొండలు, గుట్టల రూపంలో ప్రభుత్వ భూమి ఉంది. ధరణి ప్రకారం ఈ భూమిని అమ్మడానికి వీల్లేదు. ఏడు ఎకరాల్లో అచ్చం కొండలే ఉన్నాయి. ఈ కొండలు గేటెడ్ విల్లాలు, ఐటీ టవర్లకు ఆనుకొని ఉంది. ఇప్పుడా ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. అందులో భాగంగానే తొలుత మూడు ఎకరాలను రోడ్డు పేరుతో ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. విగతా నాలుగు ఎకరాలూ ఏదో విధంగా తీసేసుకుంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బావమరిది చొరవతో

గత ప్రభుత్వంలో కీలక మంత్రికి బావమరిది కుటుంబం ఈ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు విల్లాల్లోనే నివాసం ఉంటోంది. అతని చొరవ వల్లే ప్రభుత్వ భూమిలో రోడ్డు వేయడానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల నుంచి పరోక్ష సహకారం అందుతోందన్న ఆరోపణ కూడా ఉంది. నిజానికి ఈ విల్లా ప్రాజెక్టుల మీదుగా గతంలో ఎయిర్‌పోర్టు మెట్రో రైలు ప్రాజెక్టు మంజూరైంది. దాంతోపాటు లింక్ రోడ్డు కూడా ప్లాన్ చేశారు. ఖాజాగూడ కొండలు హెరిటేజ్ సైట్ కావడంతో న్యాయ సమస్యలు ఉంటాయని గ్రహించి మెట్రో అధికారులు చెరువు పక్క నుంచి మెట్రో ఆలోచనను విరమించుకున్నారు. దాంతోనే లింకు రోడ్డు కూడా కనుమరుగైంది. ఇది ముందే గ్రహించిన ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వం ఉండగానే కనీసం రోడ్డునన్నా దక్కించుకుందామని పావులు కదిపారని అంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చీ రాగానే ప్రభుత్వ భూమిలో నుంచి కొండలు, గుట్టలను తొలిచేస్తూ రోడ్డు నిర్మాణ పనులు మొదలెట్టారు. ప్రముఖ నిర్మాణ సంస్థతో పాటు మాజీ మంత్రి బావమరిది కూడా కీలకంగా వ్యవహరించడం వల్లే అధికారులు మౌనంగా ఉంటున్నారని అంటున్నారు. రోడా విస్త్రీ కళాశాల నుంచి విల్లా ప్రాజెక్టు, ఐటీ టవర్ల రోడ్డును కలుపుతూ పనులు జరుగుతున్నాయి. చెరువు వద్ద ఏకంగా ఔట్ పోస్టు ఏర్పాటు చేసి ఎవర్నీ రోడ్డు పనులు జరిగే ప్రభుత్వ భూమి లోపలికి రానివ్వకుండా సాయుధులను నియమించారు. మీకేం పని అని అంటూ అటుగా వచ్చిన వాళ్లను గదమాయించి పంపేస్తున్నారు.

వాకింగ్ ట్రాక్ పేరుతో పూడ్చేశారు

ఖాజాగూడ పెద్ద చెరువు చుట్టూ జీహెచ్ఎంసీ, సాగునీటి శాఖ అధికారులు సుందరీకరణ పేరుతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. రోడా మిస్త్రీ కళాశాల నుంచి రెండు కిలోమీటర్ల పొడవున 30 అడగుల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం ఇప్పటికే పెద్ద ఎత్తున చెరువును పూడ్చేశారు. ఫుల్ ట్యాంక్ లెవల్ ప్రకారం ఖాజాగూడ పెద్ద చెరువు విస్తీర్ణం 38 ఎకరాలు. రాళ్లు, మట్టి చుట్టురా పోయడంతో అది కుంచించుకుపోతోంది. దీనిపై ఇప్పటికే పలువురు పర్యావరణవేత్తలు ఆందోళన చేపట్టారు. కోర్టులను ఆశ్రయించారు.

ఏ శాఖ అనుమతి లేదు

ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతున్న చోట ఎకరం విలువ కనీసం రూ.150 కోట్లు ఉంటుంది. వంద అడుగుల రోడ్డు 400 మీటర్ల పొడవున నిర్మిస్తున్నారు. అంటే కనీసం మూడు ఎకరాలు. రూ.450 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి. పైగా హెరిటేజ్ విలువ కలిగిన కొండలను తవ్వేస్తున్నారు. ప్రైవేటు స్థలంలో చిన్న నిర్మాణం చేపట్టాలన్నా ప్రభుత్వ అనుమతులు అవసరం. ప్రయివేటు భూమిలో రోడ్డు వేయాలన్నా అనుమతి ఉండాలి. ఈ రోడ్డుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇది ప్రయివేటుదే అనుకున్నా రోడ్డుకు అనుమతి ఉండాల్సిందే. పర్యావరణ సమతుల్యాన్ని దెబ్బతీసే పనులకు అనుమతి విషయంలో మరింత జాగ్రత్త పాటించాలి. ఆ కోణంలో అధికారులెవరూ జోక్యం చేసుకోవడం లేదు. ప్రభుత్వ భూమిలో ఎలా రోడ్డు వేస్తారని కనీసం ప్రశ్నించి నోటీసులిచ్చే వారు కరువయ్యారు.

విల్లాలకు రోడ్డు వేస్తున్నారు

పెద్ద చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ లోపల వాకింగ్ ట్రాక్ పేరుతో ఇప్పటికే పూడ్చేశారు. దీనిపై హైకోర్టులో పిల్ వేశాను. హైకోర్టులో విచారణ సాగుతోంది. ఎన్నికల ముందు సర్వే చేసి హైకోర్టుకు నివేదిక కూడా ఇచ్చాను. దీనికి అదనంగా ఇప్పుడు రోడా మిస్త్రీ కాలేజీ నుంచి చెరువు లోపల భాగం నుంచి విల్లాల వైపు రోడ్డేస్తున్నారు. విల్లాలకు ఈ రోడ్డును అనుసంధానం చేస్తున్నారు. పెద్ద చెరువు వెంట వ్యక్తుల ప్రయోజనం కోసం సాగుతున్న విధ్వంసాన్ని వెంటనే ఆపాలి. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చెరువును కాపాడే విధంగా చర్యలు చేపట్టాలి.

- సోల్ కన్వీనర్ లుబ్నా సారవత్, పర్యావరణ ఉద్యమకారిణి

ఎవరికి భూమిని కేటాయించలేదు

ఖాజాగూడ పెద్ద చెరువును ఆనుకొని ఉన్న కొండల ప్రాంతంలో రోడ్డు నిర్మాణం కోసం ఎవరికి భూమిని సర్వే చేసి ఇవ్వలేదు. ఎవరికి భూమిని కేటాయించలేదు.

-మహేష్, సర్వేయర్, శేరిలింగంపల్లి మండలం.

మాకు సంబంధం లేదు

చెరువు, చెరువు శిఖం మాత్రమే మా పరిధిలోకి వస్తుంది. చెరువు పక్కన ఉన్న కొండ ప్రాంతంలో జరిగే ఇతర పనులతో మాకు సంబంధం లేదు. అక్కడ జరుగుతున్న రోడ్డు పనులు మా శాఖ పరిధిలోకి రావు.

- నాగరాజు, ఏఈ, ఇరిగేషన్ విభాగం

మాకెవరూ చెప్పలేదు

ఖాజాగూడ పెద్ద చెరువు పక్కన కొండలపై రోడ్డు నిర్మాణానికి సంబంధించి జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ భూసేకరణ విభాగానికి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదు. మేమైతే అక్కడ ఎలాంటి సర్వేలు చేపట్టలేదు. ఆ రోడ్డు మేం వేయడం లేదు.

-రవీందర్, సెక్షన్ ఇన్‌చార్జి, టౌన్ ప్లానింగ్ విభాగం, జీహెచ్ఎంసీ, సర్కిల్-20

రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు లేవు

హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పెద్ద చెరువు కొండలపై ఎలాంటి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టలేదు. ఆ ప్రాంతంలో అలాంటి ప్రతిపాదనలు ఏమీలేవు.

-విక్రమ్, డీఈ, హెచ్ఆర్‌డీసీ

ఏపీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల

న్యూఢిల్లీ, అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిలను ఏఐసీసీ నియమించింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఆమె నియామకం వెంటనే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. షర్మి



లకే ఏపీ పగ్గాలు అప్పగిస్తారని రెండు వారాల క్రితం డిసెంబరు 26న 'ఆంధ్రజ్యోతి' వెల్లడించిన విషయం తెలిసిందే. పీసీసీ అధ్యక్షురాలిగా మంగళవారం నియమితులైన తర్వాత ట్విటర్(ఎక్స్) వేదికగా షర్మిల స్పందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పునర్నిర్మాణానికి, పూర్వ వైభవానికి కృషి చేస్తానని ప్రకటించారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులతోనూ కలసిమెలసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పీసీసీని ఇప్పటివరకు నడిపించిన గిడుగు రుద్రరాజు సహా పార్టీ కీలకనేతలతో సమన్వయం చేసుకుంటూ, పార్టీ పటిష్ఠానికి కృషి చేస్తానని షర్మిల వెల్లడించారు. కాగా ఇప్పటివరకూ పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి ప్రత్యేక ఆహ్వానితునిగా నియమించారు. రుద్రరాజు పార్టీకి అందించిన సేవలకు ఖర్గే అభినందనలు తెలిపారు. కాగా, గిడుగు రుద్రరాజు సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. షర్మిల నియామకం ఖరారైనందువల్ల తనను రాజీనామా చేయాలని అధిష్ఠానం కోరిందని ఆయన వెల్లడించారు. షర్మిల నియామకంపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాకూర్ హర్షం వ్యక్తంచేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ బలోపేతమయినట్లే, షర్మిల కూడా పార్టీని బలోపేతం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

తొలి మహిళా చీఫ్

» పీసీసీ చీఫ్‌ల వారసుల్లో ఆ పదవికి ఎన్నికైన తొలి వ్యక్తి

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) 27వ అధ్యక్షురాలిగా నియమితులైన వైఎస్ షర్మిల పలు రాజకీయాంశాల్లో కొత్త చరిత్ర సృష్టించారు. ఆ పార్టీ రాష్ట్ర చరిత్రలో చాలా విషయాల్లో ఆమే ప్రథమురాలు. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిన నాటినుంచీ మహిళలు ఏపీ కాంగ్రెస్ పగ్గాలను ఇంతవరకు చేపట్టలేదు. ఈ అరుదైన ఘనత షర్మిల దక్కించుకున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టిన నేతల వారసులెవరూ ఆ పదవిని దక్కించుకోలేకపోయారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తెగా ఈ క్రెడిట్‌ను ఆమె సొంతం చేసుకున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 1983-85లో.. 1998-2000లోనూ రెండు దఫాలుగా పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. కాగా, కాంగ్రెస్ పార్టీలో ఏ పదవినీ చేపట్టకుండా, ఎన్నికల గోదాలోకి దిగకుండానే పీసీసీ పగ్గాలు షర్మిల చేపడుతుండటం మరో ఆసక్తికర అంశం. ఏపీలోని రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు అతివలే అధ్యక్షత వహించిన అరుదైన ఘట్టం ఆవిష్కృతం అవుతోంది. బీజేపీ రాష్ట్ర శాఖను ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి నడిపిస్తుండగా.. కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్‌ను త్వరలోనే షర్మిల తన చేతుల్లోకి తీసుకోనున్నారు.

మృతదేహాలెవరివి.. చంపిందెవరు?

» వికారాబాద్ జిల్లా పులుమద్ది శివారులో కాలిపోయిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యం

» రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లిలో యువకుడి మృతదేహం

వికారాబాద్, ఆదిభట్ల, జనవరి 16: వేర్వేరు చోట్ల అనుమానాస్పద స్థితిలో ఒకేరోజు రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఒకటి వికారాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో.. మరొకటి రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లి సమీపంలో లభ్యమయ్యాయి. మృతదేహాల్లో ఒకటి మహిళది. పొలంలో సగం కాలిన స్థితిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించిందంటూ వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామస్థులు సమాచారమివ్వడంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. హతురాలి వయసు 30-35 మధ్య ఉంటుందని.. అత్యాచారం చేసి చంపి.. మృతదేహంపై పెట్రోలు పోసి తగులబెట్టి ఉంటారని భావిస్తున్నారు. హతురాలి ఒంటిపై ఆకుపచ్చ రంగు చీర, అదే రంగు జాకెట్, గులాబీ రంగు పెట్టికోట్ ఉందని పోలీసులు వెల్లడించారు. ఇక రంగారెడ్డి జిల్లాలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించింది. ఆదిభట్ల పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో ఔటర్ బ్రిడ్జి కింద మూటగట్టి ఉన్న సంచీలో నుంచి దుర్వాసన వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.. పోలీసులొచ్చి పరిశీలించగా కుళ్లిపోయిన స్థితిలో యువకుడి మృతదేహం కనిపించింది. ఎక్కడో హత్య చేసి.. మూటగట్టి తెచ్చి పడేసి ఉంటారని భావిస్తున్నారు. హతుడి వయసు 35 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. మృతుడు కుడి కాలుకు నల్ల దారం, మెడలో రోల్డ్‌గోల్డ్ గొలుసు ఉన్నాయని వెల్లడించారు.

భార్య తల నరికేశాడు

» ఆమెపై అనుమానంతో భర్త కిరాతకం

» హైదరాబాద్ శివారులో దారుణ హత్య

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్‌లో మంగళవారం దారుణ హత్య జరిగింది. గృహ హింస కేసు పెట్టి వేధింపులకు గురి చేస్తోన్న భార్యపై అనుమానంతో రగిలిపోతున్న భర్త కిరాతకానికి పాల్పడ్డాడు. పథకం ప్రకారం భార్యను తన అక్క ఇంటికి తీసుకెళ్లి కత్తితో ఆమె పీక కోసేశాడు. తలను మొండం నుంచి వేరు చేసి ఘాతుకానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ లాల్‌గుడిబస్తీకి చెందిన కేదాల విజయ్‌కుమార్(36)కు పూరనాపూల్‌కు చెందిన పుష్పవతి(40)కి 2009లో వివాహమైంది. వీరికి గణేష్(13), బాల సరస్వతి(9) పిల్లలు ఉన్నారు. ఈ కుటుంబం రెండు నెలలుగా అబ్దుల్లాపూర్‌మెట్, జేఎన్ఎన్‌యూఆర్ఎం హౌసింగ్ కాలనీలోని ఓ ఫ్లాట్‌లో నివాసముంటోంది. గతంలో బ్యూటీషియన్‌గా పని చేసిన పుష్పవతికి ఇది రెండో పెళ్లి అని తెలిసింది. విజయ్ కుమార్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పుష్పవతి మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో విజయ్‌కుమార్‌పై గృహహింస కేసు పెట్టినట్లు సమాచారం. ఈ కేసు పేరుతో వేధింపులకు గురి చేస్తున్న భార్య ప్రవర్తనపై విజయ్ కుమార్ అనుమానం పెంచుకున్నాడు. దీంతో పుష్పవతిని హత్య చేయాలని నిర్ణయించుకుని పథకం వేశాడు. ఇందులో భాగంగా ఓ సూపర్ మార్కెట్‌లో పదునైన కత్తిని కొనుగోలు చేసి తన ఆటోలో దాచి పెట్టి సమయం కోసం ఎదురుచూశాడు. ఈ క్రమంలో అదే కాలనీలోని తన అక్క ఇంటిని శుభ్రం చేసి వద్దామని చెప్పి మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పుష్పవతిని తన ఆటోలో తీసుకెళ్లాడు. ఆ ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లిన విజయ్, పుష్పవతి వాగ్వాదానికి దిగగా సమీపంలోని ఫ్లాట్‌లో పని చేస్తున్న వాళ్లు వచ్చి వారించారు. ఆ తర్వాత కాసేపటికి విజయ్ కుమార్ తన వెంట తెచ్చుకున్న కత్తితో పుష్పవతి తల నరికేశాడు. రక్తం మరకలతో నిండిన దుస్తులతో బయటికి వచ్చిన విజయ్‌కుమార్‌ను అక్కడ ఓ వ్యక్తి అడ్డుకుని పోలీసులకు సమాచా రం ఇచ్చాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు ప్రారంభించారు.

లంచం ఇవ్వలేదని ఇల్లు కట్టుకోనివ్వట్లే

» బాసరలో వక్ఫ్ బోర్డు భూములు మింగేస్తున్నారు

» ప్రజావాణికి వేర్వేరు ఫిర్యాదులు.. మొత్తం 590 దరఖాస్తులు

» సంక్రాంతి నేపథ్యంలో తగ్గిన అర్జీల సంఖ్య

బేగంపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): లంచం ఇవ్వలేదని సర్పంచ్, పంచాయతీ సిబ్బంది మా ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారు... బాసర శివారులోని వక్ఫ్ బోర్డు భూములకు అక్రమంగా పట్టాలు చేసి అమ్మేస్తున్నారు... ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన కొన్ని ఫిర్యాదులు ఇవి. వీటితో పాటు వేర్వేరు సమస్యలకు సంబంధించి ప్రజావాణికి 578, ప్రజాపాలనకు 12 కలిసి మొత్తం 590 దరఖాస్తులు వచ్చాయి. రూ.1.50 లక్షల నగదు లేదా 60 గజాల స్థలం లంచం ఇవ్వలేదని తమ గ్రామ సర్పంచ్ తన ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్నారని అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన మైతారం సురేష్ నాయీ ప్రజావాణిలో ఫిర్యాదు



ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేసిన సురేశ్

చేశారు. ఈ దరఖాస్తును స్వీకరించి వివరాలు సేకరించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇక, నిర్మల్ జిల్లా బాసర శివారులో వక్ఫ్‌బోర్డుకు చెందిన 450 ఎకరాల భూములను కొందరు సిండికేట్‌గా ఏర్పడి పట్టా పాస్‌బుక్‌లు చేసి అమ్ముకుంటున్నారని బాసర మాజీ ఉప సర్పంచ్ సయ్యద్ ఖలీల్ ఫిర్యాదు చేశారు. ఇప్పటికే 270 ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని పేర్కొన్నారు. ఇక, గురుకుల కళాశాలు, పాఠశాలల్లో కొలువుల భర్తీకి 2023 ఆగస్టులో నిర్వహించిన పరీక్షల విడుదల చేసి నియామకాలు చేపట్టాలని కొందరు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, సంక్రాంతి పండుగ నేపథ్యంలో మంగళవారం ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గిందని అధికారులు తెలిపారు.

బీఈఈ దక్షిణాది మీడియా సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డి

» 'ప్రొ ప్లానెట్ పీపుల్' ప్రాజెక్టు అమలుపై బీఈఈ దృష్టి

» ప్రజలు ప్రకృతి సిద్ధమైన జీవనశైలిని అనుసరించేలా 'లైఫ్ మిషన్'

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) దక్షిణాది ప్రాంత మీడియా సలహాదారుగా ఎ.చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈఈఎస్ఎల్ దక్షిణాది మీడియా కో-ఆర్డినేటర్‌గా ఉన్న ఆయన సోమవారం హైదరాబాద్‌లో బీఈఈ దక్షిణాది మీడియా సలహాదారుగా బాధ్యతలు స్వీకరించారు. పర్యావరణ హితం కోసం ప్రధాన మంత్రి చేపట్టిన 'ప్రొ ప్లానెట్ పీపుల్' ప్రాజెక్టు అమలుపై బీఈఈ దృష్టి సారించింది. అందులో భాగంగానే దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కోసం ప్రత్యేకంగా మీడియా సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డిని నియమించింది. 2028 ఏడాది కల్లా ప్రజలంతా ప్రకృతిసిద్ధమైన జీవనశైలిని అనుసరించేలా 'లైఫ్ మిషన్' కార్యక్రమాలు అమలు చేయాలని బీఈఈ లక్ష్యంగా పెట్టుకుందని



ఎ.చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రపాలిత ప్రాంతాల్లోని విద్యుత్ సంస్థలు, ఇతర భాగస్వామ్యపక్షాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఇంధన సామర్థ్య లక్ష్యాలు సాధించాల్సి ఉందని ఆయన తెలిపారు. సామాజిక మాధ్యమాల వినియోగంతో పర్యావరణ హిత కార్యక్రమాలు చేపడుతూ స్థానికంగా 'లైఫ్ మిషన్' గ్రూపులను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. లైఫ్ మిషన్ అమలుకు హైదరాబాద్‌తో పాటు కాస్మోపాలిటన్ నగరాలపై బీఈఈ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడం, జీవన ప్రమాణాల నాణ్యతను మెరుగుపరచడం, సుస్థిరమైన భవిష్యత్తుకు బాటలు వేసేలా ఈ మిషన్‌ను అమలు చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందిని ప్రొ ప్లానెట్ పీపుల్‌గా మార్చాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు.



జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జైపాల్‌రెడ్డి పేరు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- తెలంగాణ ఏర్పాటులో జైపాల్ రెడ్డిది కీలక పాత్ర: గుత్తా

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి దివంగత కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి పేరు పెట్టేందుకు ప్రభుత్వంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. జైపాల్‌రెడ్డి 82వ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని స్ఫూర్తిస్థల్‌లో మంగళవారం నివాళి అర్పించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డి పాటించిన విలువలు, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశానికి చేసిన సేవలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో పోషించిన క్రియాశీలక పాత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు.. పాఠ్యపుస్తకాల్లో ఒక పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఉన్నదన్నారు. జైపాల్‌రెడ్డి జీవిత చరిత్ర గూర్చి తెలిసేలా.. స్ఫూర్తిస్థల్ వద్ద మ్యూజియం గానీ, గ్రంథాలయం గానీ ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని కోమటిరెడ్డి తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో జైపాల్ రెడ్డి పాత్ర కీలకమైందని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. స్ఫూర్తిస్థల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ జైపాల్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు.

యూరియా కొరత లేకుండా చూడండి

- అధికారులకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌కు రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వ్యవసాయ, చేనేత, మైనింగ్ శాఖలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో అధికంగా ఉత్పత్తి అవుతున్న వరి ధాన్యాన్ని ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక నివేదిక తయారు చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో గ్రావెల్, బైరటీస్ తవ్వకాలు అక్రమంగా జరిగిన నేపథ్యంలో.. సమగ్ర నివేదిక ఇవ్వాలని, మైనింగ్ మాఫియాను అరికట్టాలని, దోషులు ఎవరైనా శిక్షించాలని తుమ్మల అధికారులను ఆదేశించారు.

వెంటిలేటర్‌పై తమ్మినేని.. పరిస్థితి విషమం

- ఉదయాన్నే గుండెపోటు.. ఖమ్మంలో వైద్యం
- అనంతరం హైదరాబాద్ ఏఐజీకి తరలింపు

హైదరాబాద్/సిటీ/ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గుండెపోటుకు గురయ్యారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి నుంచి ఖమ్మంలో ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఉదయం గుండె నిపుణుల సూచనల మేరకు ఆయన్ను వెంటిలేటర్ సపోర్టుతో హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌కు తరలించారు. ఆయన గుండె అసాధారణ స్థాయిలో కొట్టుకుంటోందని, మూత్రపిండాలు పనిచేయకపోవడం వల్ల ఊపిరితిత్తులలో ద్రవం చేరడంతో ఇన్వేసివ్ వెంటిలేషన్ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని ఆస్పత్రి వర్గాలు నేడొక ప్రకటనలో పేర్కొన్నాయి. క్రిటికల్ కేర్ నిపుణులు, కార్డియాలజిస్టులు, ఎలక్ట్రోఫిజియాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు, పల్మోనాలజిస్టులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందంతో పాటు డాక్టర్ సోమరాజు, డాక్టర్ డీఎన్ కుమార్ మార్గదర్శకత్వంలో ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. తమ్మినేని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారని, ఆయన ఆరోగ్యం గురించి ఆందోళన అవసరం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ నేడొక ప్రకటనలో పేర్కొంది. పార్టీ నాయకులు, సానుభూతిపరులు ఆసుపత్రి వద్దకు రావొద్దని, వైద్యులకు సహకరించాలని కోరింది. కాగా, ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ్మినేని వీరభద్రంను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మంగళవారం పరామర్శించారు. తమ్మినేని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తమ్మినేని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

స్టార్టప్స్‌లో తెలంగాణ టాప్ పర్ఫార్మర్

- నాలుగు కంపెనీలకు ఉత్తమ స్టార్టప్ అవార్డులు
- ప్రదానం చేసిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్

హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్టార్టప్ అవార్డుల్లో తెలంగాణ సత్తా చాటింది. నేషనల్ స్టార్టప్‌డే సందర్భంగా డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి పియూష్ గోయల్ అవార్డులు అందించారు. బెస్ట్ పర్ఫార్మర్స్, టాప్ పర్ఫార్మర్స్, లీడర్స్, అస్పైరింగ్ లీడర్స్, ఎమర్జింగ్ స్టార్టప్ ఏకోసిస్టం వంటి ఐదు విభాగాల్లో అవార్డులు అందించారు. 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో స్టార్టప్ ఏకోసిస్టం ఆధారంగా పురస్కారాలు ప్రకటించగా.. గుజరాత్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు బెస్ట్ పర్ఫార్మర్స్‌గా నిలిచాయి. మహారాష్ట్ర, ఒరిస్సా, పంజాబ్, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్‌తోపాటు తెలంగాణ టాప్ పర్ఫార్మర్స్‌గా ద్వితీయ స్థానంలో నిలిచాయి. జాతీయ స్థాయిలో 20 స్టార్టప్ కంపెనీలకు ఉత్తమ స్టార్టప్ అవార్డులు అందించగా... తెలంగాణలో నాలుగు కంపెనీలకు ఈ అవార్డులు దక్కాయి. టిహబ్ సీఈవో శ్రీనివాస్, టిఎస్ఐసి సీఐవో శాంత తౌటం ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

ఆయుధ కర్మాగారంలో కేంద్ర మంత్రి పర్యటన

- కొత్త టెక్నాలజీతో యుద్ధ ట్యాంకుల తయారీకి అజయ్‌భట్ పిలుపు



సంగారెడ్డి రూరల్, జనవరి 16: అత్యాధునిక సాంకేతికతతో యుద్ధ ట్యాంకులను మరింత శక్తిమంతంగా రూపొందించాలని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఆయుధ కర్మాగారం(ఓడీఎఫ్)లో మంగళవారం ఆయన పర్యటించారు. ఓడీఎఫ్‌లోనే తయారు చేసిన బీఎంపీ సారథ్ యుద్ధ ట్యాంకుపై కూర్చొని, సిబ్బందితో కలిసి సరదాగా ప్రయాణించారు. ఈ సందర్భంగా అజయ్‌భట్ మాట్లాడుతూ.. దేశ రక్షణలో ఓడీఎఫ్ కర్మాగారం చేస్తున్న కృషి ఎంతో గొప్పదని, మారుతున్న కాలానికనుగుణంగా కొత్త టెక్నాలజీని జోడించి సరికొత్త యుద్ధ ట్యాంకులను రూపొందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ సీజీఎం సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజుల్లో 60 భేటీలు

(మొదటిపేజీ తరువాయి)

సంరక్షణపై సలహాలను కోరారు. తొలిరోజు సదస్సు సందర్భంగా డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడు బోర్గ్ బ్రెండ్, ఇతర నిర్వాహకులతో రేవంత్ భేటీ అయ్యారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వారితో చర్చించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వ ప్రాధాన్యాలను వారికి వివరించారు. ఇథియోపియా ఉప ప్రధాని డెమెక్ హసెంటోతో జరిగిన సమావేశంలో పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంచుకున్న రూట్‌మ్యాప్‌ను వివరించారు. ప్రభుత్వాలతో పాటు పారిశ్రామికవేత్తలు, వ్యాపార వాణిజ్య వాటాదారులు కలిసికట్టుగా పనిచేస్తే.. ప్రజలు సంపన్నులవుతారని, రాష్ట్రంలో సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని రేవంత్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. సీఎం నిర్వహించిన వరుస భేటీల్లో ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్, ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్స్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ

నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్(నాస్కామ్) అధ్యక్షుడు దేబ్జానీ ఘోష్‌తో రేవంత్ సమావేశమై.. రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణ అందించే అంశంపై చర్చించారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇతర డిగ్రీ కోర్సుల్లో ఉన్న యువత చదువు పూర్తయ్యేలోపే వారికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అందించాల్సిన నైపుణ్యాభివృద్ధిపై సహకరించాలని నాస్కామ్‌ను కోరారు. ఈ విషయంలో నాస్కామ్ ముందుకొస్తే.. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. దావోస్ అంతర్జాతీయ వేదికపై తెలంగాణకు అరుదైన అవకాశం దక్కింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్(సీ4ఐఆర్) కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు డబ్ల్యూఈఎఫ్, తెలంగాణ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదిరింది. దీనికి సంబంధించి సదస్సు అధ్యక్షుడు బోర్గ్ బ్రెండ్, సీఎం రేవంత్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 28న హైదరాబాద్‌లో జరగనున్న సదస్సులో ఈ సెంటర్ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా సీఎం సారథ్యంలో రాష్ట్ర ఆరోగ్య సంరక్షణను మెరుగుపరిచే స్టేట్ హెల్త్‌టెక్ ల్యాండ్‌స్కేప్ సాంకేతిక ఆధారిత కార్యక్రమం రూపుదిద్దుకోనుంది. రాష్ట్రంలో ఆరోగ్యం, పారిశ్రామికరంగాన్ని బలోపేతం చేసేందుకు, విదేశీ పరిశ్రమలను ఆకర్షించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు ప్రపంచానికి చాటిచెప్పేందుకు 'ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ' నినాదంతో 'వేర్ ట్రెడిషన్ మీట్స్ ఇన్నోవేషన్' ట్యాగ్‌లైన్‌తో డబ్ల్యూఈఎఫ్‌లో ఏర్పాటుచేసిన తెలంగాణ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా రూపొందించిన పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ చారిత్రక వారసత్వ సంపదకు చిహ్నంగా నిలిచిన చార్మినార్, బతుకమ్మ, బోనాల పండుగలు, కళాకారుల ఖ్యాతిని ప్రపంచానికి చాటిన చేర్యాల పెయింటింగ్, పోచంపల్లి ఇక్కత్, ఐటీ, సాంకేతిక ఆవిష్కరణల కొత్త సౌధం టీ-హబ్‌తోపాటు వివిధ రంగాల విశేషాలతో రూపొందించిన చిత్రాలు చూపరులను కట్టిపారేస్తున్నాయి. వివిధ దేశాల రాజకీయ దిగ్గజాలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్‌రెడ్డి ఇందులోనే సమావేశమవుతున్నారు.

నేను ఒరిజినల్.. కేటీఆర్ డూప్లికేట్!

ఇంకో ఏడాదిలో స్పష్టంగా తెలిసి వస్తుంది.. హైదరాబాద్‌కు మరే నగరం సాటి రాదు: సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంటుందని, 14 ఎంపీ స్థానాలను తాము గెలవనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లోలాగే ఈసారి కూడా బీజేపీ మూడో స్థానానికి పరిమితమవుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది తామేనని బీజేపీ ప్రచారం చేసుకున్నదని, ఈసారి కూడా ఆ పార్టీ ఉధృతంగా ప్రచారం చేసుకున్నా ఫలితాల్లో తేడా ఏమీ ఉండదని పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం ఓ ఆంగ్ల మీడియా సంస్థ ప్రతినిధితో మాట్లాడారు. 'దావోస్ సదస్సుకు తెలంగాణ తరఫున ఇంతకు ముందు కేటీఆర్ వచ్చేవారు. ఈ ఏడాది మీరు వచ్చారు' అని సదరు ప్రతినిధి ప్రస్తావించగా.. తాను ఒరిజినల్, కేటీఆర్ డూప్లికేట్ అన్న అర్థం వచ్చేలా.. ఒరిజనల్‌కు, డూప్లికేట్‌కు మధ్య పోటీ లేదని సీఎం సరదాగా వ్యాఖ్యానించారు. ఎవరు ఒరిజనల్, ఎవరు డూప్లికేటో ఇంకో ఏడాదిలో తేలుతుందని చెప్పారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన రాజకీయ క్రీడ ముగిసిందని, ఇక రాష్ట్రాభివృద్ధిపైనే దృష్టి పెడతామని స్పష్టం చేశారు.

10-12 చోట్ల ఫార్మా గ్రామాలు

భారత్‌లో ఏ రాష్ట్రంతో తెలంగాణ పోటీ పడుతుంది అని ప్రశ్నించగా... 'మేం ప్రపంచంతోనే పోటీపడతాం. ఇతర రాష్ట్రాలతో కాదు' అని రేవంత్ బదులిచ్చారు. తాను గతంలో చెప్పినట్లు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు ఒక స్థాయి అభివృద్ధి, ఓఆర్ఆర్ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్య మరో దశ అభివృద్ధి, ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఇంకో దశ అభివృద్ధి ఉంటుందని, దీని కోసం మూడు కేటగిరీల ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తామన్నారు. దేశంలో హైదరాబాద్ నగరానికి మరే నగరం సాటిరాదని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడానికి హైదరాబాద్‌కు, తెలంగాణకు అనేక అనుకూలతలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 10-12 చోట్ల ఫార్మా గ్రామాలు ఏర్పాటు చేస్తామని



దావోస్‌లో పారిశ్రామికవేత్తలతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి

తెలిపారు. హైదరాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మొదలు కాలేదని.. ఆ రంగం అభివృద్ధిలో పలువురి పాత్ర ఉందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హైటెక్ సిటీ నిర్మాణానికి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని, చంద్రబాబు, వైఎస్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల హయాంలో ఐటీతోపాటు ఫార్మా రంగం బాగా అభివృద్ధి చెందాయన్నారు. హైదరాబాద్ నగరానికి మరే నగరంతో పోటీ లేదని, ఖుతుబ్‌షాహీలు, నిజాంల నుంచి ఎందరో పాలకులు హైదరాబాద్ అభివృద్ధికి ఎంతో చేశారని రేవంత్ వివరించారు. పరిపాలనలో తన ప్రాధాన్యాల గురించి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ.. '20 ఏళ్ల ప్రతిపక్షంలో ఉన్నా. చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డిల పాలనలో మంచిచెడులు చూశాను. సుదీర్ఘంగా ప్రతిపక్షంలో ఉన్న అనుభవాలతో సుపరిపాలన అందిస్తా. సంక్షేమం, అభివృద్ధి రెండింటికి ప్రాధాన్యం ఇస్తా' అని చెప్పారు. గత ప్రభుత్వం తెచ్చిన మంచి విధానాలను కొనసాగిస్తానని, తప్పుడు విధానాలను తొలగించి కొత్త వాటిని తీసుకొస్తానని చెప్పారు.

మోదీకి కౌంట్‌డౌన్..

2004 ఎన్నికల్లో 'దేశం వెలిగిపోతోంది' (ఇండియా షైనింగ్) అనే నినాదంతో నాటి ప్రధాని వాజపేయీ ప్రచారం చేశారని, కానీ 2004లోనేగాక, 2009 ఎన్నికల్లో కూడా యూపీఏ అధినేత్రి సోనియాగాంధీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. 'కేసీఆర్ సీఎంగా ఉండగా.. ఆయనను ఎవరూ ఓడించలేరని ప్రచారం జరుగుతుండేది. కానీ, వాస్తవానికి ఏం జరిగింది. మోదీ విషయంలోనూ అంతే. ఆయన కౌంట్ డౌన్ ఇప్పటికే స్టార్ట్ అయ్యింది. దేశానికి న్యాయం జరగాలంటే ఇండియా కూటమికి ఓటేయాలి' అని రేవంత్ పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిరం శ్రీరాముడిని విశ్వసించే హిందువులందరిదని, అది బీజేపీకి మాత్రమే పరిమితమైనది కాదని చెప్పారు. అయోధ్య రామాలయంతో బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని, ఇది ఆ పార్టీకి మేలు చేయదని హెచ్చరించారు. ఆలయ నిర్మాణం పూర్తి కాకుండా విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేయడం సరికాదని నిజమైన హిందువులు భావిస్తారని, పలువురు ఇదే విషయాన్ని చెప్పారని గుర్తు చేశారు. ఏదో ఒక రోజు అయోధ్య రామాలయాన్ని సందర్శిస్తానన్నారు. తెలంగాణలోని భద్రాచలంలోనూ రాముని గుడి ఉందని సీఎం గుర్తు చేశారు. అయోధ్య రామాలయానికి, భద్రాచలంలోని రామాలయానికి మధ్య తన దృష్టిలో తేడా ఏమీ లేదని చెప్పారు.

3 నెలల్లో ఆర్ఆర్ఆర్ భూసేకరణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియ కొంతకాలంగా పెండింగ్‌లో పడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ మాల పరియోజన ఫేజ్ వన్‌లో భాగంగా ఆర్ఆర్ఆర్ (నార్త్) 158.645 కి.మీ.ల మేర నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అవసరమైన భూసేకరణకు తెలంగాణ రాష్ట్రం సగం వాటా నిధులు భరించాల్సి ఉంటుంది. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు కోసం 1935.35 హెక్టార్ల భూసేకరణ జరపాల్సి ఉండగా ఇప్పటివరకు 1459.28 హెక్టార్ల సేకరణ పనులు పురోగతిలో ఉన్నాయి. గత ప్రభుత్వ సహాయ నిరాకరణ కారణంగా కొంతకాలంగా భూసేకరణలో ఎలాంటి పురోగతి లేదని, నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్ఏఐ)తో తలెత్తిన చిక్కుముడులను పరిష్కరించే ప్రయత్నాలూ జరగలేదనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో సత్వరం ఈ ప్రాజెక్టును పట్టాల మీదికి ఎక్కించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ఓఆర్ఆర్ లోపల అర్బన్ క్లస్టర్, ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్యలో సెమీ అర్బన్ క్లస్టర్, ఆర్ఆర్ఆర్ వెలుపలి ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా గుర్తించి పరిశ్రమల స్థాపనకు కొత్త విధానాన్ని రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తి చేయాల్సిన అంశంపై సీఎం అధికారులతో చర్చించారు. ఆర్ఆర్ఆర్ పూర్తయితే కొత్త రవాణా సదుపాయాలతో సెమీ అర్బన్ జోన్లో కొత్త పరిశ్రమలు రావటంతో పాటు అభివృద్ధి వేగం పుంజుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. నిలిచిపోయిన భూసేకరణను రానున్న మూడు నెలల్లో పూర్తి చేయాలని, ఆర్ఆర్ఆర్ (నార్త్) పనులకు టెండర్లు పిలవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ (సౌత్) ప్రాజెక్టును జాతీయ రహదారిగా ప్రకటించాలని, ఆ తర్వాత భూసేకరణ ప్రణాళికను రూపొందించాలని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల విజ్ఞప్తి చేశారు.

పేపర్ బాయ్‌లు, డిస్ట్రిబ్యూటర్లకు రాయితీతో ఈ-బైక్‌లు

- ఆయా కుటుంబాల సంక్షేమం కోసం బోర్డు
- ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ వినతి

రాంనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పత్రికల డిస్ట్రిబ్యూటర్లు, పేపర్ బాయ్‌లకు 80% సబ్సిడీతో ఎలక్ట్రిక్ మోటార్ బైక్‌లు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. అంతేకాక, ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి డిస్ట్రిబ్యూటర్లు, పేపర బాయ్‌ల కుటుంబాలను ఆదుకోవాలని విన్నవించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బుజ్జి మాట్లాడుతూ పేపర్ బాయ్ నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన తనకు పత్రికల డిస్ట్రిబ్యూటర్లు, పేపర్ బాయ్‌ల సమస్యలు తెలుసునని అన్నారు. ఆయా సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలిండియా న్యూస్ పేపర్ వెండర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సునీల్ పటాంకార్, ప్రధాన కార్యదర్శి పి.కె.సత్తార్, తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు వనమాల సత్యం, ప్రధాన కార్యదర్శి కె.రాంప్రసాద్‌రావు, కోశాధికారి రాజేందర్ మాట్లాడుతూ పత్రికల లోడింగ్, పంపిణీ కోసం రైతు బజార్ల మాదిరిగా ప్రత్యేక షెడ్‌లను నిర్మించాలని కోరారు.

ఎగిరే పతంగం.. తెగే ప్రాణం

(మొదటిపేజీ తరువాయి)

సోదరుడు చౌహాన్ శ్రీదేవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చర్లపల్లిలో తెగిపడిన గాలిపటాలను వెదుక్కుంటూ వెళ్లిన ప్రిన్స్ (8) సోమవారం అదృశ్యమయ్యాడు. అతడి మృతదేహం ముళ్లపొదల మధ్యన మంగళవారం లభ్యమైంది. కాగా, పతంగులు ఎగురవేస్తూ ఈ నెల 13న అత్తాపూర్‌లో తనిష్క్ (11) విద్యుదాఘాతానికి గురై, పేట్ బషీరాబాద్‌లో ఏఎస్సై కుమారుడు (20) భవనం పైనుంచి పడి చనిపోయారు. నాగోల్‌లో బాలుడు (13) మరో బిల్డింగ్ మీదకు దూకే క్రమంలో కిందపడి మృతి చెందాడు. హైదరాబాద్‌లో నాలుగు రోజుల్లో ఏడుగురు మృతిచెందారు. రాష్ట్రంలో మొత్తం 9 మంది ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు పండుగ ముందు రోజు లంగర్ హౌజ్ ఫ్లై ఓవర్‌పై చైనా మాంజా మెడకు తగిలి యువ సైనికుడు ప్రాణాలు కోల్పోయాడు.

మాంజాతో వాహనదారులకు తీవ్రగాయాలు

మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ దత్తాత్రేయ కాలనీ వాసి బుచ్చిరెడ్డి (50) సోమవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చైనా మాంజా మెడకు తగిలింది. వాహనాన్ని నిలిపి చూసుకునే సరికి టీషర్టు కాలర్ తెగి మెడ అర అంగుళం లోతుకు కోసుకుపోయింది. ఆయనను హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వికారాబాద్ జిల్లా బూర్గుపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప వాహనంపై ఎన్కెపల్లి నుంచి వికారాబాద్ వైపు వస్తుండగా రైల్వే వంతెనపై చైనా మాంజా తగిలి కంటి కింద కోసుకుపోయింది. మెదక్ జిల్లా నిజాంపేటకు చెందిన మహేందర్ బైక్‌పై రామాయంపేట వెళ్తుండగా చైనా మాంజా గొంతుకోసింది. హైదరాబాద్ రాంనగర్‌లో మేడపై పతంగి ఎగురువేస్తుండగా.. చైనా మాంజా మెడకు తగిలి ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. నిషేధిత చైనా మాంజాను విక్రయించొద్దని, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు హెచ్చరించినా వ్యాపారులు పెడచెవిన పెట్టారు. రోడ్డుమీదనే విక్రయాలు జరుగుతున్నా పోలీసులు పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయి.



కోడి పందేల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఊటుకూరులో బంపర్‌ప్రైజ్ కోసం ఏర్పాటుచేసిన కారు

రాష్ట్రంలో సంబురంగా సంక్రాంతి

ఇళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులు.. అందులో గొబ్బెమ్మలు.. డూడూ బసవన్నల ఆటలు.. నింగిలో రివ్వున ఎగిరిన పతంగులు.. నోరూరించే వంటకాలతో సంక్రాంతి పండుగను రాష్ట్ర ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. కనుమ సందర్భంగా గారెలు, బూరెలతో పాటు మాంసాహారంతో విందు చేసుకున్నారు. కాగా, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 13న మొదలైన అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ సోమవారంతో ముగిసింది.

కోడి పందేల కోసం ఖమ్మం మీదుగా ఏపీకి

ఏపీలోని సరిహద్దు గ్రామాల్లో కోడి పందేలను తిలకించేందుకు తెలంగాణ నుంచి సాధారణ వ్యక్తులు మొదలు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పలురంగాల ప్రముఖులు, ఉద్యోగులు భారీఎత్తున తరలడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా ఏపీ వెళ్లే రహదారులు రద్దీగా మారాయి. కాగా, సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లిన హైదరాబాద్ వాసులు తిరిగి వచ్చేందుకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశించారు. దీంతో ఏపీకి రోజువారీగా తిప్పే 386 సర్వీసులతో పాటు 50 అదనపు బస్సులు నడుపుతున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లుల సమస్య: కేటీఆర్



సిరిసిల్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'సర్పంచులకు పెండింగ్ బిల్లుల సమస్య ఉంది. గతంలో మన ప్రభుత్వం చేద్దామనుకున్నా కరోనా వల్ల కొంత కింద, మీద అయ్యింది. ఈ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ఆశిస్తున్నా. లేకుంటే సర్పంచుల తరఫున గొంతు విప్పి మాట్లాడుతాం. బిల్లులు ఇప్పించే బాధ్యత మాది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సర్పంచులకు ఆత్మీయ సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పల్లెల దశ, దిశ మార్చిన సర్పంచులకు సలాం అని, దశాబ్దాలపాటు దగా పడ్డ తెలంగాణ పల్లె దేశం ముందు సగర్వంగా కాలర్ ఎగిరేసేలా చేసిన మహాయజ్ఞంలో మనసు పెట్టి పనిచేసిన సర్పంచులకు హ్యాట్సాఫ్ అని కొనియాడారు. పదవులు వస్తాయి పోతాయని, పదవీ కాలంలో ప్రజలు యాది చేసుకునే విధంగా పనిచేశామా.. లేదా? అనేదే ముఖ్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా ఇప్పటికి పల్లెల్లో చాలామంది కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేరా? అని మాట్లాడుకోవడం అంటే పేదలకు, రైతులకు మంచి చేయడం, ఊర్లు, పట్టణాలు బాగు చేయడం వల్లే మంచి పేరు వచ్చిందని పేర్కొన్నారు. దేశానికి పల్లెలు పట్టుకొమ్మలని మహాత్మాగాంధీ కన్న కలలను సాకారం చేసిన నేల తెలంగాణ అన్నారు. ఆనాడు ఒక కవి రాసిన పల్లె కన్నీరు పెడుతుంది.. అనే పాట గుండెలను ద్రవింపజేసిందని, ఎట్లా ఉన్న పల్లెలు, చెరువులు ఎట్లా నాశనమయ్యాయని చిరాకు వచ్చి ప్రభుత్వాన్నే కూల్చిందని చెప్పారు. ప్రస్తుత సర్పంచులు, వారి పిల్లలు, వారి ఊరు తెలంగాణ బిడ్డలు గర్వపడే విధంగా పనిచేశారని కొనియాడారు. తెలంగాణ అభివృద్ధిపై గతంలో దేశంలోని ఇతర పార్టీల నాయకులను తాను సవాల్ చేశానని గుర్తు చేశారు. ఏ రాష్ట్రానికైనా వస్తానని.. తెలంగాణలో ఉన్నట్లు నర్సరీలు, డంపింగ్ యార్డులు, అంతిమ కార్యక్రమాలు సంస్కారవంతంగా జరిగే విధంగా వైకుంఠధామాలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించినట్లు చెప్పారు.

కొ..క్కొ..క్కో.. కోట్లు

- పండగ మూడురోజులూ జోరుగా పందేలు
- 400కోట్లు దాటిన కాకినాడ జిల్లా పందెం
- ఏపీలోని మిగతా జిల్లాల్లో రూ.కోట్లలో ఆట

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

సంక్రాంతి పండగకు ఏపీలో కోడి కూత రూ.కోట్లు దాటింది. ఎన్నికల ఏడాది కావడంతో వైసీపీ నేతలు బరుల్లో బరి తెగించారు. కత్తులు దూసే కోళ్ల ఆటలో ఓట్ల వేటను యథేచ్ఛగా సాగించారు. గుండాట, పేకాట, కోడి పందేలను దగ్గరుండి నిర్వహించారు. పోలీసులు వీటిపై కన్నెత్తి చూడకుండా ఒత్తిళ్లు తెచ్చి.. బెట్టింగురాయుళ్లకు ఎక్కడికక్కడ అండగా నిలబడ్డారు. కాకినాడ జిల్లాలో భోగి, సంక్రాంతి, కనుమకు కోడిపందేలు, గుండాట వ్యాపారం ఏకంగా రూ.450కోట్లు దాటేసింది. ఇందులో రూ.200 కోట్లు ఒక్క కనుమ రోజే పందేలు సాగాయి. ఒక్క గుండాటే రూ.250కోట్లకు పైగా ఉంటుందని అంచనా. కాకినాడ జిల్లాలోని పలు మండలాల్లో కోడిపందాల బరుల్లో ఒక్కోదాని నుంచి రూ.లక్ష వరకు పలు స్టేషన్లకు మామూళ్లు వెళ్లాయి. వీటిని స్థానిక వైసీపీ నేతలే మధ్యవర్తులుగా ఉండి పంపకాలు జరిపారు. భీమవరం సమీపంలోని పెదమీరంలోనే పెద్దమొత్తంలో పందేలు నిర్వహించారు. ఒకే ఒక్క పందెంలో రూ.3 కోట్లు చేతులు మారాయి. కాళ్ల మండలం సీసలి బరిలో ఒక్కో పందెం రూ.40 లక్షల వరకు పలికింది. మూడు రోజులపాటు ఈ జిల్లాలో తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, రాయలసీమ ప్రాంతానికి చెందిన పందెం రాయుళ్ల జోష్ కనిపించింది. సంక్రాంతి మూడు రోజుల్లో రూ. 20 కోట్ల మద్యం అమ్మకాలు సాగాయి. విభజిత తూర్పుగోదావరి జిల్లాలో సుమారు రూ.100 కోట్ల పందేలు సాగాయి. ఒక్కో బరికి పోలీసులకు రూ.2 లక్షల వరకూ ముట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ పందేల వెనుక వైసీపీ నేతలే ఉన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో ప్రభల ఉత్సవాల ముసుగులో అశ్లీల రికార్డింగ్ డ్యాన్సులు జోరుగా సాగాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడిపుంజులు కత్తులు దూస్తే, పొట్టేళ్ల పోట్లాటకు కాలు దువ్వాయి. మూడు రోజులపాటు సాగిన సంక్రాంతి సంబరాల్లో మొత్తంగా రూ.900 కోట్ల వరకు పందేలు జరిగినట్టు తెలుస్తోంది. తీరప్రాంతంలోని 216 జాతీయ రహదారిలో భారీ బరులు ఏర్పాటుచేసి కోడిపందేలు నిర్వహించారు. ఇందులో ఐదు పందేల్లో బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన ఓ ప్రముఖ వైద్యుడు రూ.7 లక్షలు గెలుపొందారు. కాగా, ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొండలరావుపాలెంలో మూడు ముసుగు పందేలు వేశారు. కోడిని బరిలో దించేవరకు దాని వివరాలు పందెగాళ్లకు తెలియకుండా ముసుగు వేస్తారు. పందెం కోళ్లకు కూడా ముందుగా కవ్వింపు చర్యలు ఉండవు. నేరుగా బరిలో కత్తి కట్టుకుని పోరాడతాయి. కొండలరావుపాలెంలో వేసిన మూడు పందేల్లో రెండు పెదకడిమికి చెందిన సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు గెలుచుకుని.. రూ.మూడు లక్షల విలువైన రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని అందుకున్నారు. పందేల బరి వద్ద కోసాట, గుండాట, పేకాట భారీ ఎత్తున జరిగింది. బరుల వద్దే మద్యం బహిరంగంగా విక్రయించారు.

రిటైర్డుకు మంగళం?

- పోస్టుల్లో కొనసాగుతున్న ఉద్యోగుల తొలగింపు
- రంగం సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- అలాంటివారి వివరాలు ఈ సాయంత్రంలోగా ఇవ్వండి
- అన్ని శాఖలకు అంతర్గత ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసినా కూడా వివిధ శాఖల్లో కొనసాగుతున్న వారిపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. సదరు రిటైర్డ్ ఉద్యోగులు, అధికారులకు సంబంధించి వివరాలను బుధవారం సాయంత్రం ఐదుగంటల్లోగా ఇవ్వాలంటూ అన్ని శాఖలను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులకు అంతర్గత ఉత్తర్వులను జారీ చేశారు. పదవీ విరమణ పొందిన తర్వాత కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇంకా ఇతరేతర ప్రాతిపదికన నియమితులైన అధికారులు, ఉద్యోగుల వివరాలను పంపాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సచివాలయ శాఖలు, విభాగాధిపతుల (హెచ్ఓడీ) కింద, ప్రభుత్వ రంగ కార్పొరేషన్లు, బోర్డులు, ఇతర ప్రభుత్వ ఏజెన్సీల రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో పని చేస్తున్నవారి వివరాలను అడిగారు. రిటైర్ అయినా ప్రభుత్వ శాఖల్లో కొనసాగుతున్న ఉద్యోగులు, అధికారులను తొలగించేందుకే సర్కారు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ మేరకు సదరు ఉద్యోగులు, అధికారులకు సంబంధించిన జాబితా సీఎస్‌కు అందగానే తదనుగుణంగా చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. రిటైరైనా పదవిలో కొనసాగుతున్న ఉద్యోగి, అధికారి పేరు, ఆ శాఖ, రిటైర్మెంట్ తేదీ, వైదొలిగే నాటికి హోదా, నియమితులైన తేదీ, నియామకమైంది కాంట్రాక్టు ప్రాతిపదికనా? ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికనా? ప్రస్తుతం ఏ హోదాలో కొనసాగుతున్నారు, ప్రస్తుతం పని చేస్తున్న కార్యాలయం, ఎంత కాలానికి నియమించారన్న వివరాలను పంపించాలని ఉత్తర్వుల్లో సీఎస్ ఆదేశించారు.

ఇప్పటికే సీఎం దృష్టికి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నియామకాలను ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తోంది. ప్రభుత్వ సలహాదారులు మొదలు... పీఏలు, పీఎస్‌లు, కార్పొరేషన్ల చైర్మన్లు, గ్రంథాలయ సంస్థల చైర్మన్లను తొలగిస్తూ వచ్చింది. వివిధ హోదాల్లో తిరిగి నియమితులైన రిటైర్డ్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను కూడా తొలగించింది. ఇక రిటైర్డు ఉద్యోగులు, అధికారుల అంశమే మిగిలింది. ఇప్పటికే పలు శాఖల్లో, విభాగాధిపతుల కింద, కార్పొరేషన్లలో చాలా మంది రిటైర్డు ఉద్యోగులు, అధికారులు నియమితులయ్యారు. కొన్ని చోట్ల వీరి పెత్తనం, వేధింపులు పెరుగుతున్నాయంటూ ఉద్యోగ సంఘాల నుంచి ఫిర్యాదులు కూడా ప్రభుత్వానికి అందాయి. కార్పొరేషన్ల ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ సంస్థల్లో పని చేస్తున్న రిటైర్డు ఉద్యోగులు, అధికారులను తొలగించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా పునరాలోచనలో పడినట్లు తెలిసింది. అన్ని శాఖల నుంచి వివరాలు అందగానే... ఈ రిటైర్డు ఉద్యోగులను ఇంటికి పంపించే అవకాశాలున్నాయని, అందుకే ఈ వివరాలను తెప్పించుకున్నట్లు చర్చ జరుగుతోంది.

అనంతగిరికి రూ.100 కోట్లు

భువనగిరి కోటకూ అంతే మొత్తం మంజూరు.. ట్యాంక్‌బండ్‌పై 60 కోట్లతో లేజర్ షో కు ఏర్పాట్లు

- రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రం కృషి
- ఆదివాసీల ప్రగతి కోసమే పీఎం జన్‌మాన్: కిషన్‌రెడ్డి



పెద్దేముల్ మండలం చైతన్యనగర్‌లో జరిగిన సమావేశంలో చెంచులకు ఆధార్‌కార్డులు ఇస్తున్న కిషన్‌రెడ్డి

వికారాబాద్/ధారూరు/పెద్దేముల్/బర్కత్‌పుర, జనవరి 16: వికారాబాద్ జిల్లా అనంతగిరి గుట్ట ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి, స్వదేశీ దర్శన్ కింద భువనగిరి కోటను 6 ఎకరాల్లో అభివృద్ధి చేయడానికి రూ.100 కోట్ల చొప్పున కేటాయించామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆ నిధులు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు వేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద రూ.60 కోట్లతో లేజర్ షో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టును సోమవారం కిషన్‌రెడ్డి సందర్శించారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కోట్‌పల్లి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. కాగా, సంక్రాంతి పర్వదినాన కిషన్‌రెడ్డి అనంతగిరిలోని శ్రీ అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. ఇక, ఆదివాసీ గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ పీఎం జన్‌మాన్(ప్రధాన మంత్రి జన్‌జాతీ ఆదివాసీ న్యాయ్ మహాభియాన్) పథకాన్ని ప్రవేశపెట్టారని కిషన్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం చైతన్యనగర్ గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. పీఎం జన్‌మాన్ ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని చెంచులతో కలిసి తిలకించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు ఆదివాసీ, గిరిజన తెగలకు సంబంధించి సౌకర్యాలు లేని 22 వేల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పించడానికి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ పథకం ప్రారంభమైన తొలి రోజునే లక్షమంది లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు కట్టుకోవడానికి వారి బ్యాంకు అకౌంట్లలో డబ్బులు వేశామని తెలిపారు. తెలంగాణలో 468 ఆదివాసీ గ్రామాలున్నాయని, అందులో 55 వేల మందికి పీఎం జన్‌మాన్ ద్వారా లబ్ధి కలగనుందని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాచిగూడ నింబోలి అడ్డాలో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పలువురికి ముద్ర రుణాల చెక్కులను అందజేశారు.

నేడు ఢిల్లీకి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి: కిషన్‌రెడ్డి బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. గురువారం జరిగే క్యాబినెట్ సమావేశానికి ఆయన హాజరవుతారు. అనంతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో భేటీ అయ్యే అవకాశం ఉంది. కాగా, పౌర విమానయానశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గురువారం హైదరాబాద్ రానున్నారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పార్టీ నిర్వహించే మీడియావర్క్‌షాప్‌కు ఆయన హాజరవుతారు.

సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్

బీజేపీ తెలంగాణ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ తివారీ నియమితులయ్యారు. రాజస్థాన్ రాష్ట్ర బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆయన.. అక్కడ పార్టీ అధికారంలోకి రావడానికి, బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి మెజారిటీ సీట్లు సాధించడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ అధినాయకత్వం సంస్థాగత బలోపేతంపై దృష్టిసారించిందని పార్టీ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు.

ఈ నెలలోనే మోదీ, షా, నడ్డా టూర్?

ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా.. ఈ నెలలోనే రాష్ట్ర పర్యటనకు వచ్చే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా షెడ్యూల్ రూపొందించుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులకు సమాచారం అందింది. మంగళవారం, ఢిల్లీలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటు క్లస్టర్ల సమావేశం అనంతరం బన్సల్.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సంస్థాగత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌తో పాటు ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, బంగారు శృతి, ప్రేమేందర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ ఆదిలాబాద్ పర్యటన దాదాపు ఖరారు అయిందని పార్టీ నేతలు తెలిపారు. ఆయన అధికారిక కార్యక్రమాలతో పాటు బహిరంగ సభలో పాల్గొంటారు.

గొర్రెల పంపిణీ అక్రమాల కేసు.. దూకుడు పెంచిన ఏసీబీ

ఫైళ్ల మాయం కేసును కలిపి ఒక్కటిగా దర్యాప్తు

త్వరలో పలువురికి నోటీసులు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీలో అక్రమాల కేసులో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దూకుడు పెంచింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పగించిన మొదటి కేసు కావడంతో.. సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి ఠాణా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచే.. ఏసీబీ అధికారులు సమాంతర దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే పలు ఆధారాలను సేకరించారని సమాచారం. గొర్రెల పంపిణీలో బినామీ పేర్లతో ఖాతాలు తెరిచి.. రూ.2.08 కోట్లను దారి మళ్లించడం, పశుసంవర్థక భవన్‌లో ఫైళ్ల మాయం కావడంపై హైదరాబాద్ పరిధిలోని నాంపల్లి, సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలిలో వేర్వేరుగా కేసులు నమోదైన విషయం తెలిసిందే.! ప్రభుత్వ ఆదేశాల మేరకు గొర్రెల పంపిణీ అక్రమాలపై విచారణ చేపట్టిన ఏసీబీ.. ఇరు కమిషనరేట్ల నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించింది. కోట్ల రూపాయల గోల్‌మాల్‌కు సంబంధించి నిజాలను నిగ్గుదేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదులో నలుగురు అధికారులు, ఇద్దరు కాంట్రాక్టర్ల పేర్లున్నాయి. ఈ కేసు ఏసీబీకి బదిలీ అవ్వడంతో.. ఇప్పుడు అధికారులు వీరికి నోటీసులు ఇచ్చి, విచారించేందుకు సిద్ధమయ్యారు. పశుసంవర్థక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న రవికుమార్, ఆదిత్య కేశవ్‌సాయి, రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో ఇద్దరు అధికారులు, కాంట్రాక్టర్లు, దళారులు గత సంవత్సరం ఆగస్టులో ఆంధ్రప్రదేశ్ నుంచి 18 మంది రైతుల వద్ద 133 యూనిట్ల గొర్రెలను సేకరించారు. ఆ మేరకు ఏపీ రైతుల ఖాతాలో జమచేయాల్సిన రూ.2.08 కోట్లను బినామీ ఖాతాలకు దారి మళ్లించారు. బినామీ ఖాతాలు ఎవరివి, వాటి నుంచి ఎవరెవరి ఖాతాలకు నగదు బదిలీ జరిగింది? అనే వివరాలపై ఏసీబీ అధికారులు కూపీ లాగుతున్నారు. ఈ వివరాల కోసం బ్యాంకు అధికారులకు లేఖలు రాసి, వివరాలను సేకరించనున్నారు. మరోవైపు పశుసంవర్థక భవన్‌లో కీలక ఫైళ్లు మాయమవ్వడానికి, గొర్రెల పంపిణీ నిధుల గోల్‌మాల్‌కు సంబంధం ఉన్నట్లు ఏసీబీ భావిస్తోంది. ఫైళ్ల మాయం వెనక మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వద్ద ఓఎస్డీగా పనిచేసిన కల్యాణ్ కుమార్ ప్రమేయం ఉందనే సందేహాలు వ్యక్తమవుతుండటంతో.. నాంపల్లి పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు జరిపారు. కల్యాణ్‌కు కూడా ఏసీబీ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఫైళ్ల మాయం, నిధుల గోల్‌మాల్ కేసులకు లింకు ఉండడంతో.. ఒకే కేసుగా పరిగణించి, దర్యాప్తు జరపాలని ఏసీబీ నిశ్చయించినట్లు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో
లా ప్రోగ్రామ్‌లు



ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ కేజీపీ) ఆధ్వర్యంలోని రాజీవ్ గాంధీ స్కూల్ ఆఫ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా - ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎల్ఎల్‌బీ: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఇది ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని సైన్స్, టెక్నాలజీ విభాగాల అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ/మెడిసిన్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; సైన్స్, ఫార్మసీ విభాగాల్లో పీజీ పూర్తిచేసినవారు; వీటిలో ఒక డిగ్రీతోపాటు ఎంబీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

సీబీటీ వివరాలు: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్ 36 మార్కులకు ఉంటుంది. ఇందులో మేథ్స్ ఆప్టిట్యూడ్ నుంచి 8, సైన్స్ ఆప్టిట్యూడ్ నుంచి 10 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్ 164 మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లీష్ నుంచి 35, లాజికల్ రీజనింగ్ నుంచి 12, లీగల్ ఆప్టిట్యూడ్ నుంచి 35 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఎల్ఎల్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

స్పెషలైజేషన్‌లు: ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా, ఇంటర్నేషనల్ లా, క్రిమినల్ లా

సీట్లు: ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో అయిదేళ్ల ఎల్ఎల్‌బీ/బీఎల్ ప్రోగ్రామ్ ఉత్తీర్ణులు; హ్యూమానిటీస్, సైన్స్, కామర్స్ విభాగాల్లో డిగ్రీతోపాటు మూడేళ్ల ఎల్ఎల్‌బీ/బీఎల్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. సంస్థ అందిస్తున్న ఎల్ఎల్‌బీ ఆనర్స్(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా) ప్రోగ్రామ్‌ను కనీసం 8.5 సీజీపీఏతో పూర్తిచేసినవారికి నేరుగా ప్రవేశం కల్పిస్తారు.

సీబీటీ వివరాలు: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన ఎల్ఎల్‌బీ సిలబస్ నుంచి 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.3,000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 17 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** వరంగల్
- **సీబీటీ తేదీ:** మార్చి 17
- **వెబ్‌సైట్:** iitkgp.ac.in

ఐఐఎం బోధ్‌గయలో
డాక్టోరల్ ప్రోగ్రామ్

బోధ్‌గయలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) - డాక్టోరల్ (పీహెచ్‌డీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



స్పెషలైజేషన్‌లు: మార్కెటింగ్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, స్ట్రాటజీ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిస్టమ్స్ అండ్ అనలిటిక్స్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, హ్యూమానిటీస్ అండ్ లిబరల్ ఆర్ట్స్(బిజినెస్ కమ్యూనికేషన్)

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; కనీసం 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఆర్క్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతూ 2024 జూన్ 30 నాటికి పై కోర్సులు పూర్తయ్యే అభ్యర్థులు కూడా అర్హులే. క్యాట్ 2021/2022/2023 లేదా జీఆర్ఈ/జీమ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా జేఆర్ఎఫ్(యూజీసీ/సీఎస్ఐఆర్) అర్హత ఉండాలి. ఐఐఎంల నుంచి రెండేళ్ల ఫుల్ టైం పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(పీజీపీ) ఉత్తీర్ణులకు ఈ స్కోర్ అవసరం లేదు. వీరికి నేరుగా అడ్మిషన్ ఇస్తారు. అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

వెయిటేజీ: క్యాట్, జీమ్యాట్ పరీక్షల్లో ఓవరాల్‌గా 80 శాతం, సెక్షనల్‌గా 70 శాతం స్కోర్ ఉండాలి. జీఆర్ఈలో సెక్షనల్‌గా 70 శాతం స్కోర్ ఉండాలి. జేఆర్ఎఫ్, గేట్ అర్హత పొందితే చాలు. పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 60 శాతం; అనుభవానికి 15 శాతం; పదోతరగతి, ఇంటర్ మార్కులకు ఒక్కోదానికి 5 శాతం; డిగ్రీ మార్కులకు 10 శాతం(బీఈ/ బీటెక్ మార్కులకు 15 శాతం); పీజీ మార్కులకు 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: కాంప్రహెన్సివ్ ఎగ్జామ్ వరకు నెలకు రూ.32,800; ఆ తరవాత నెలకు రూ.35,400; థీసిస్ పేపర్ అప్రూవ్ అయిన తరవాత నెలకు రూ.39,300ల స్టయిపెండ్ ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.25,000; లాప్‌టాప్ గ్రాంట్ కింద రూ.50,000; కాన్ఫరెన్స్ గ్రాంట్ కింద రూ.1,75,000 చెల్లిస్తారు.


ముఖ్యసమాచారం

- **దరఖాస్తుకు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; మహిళలు, దివ్యాంగులు, ఈడబ్ల్యుఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** iimbg.ac.in

భారత రాజ్యాంగం - ముఖ్య చట్టాలు

టీఎస్‌పీఎస్సీ/ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

1858 చట్టానికి పూర్వం భారతదేశంలో బ్రిటిష్ ప్రతినిధిని గవర్నర్ జనరల్ అని పిలిచేవారు(బ్రిటిష్ ఇండియాలో). 1858 చట్టం తరవాత వైశ్రాయ్ అనే పదం వ్యవహారంలోకి వచ్చింది. కానీ వ్యవహారికంలో బ్రిటిష్ ప్రతినిధిని బ్రిటిష్ పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ జనరల్‌గా, స్వదేశీ సంస్థానాల్లో వైశ్రాయ్‌గా పిలిచేవారు. 1858 చట్టం ఫలితంగా, 1784 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ అనే పదవులు రద్దయ్యాయి. 1858 భారత ప్రభుత్వ చట్టంతోనే భారత రాజ్యాంగ చరిత్ర ప్రారంభమైందని రాజ్యాంగ విశ్లేషకుడు డి.డి.బసు పేర్కొన్నాడు.

కౌన్సిల్ చట్టం-1861: ఈ చట్టం ద్వారా వికేంద్రీకృత పాలనను తిరిగి పునరుద్ధరించినట్లయింది. 1773 చట్టం ద్వారా రద్దు చేసిన బొంబే, మద్రాస్ శాసనాధికారాలను పునరుద్ధరించారు. కొత్తగా పంజాబ్, బెంగాల్ నార్త్ ఈస్టర్న్ ఫ్రాంటెయిర్‌ల్లో నూతన లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను ఏర్పాటుచేశారు.

- భారతదేశంలో మొదటిసారిగా బ్రిటిష్ పాలిత రాష్ట్రాల్లో 'శాసన మండళ్లు' ఏర్పాటుచేశారు. రాజ్యాంగ నిర్మాణంలో భారతీయ రాజులకు, జమీందారులకు అవకాశాన్ని కల్పించారు.
- పోర్టుఫోలియో విధానాన్ని మొదటిసారిగా 1859లో ప్రవేశపెట్టారు. ఈ చట్టం ద్వారా 1862లో కలకత్తా, బొంబే, మద్రాస్‌ల్లో మొదటగా హైకోర్టులను ఏర్పాటు చేశారు. గవర్నర్ జనరల్‌కు ఆర్డినెన్స్‌లను జారీచేసే అధికారాన్ని కల్పించారు. కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటిసారిగా భారతీయులకు ప్రాతినిధ్యాన్ని కల్పించారు. అలా ప్రాతినిధ్యం పొందివారు 1. నాగేంద్రసింగ్(పాటియాలా మహారాజు) 2. నారాయణ్‌సింగ్(బెనారస్ మహారాజు) 3. సర్ దినకర్‌రావు.

కౌన్సిల్ చట్టం-1892: 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటవడం, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వివిధ స్వాతంత్ర్య ఉద్యమాలపై భారతీయులు అవగాహన పెంపొందించుకోవడం, బ్రిటిష్ పాలనలో లోపాలను అవగాహన గల భారతీయులు సమాజంలో ప్రచారం చేయడం ఫలితంగా ఈ చట్టాన్ని రూపొందించారు.

- దేశంలో శాసనమండలికి తొలిసారి పరోక్ష ఎన్నికలు జరిగాయి. ఈ చట్టం ద్వారా కేంద్ర శాసనసభలో భారతీయుల ప్రాతినిధ్యాన్ని ఆరుగురికి పెంచారు. ఈ చట్టం ద్వారా శాసనసభలో సభ్యత్వాన్ని పొందినవారు- 1) సురేంద్రనాథ్ బెనర్జీ 2) గోపాలకృష్ణ గోఖలే 3) దాదాబాయ్ నౌరోజీ 4) రాస్ బిహారి ఘోష్ 5) బిల్‌గ్రామి 6) ఫిరోజ్ షా మెహతా

మింటో మార్లే సంస్కరణలు-1909: వైశ్రాయ్‌గా మింటో, రాజ్య కార్యదర్శిగా మార్లే ఉన్నారు. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేశారు. ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పరిమిత ప్రాతిపదికన ప్రవేశపెట్టారు. అలాగే కేంద్ర శాసనశాఖ సభ్యుల సంఖ్యను 60 మందికి పెంచారు.

- వ్యాపారులకు ప్రత్యేక నియోజకవర్గాలను కేటాయించారు. విద్య, సంపద, పన్ను చెల్లింపుల ఆధారంగా పరిమిత ఓటుహక్కును కల్పించారు. కేంద్ర శాసనశాఖ దేశ బడ్జెట్‌ను చర్చించవచ్చు. అదేవిధంగా గవర్నర్ జనరల్ కమిటీలో ఎంపికకు భారతీయులకు అవకాశాన్ని కల్పించారు. కేంద్ర శాసనసభలో బడ్జెట్‌తో సహా అన్ని అంశాలపై ప్రశ్నించే అవకాశాన్ని, తీర్మానాలు ప్రవేశపెట్టే అవకాశాలను కల్పించారు.

గమనిక: 1) గవర్నర్ జనరల్ కమిటీకి నియమితులైన మొదటి భారతీయుడు సత్యేంద్రసిన్హా.
2) మింటోను మత నియోజకవర్గాల పితామహుడిగా పిలుస్తారు.
3) ఈ చట్టమే దేశం ఇండియా-పాకిస్తాన్‌లుగా విడిపోవడానికి కారణమని విశ్లేషకుల అభిప్రాయం.

మాంటేగ్-ఛేమ్స్‌ఫర్డ్ చట్టం-1919: ఈ చట్టం ద్వారా భారతదేశంలో పార్లమెంటరీ తరహా విధానాన్ని ఏర్పాటుచేశారు.(బాధ్యతాయుత ప్రభుత్వం). అప్పటికీ బ్రిటిష్ ఇండియాలో ప్రావిన్స్‌లు(రాష్ట్రాలు) ఉండటం వల్ల కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితాలు రూపొందించారు. కేంద్ర జాబితా 47, రాష్ట్ర జాబితా 51 పాలనా అంశాలుండేవి. వైశ్రాయ్‌గా ఛేమ్స్‌ఫర్డ్, రాజ్య కార్యదర్శిగా మాంటెగ్ వ్యవహరించారు.

- భారత హైకమిషనరేట్‌ను ఏర్పాటు చేశారు. దీని కార్యాలయం లండన్‌లో ఉంది.
- బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. రాష్ట్రాల్లో ద్వంద్వపాలనా విధానాన్ని ప్రవేశపెట్టారు. (ద్వంద్వ పాలనకు విలియం డ్యూక్ పునాది వేశారు).
- ద్వంద్వపాలన అంటే కొన్ని పాలనా అంశాలు(కీలకమైనవి) బ్రిటిష్‌వారి ఆధీనంలో పెట్టుకొని, మరికొన్ని అంశాలను భారతీయులకు అప్పగించడం.

1. రిజర్వ్‌డ్ అంశాలు: దీనిలో 28 పాలనాంశాలు ఉంటాయి. ఉదాహరణకు భూమి శిస్తు, ఆర్థిక, న్యాయ, జైళ్లు, నీటిపారుదల మొదలైనవి.

2. ట్రాన్స్‌ఫర్డ్ అంశాలు: దీలో 22 పాలనాంశాలుంటాయి. ఉదాహరణకు విద్య, వైద్యం, ప్రజారోగ్యం, వ్యవసాయం, స్థానిక సంస్థలు, రోడ్డు రవాణ

కేంద్రంలో ద్విసభా విధానాన్ని ప్రవేశపెట్టారు.

1. కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్: ఇది ఎగువ సభ. దీనిలో 60 మంది సభ్యులుంటారు.(ఎన్నికైనవారు 36 మంది, నామినేటెడ్ 24 మంది). సభ పదవీకాలం అయిదు సంవత్సరాలు. దీని తొలి చైర్మన్ ఫెడరిక్ వైట్.

2. లెజిస్లేటివ్ అసెంబ్లీ: ఇది దిగువసభ. దీనిలో సభ్యులు 144 మంది ఉంటారు. (ఎన్నికైనవారు 103, నామినేటెడ్ 41). సభ పదవీకాలం మూడు సంవత్సరాలు. దీనికి తొలి అధ్యక్షునిగా విఠల్‌బాయ్ జి.పటేల్, తొలి ఉపాధ్యక్షునిగా సచ్చిదానంద సిన్హా ఉన్నారు.

- సిక్కులకు, భారతీయ క్రైస్తవులకు, ఆంగ్లో-ఇండియన్లకు, యురోపియన్లకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటుచేశారు. లీ కమిషన్(1923-24) ఆధారంగా 1926లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేశారు. దీనికి తొలి చైర్మన్‌గా రాస్ బార్కర్.
- కేంద్ర బడ్జెట్ నుంచి రాష్ట్ర బడ్జెట్‌ను వేరుచేశారు. 1921లో ప్రభుత్వ ఖాతాల సంఘాన్ని ఏర్పాటుచేశారు. అలాగే సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను వేరు చేశారు. ఆడిటర్ జనరల్‌ను కూడా ఏర్పాటుచేశారు.
- గవర్నర్ జనరల్ కమిటీలోని ఆరుగురు సభ్యులకుగాను ముగ్గురు భారతీయులకు స్థానం లభించింది. ఈ చట్టాన్ని పది సంవత్సరాల తరవాత సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. 1921 నుంచి ఈ చట్టాన్ని అమలుపరిచారు.

విమర్శ: జాతీయోద్యమ నాయకులు ఈ చట్టాన్ని కిందివిధంగా విమర్శించారు.

1. మాంటెంగ్-ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు 'బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించాల్సింది కాదు, భారతీయులు స్వీకరించడం సరికాదు' - **అనిబిసెంట్**
2. ఈ సంస్కరణలు భారతీయులకు నిరాశను కల్గించడమే కాక, అసంతృప్తినీ మిగిల్చాయి. సూర్యుడు లేని ఉదయం లాంటివి - **బాలగంగాధర్ తిలక్.**
3. 'నేరమే అధికారమై నేరం చేస్తుంటే చూస్తూ ఊరుకున్న ప్రతి ఒక్కడూ నేరస్థుడే'. - **మహాత్మా గాంధీ**



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

లిటిల్స్



పిల్లి మెడకు గంట కట్టేదెవరూ?


ఒక ఊరిలో నక్షత్రకుడు అనే వ్యాపారి ఉండేవాడు. అతను పట్టిందే బంగారం. ఏ వ్యాపారం చేసినా కలిసొచ్చేది. కిరాణా సామాన్లుకు సంబంధించిన వ్యాపారాలు చేసి ధనం గడించాడు. అతనికి తీపి పదార్థాలుండే దుకాణం పెట్టాలని ఎప్పటినుంచో కోరిక ఉండేది. తన వృద్ధాప్యంలో తీపి పదార్థాల దుకాణం పెట్టాడు. ఆ వ్యాపారం బాగా సాగుతోంది. ముఖ్యంగా నేతి మిఠాయిలు, నేతి లడ్డూలు.. లాంటి తీపి పదార్థాలకు ఆ దుకాణం పేరుగాంచింది.

ఒక రోజు దుకాణం మూసేసేటప్పుడు ఎలుకల చప్పుడు వినిపించింది వ్యాపారికి. పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత నాలుగైదు రోజులకు ఎలుకల గుంపు ఎక్కువయి కొట్టులో ఉండే తిండిని అంతా పాడుచేస్తున్నాయి. ఏమి చేయాలో పాలు పోక ఆ వ్యాపారి తన మిత్రుడికి మొరపెట్టుకున్నాడు. 'పిల్లి తీసుకువస్తే సరి' అన్నాడు తన మిత్రుడు. ఓ గండు పిల్లిని తీసుకొచ్చాడు వ్యాపారి. ఆ పిల్లి అరుపులతో ఎలుకలు కనపడకుండా పోయాయి.


ఆ తర్వాత ఎలుకలను చంపి పడేసేది పిల్లి. చూస్తుండగానే ఎలుకలన్నీ దాదాపు కనుమరుగయ్యాయి. ఎక్కడ ఉన్నా ఎలుకను పట్టుకునేది పిల్లి. బయటికి రాలేక ఆకలితో లోపలే ఉండిపోయేవి. బయటికి వస్తే మాత్రం ప్రాణాలు పోగొట్టుకునేవి. ఇక చావు తప్పదా? అంటూ కొన్ని ఎలుకలు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఎవరి బాధ వారిది. ఆ పిల్లిని తరిమి కొట్టాలి లేదా అది వస్తోందని మనకు ముందే తెలియాలి.. మార్గం ఉంటే చెప్పమని మాట్లాడుకున్నాయి. వాటిలో ముసలి ఎలుక వచ్చి ఇలా అన్నది.. 'ఆ పిల్లి భయపడదు. దాన్ని గెంటేయలేం. అయితే దాని రాకను పసిగట్టొచ్చు. మాయదారి పీడనుంచి మనం రక్షించుకోవచ్చు' అన్నది. 'ఏమి చేయాలని?' ఉత్సాహంతో అడిగాయి ఎలుకలు. 'ఆ పిల్లి మెడకు గంట కడితే సరి. అది వచ్చేప్పుడు శబ్దం వినపడుతుంది' అన్నది పెద్ద ఎలుక. అంతలో పిల్లి వచ్చింది. ముసలి ఎలుక వేగంగా వెళ్లి బొరియలో దాక్కుంది. మిగతా ఎలుకలూ మాయమయ్యాయి. పిల్లి మెడకు గంట కట్టాలనే ఆలోచన ఉన్నా.. ఎవరూ ముందుకు రాలేదు. అలా ఆ కొట్టులో ఎలుకల జాడ మాయమైంది.




దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



చుక్కలు కలపండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 205

					1		3	
	5	4	3		2			
			5	7		2	4	
				9				5
8								4
2				8				
	4	7		1	3			
			4		6	8	7	
	3		7					

సుడోకు - 204 సమాధానం

8	9	4	2	1	3	6	5	7
5	2	3	7	9	6	1	4	8
7	6	1	8	4	5	2	3	9
4	7	5	1	2	9	3	8	6
9	1	8	6	3	4	7	2	5
2	3	6	5	8	7	9	1	4
3	5	7	4	6	1	8	9	2
6	8	9	3	5	2	4	7	1
1	4	2	9	7	8	5	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

JN Tata Endowment Loan Scholarship for Fall 2024 to Spring 2025

Description: The J N Tata Endowment invites loan scholarship applications from Indian students who wish to pursue higher studies overseas. Students who are selected for the loan scholarship may be recommended for a partial 'Travel Grant' and a 'Gift Award' which is linked to their academic performance in their overseas studies at the sole discretion of the Trustees of the concerned Trusts.

Eligibility: Open for Indian citizens who have completed at least one undergraduate degree OR students who are in the final year of any undergraduate programme at a recognised university/ college/ institution in India.

- Candidates must be interested to pursue Postgraduate/ Doctoral/ Postdoctoral studies abroad.
- Candidates who are at the end of the 1st year and entering into the second year of their overseas studies (Fall 2024 – Spring 20 25) are also eligible to apply. This is applicable only if the minimum duration of the course is 2 years and there is at least one full academic year remaining to complete at the time of award of the loan scholarship, which is normally by July of any calendar year.
- Candidates must have scored at least 60% marks on average in their undergraduate or postgraduate studies.
- Candidates must not be older than 45 years as on June 30, 2024.

Prizes & Rewards: Loan scholarship of up to Rs. 10 lakhs

Last Date to Apply: 15-03-2024 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/JNT8

SCHOLARSHIP ALERT

V Able - Vidyadhan Disability Scholarship for Graduates



Description: V Able - Vidyadhan Disability Scholarship for Graduates 2023-24 is an opportunity offered by the Sarojini Damodaran Foundation (SDF), a non-profit organisation based in India, to Class 12 passed students facing disability.

Eligibility: Open for disabled students who have completed Class 12 and enrolled in a degree course in the year 2022, with at least 60% marks or a CGPA of 6 in their HSC examination. Students' annual family income must be below 4,00,000.

Prizes & Rewards: Up to 60,000 per annum

Last Date to Apply: 31-01-2024

Application: Online only

Short Url: www.b4s.in/aj/VVDS2

Tata Innovation Fellowship 2023-24

Description: Tata Innovation Fellowship 2023-24 is an opportunity offered by the Department of Biotechnology, Ministry of Science & Technology, Government of India, to recognise and reward scientists in the fields of Biology and Biotechnology.

Eligibility: Open for Indian nationals under 55 years of age with a Ph.D. degree in Life Sciences, Agriculture, Veterinary Science, or a Master's degree in Medical Sciences, Engineering, or a closely related field.

- Applicants must have at least 5 years of postdoctoral research experience at a renowned national lab, university, or institute.
- Students should demonstrate an exceptional record of publications in peer-reviewed journals.
- Candidates must have made significant contributions to developing technologies or products.

Prizes & Rewards: A monthly fellowship of 25,000 and an annual contingency grant.

Last Date to Apply: 05-02-2024

Application mode : Online only

Short Url: www.b4s.in/aj/TIF1

buddy4study.com